www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 107

సోమవారం | 15-7-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా. 7.19 తదుపరి దశమి; నక్షత్రం: స్వాతి రా. 12.30 తదుపరి విశాఖ; వర్జ్యం: శేషం ఉ.6.01; దుర్ముహూర్తం: మ.12.46-1.38, మ.3.22-4.14; అమృతఘడియలు: మ.2.49-4.34; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ట్రంప్ కుడి చెవికి తగిలి దూసుకెళ్తున్న బుల్లెట్ (వృత్తంలో). న్యూయార్క్ టైమ్స్ పత్రిక సీనియర్ ఫొటోగ్రాఫర్ డగ్ మిల్స్ తన ప్రత్యేక కెమెరాతో ఈ ఫొటో తీశారు. సెకనుకు 1/8,000 షట్టర్ స్పీడ్‌తో పని చేసే ఈ కెమెరా సెకనుకు 30 ఫ్రేమ్‌లను ఫొటో తీయగలదు.



కాల్పులు జరిగిన వెంటనే డొనాల్డ్ ట్రంప్ చుట్టూ రక్షణగా నిలబడిన భద్రతా సిబ్బంది
2

ట్రంప్‌పై హత్యాయత్నం

రైఫిల్‌తో కాల్పులు జరిపిన యువకుడు.. వెంటనే స్పందించిన సీక్రెట్ ఏజెంట్లు

దుండగుడి కాల్చివేత.. ట్రంప్ క్షేమం.. కుడి చెవి పైభాగంలో తూటా గాయం

- ట్రంప్‌ను ఆస్పత్రికి తరలించిన ఏజెంట్లు.. నిందితుడిని గుర్తించిన ఎఫ్‌బీఐ
- పక్కా ప్లాన్‌తో కాల్పులు జరిపిన క్రూక్స్.. అతడు రిపబ్లికన్ పార్టీ అభిమాని!
- కాల్పులకు ముందు వీడియో పోస్ట్.. దుండగుడిని ముందే పసిగట్టిన ఓ వ్యక్తి
- సెక్యూరిటీ ఏజెంట్లకు సమాచారం.. ట్రంప్‌ను అప్రమత్తం చేయని సిబ్బంది
- దాడిని ఖండించిన జో బైడెన్.. యూఎస్‌లో హింసకు తావు లేదని వ్యాఖ్య
- ట్రంప్‌పై హత్యాయత్నాన్ని ఖండించిన మోదీ, రాహుల్, పలు దేశాల నేతలు
- రాబోయే అమెరికా ఎన్నికల్లో భారీగా పెరిగిన ట్రంప్ విజయావకాశాలు!

వేలాదిమందితో అమెరికా ఎన్నికల ప్రచార సభ.. చుట్టూ అభిమానులు, అనుకూలంగా నినాదాలు.. 2 రోజుల్లో అభ్యర్థిత్వం ఖరారు కానుండటంతో రెట్టించిన ఉత్సాహంతో రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్. 'మీరు నిజంగా విచారకరమైనదాన్ని చూడాలనుకుంటే.. ఏం జరిగిందో చూడండి' అంటూ ఉద్వేగంగా ప్రసంగం.. యాదృచ్ఛికమే అయినా, ఆయన మాటలు అలా తూటాల్లా పేలుతుండగానే దూసుకొచ్చిందో నిజమైన తూటా.. సమీపంలోని ఓ భవనంపై నుంచి తుపాకీతో దుండగుడి కాల్పులు.. బుల్లెట్ చెవిని తాకుతూ వెళ్లడంతో చివ్వున చిమ్మిన రక్తం.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పెన్సిల్వేనియా రాష్ట్రంలో ప్రచారంలో ఉన్న సమయంలో జరిగిన ఈ హత్యాయత్నం నుంచి ట్రంప్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు.


ఎస్ కే జోషి


సోమేశ్‌కుమార్

ఇక ఐఏఎస్‌ల వంతు..

- నేడు కాళేశ్వరంపై ప్రస్తుత, మాజీ అధికారుల విచారణ
- పీసీ ఘోష్ కమిషన్ సమన్లు
- మాజీ సీఎస్‌లు సోమేశ్‌కుమార్, ఎస్‌కే జోషీకి పిలుపు
- స్మిత సభర్వాల్, రజత్‌కుమార్, కె.రామకృష్ణారావు, నాగిరెడ్డిలకూ


స్మితా సభర్వాల్


రజత్‌కుమార్

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలు, అవకతవకలపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం పలువురు తాజా, మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారులను విచారించనుంది. వీరిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా రిటైరైన సోమేశ్‌కుమార్, శైలేంద్ర కుమార్ జోషీ ఉన్నారు. వారితోపాటు ఆర్థిక శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి వి.నాగిరెడ్డి, ఆ శాఖ

మిగతా 13వ పేజీలో...

ప్రభుత్వం కూలుతుందన్న వాళ్లు..

ఇప్పుడు ఎక్కడ?

వాళ్లు పడగొడతామంటే.. ఎమ్మెల్యేలు నిలబెడతామంటున్నారు!

- తెలంగాణ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నారు
- ఏ గూట్లో చేయి పెట్టినా అప్పుల కాగితమే కనిపిస్తోంది
- ప్రతి నెలా వడ్డీలే రూ.7 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది
- మహేశ్వరాన్ని మరో న్యూయార్క్‌లాగా అభివృద్ధి చేస్తాం
- చదువు ద్వారా బలహీనవర్గాలు పాలకులుగా ఎదగాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారం చేయకపోతే ఎంపీలు, ఎమ్మెల్యేల ఉద్యోగాలు ఉండవు
- హయత్‌నగర్ వరకు మెట్రో రైలు విస్తరణ: సీఎం రేవంత్
- గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాల పంపిణీ


గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వాన్ని పడగొడతామని అచ్చేసిన ఆంబోతుల్లా బీఆర్ఎస్, బీజేపీ వాళ్లు అంటే.. మేం నిలబెడతామని ఎమ్మెల్యేలు ముందుకు వస్తున్నరు. తెచ్చుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే సర్కారుకు అండగా ఉంటామంటున్నరు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సర్కారు పనయిపోయిందని, కూలిపోతుందని అన్న వాళ్లు ఇప్పుడు ఎక్కడున్నారని, రోజులు లెక్క

మిగతా 13వ పేజీలో...

నేటి నుంచి ఆన్‌లైన్‌లో సీఎంఆర్ఎఫ్

- సాయం కోసం నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం
- మూడు నిమిషాల్లోనే దరఖాస్తు సమర్పించే వీలు
- ఆన్‌లైన్‌లో 4వేల ఆస్పత్రులు అందుబాటులోకి
- లోతైన విచారణ తర్వాతే సీఎంఆర్ఎఫ్ సాయం

13

'అనర్హ' లబ్ధిదారుల నుంచి

రికవరీలు వద్దు

- అసెంబ్లీలో చర్చలయ్యాకే రికవరీకి మార్గదర్శకాలు
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సంబంధించి కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

13



మరో డీఎస్సీ!

5- 6 వేల ఉద్యోగాలతో త్వరలో నోటిఫికేషన్

ప్రస్తుత డీఎస్సీని వాయిదా వేయం.. అలా చేస్తే అభ్యర్థులకే నష్టం

విద్యా వ్యవస్థ బలోపేతం మా లక్ష్యం.. ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయడం కుదరదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇదే చివరి డీఎస్సీ కాదని.. మరిన్ని ఉంటాయని చెప్పారు. త్వరలో 5 వేల నుంచి 6 వేల పోస్టులతో కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. డీఎస్సీని పకడ్బందీగా నిర్వహిస్తామని.. విద్యా వ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి బోధన అందాలనేదే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తొందరగా ఉద్యోగాలివ్వడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. గాంధీభవన్‌లో ఆదివారం భట్టి మీడియాతో మాట్లాడారు. కొంతమంది నియామక పరీక్షలు వాయిదా వేయాలని ధర్నా చేస్తున్నారని.. అలాచేస్తే నష్టపోయేది అభ్యర్థులేనని అన్నారు. ఈ నెల 11 నుంచే డీఎస్సీ హాల్ టికెట్లు అందుబాటులో ఉంచామని.. కొన్ని నెలలుగా అభ్యర్థులు సిద్ధం అవుతున్నారని.. 18వ తేదీ నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహించనున్నామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పదేళ్లపాటు గ్రూప్-1 నిర్వహించనే లేదని విమర్శించారు. గ్రూప్-2ను మూడుసార్లు వాయిదా వేసిన సంగతిని గుర్తుచేశారు. పరీక్షలను అన్నిసార్లు వాయిదా వేయడం సరికాదన్నారు. నిరుద్యోగులకు నష్టం కలగకూడదనేదే తమ

మిగతా 12వ పేజీలో...

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

- చదువు.. ఆరోగ్యం.. క్రీడలు.. సామూహిక అక్షరాభ్యాసాలు
- నేటి నుంచి 6 రోజుల పాటు పలు కార్యక్రమాలు
- పేద పిల్లలకు ప్రైవేటు తరహా ప్రీ స్కూల్ విద్య: మంత్రి సీతక్క

12

ప్రియురాలు చెప్పిందని..

భార్య, ఇద్దరు పిల్లలను చంపిన వైద్యుడు

- విషపు ఇంజెక్షన్‌తో భార్య ప్రాణాలు తీసి.. కుమార్తెలను ముక్కు, నోరు మూసి హత్య
- కారును చెట్టుకు ఢీకొట్టి ప్రమాదంగా ప్రచారం
- 48 రోజుల తర్వాత వీడిన మిస్టరీ.. భర్త అరెస్టు


చిన్నారులు కృతిక, కృషిక (ఫైల్)

రఘునాథపాలెం, జూలై 14: కట్టుకున్న భర్తే వైద్యుడు! తనకొచ్చిన జ్వరం నయమయ్యేందుకు ఇంజెక్షన్ చేస్తానంటే అతడిని ఆమె ఎలా అనుమానిస్తుంది? భార్యను చంపేందుకు ఎప్పుడో పథకం వేసి, అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఆ భర్త విషపు ఇంజెక్షన్‌ను ఇచ్చి ఆమె ప్రాణలు బలిగొన్నాడు. తర్వాత తన

మిగతా 3వ పేజీలో...

ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి



భారీ వర్షం

- హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం.. రోడ్లను ముంచేసిన వరద
- న్యూమెట్టుగూడలో 7.5 సెం.మీ. వర్షం
- పార్సిగుట్టలో కొట్టుకుపోతున్న కారు నుంచి ఐదుగురిని కాపాడిన యువకులు
- వానలతో కృష్ణా ప్రాజెక్టులకు పెరిగిన వరద
- నేడు అతి భారీ వర్షాలు.. రేపు భారీ వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. గంటన్నర పాటు పడిన వర్షంతో రహదారులను వరద ముంచేసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల వరదలో వాహనాలు

మిగతా 14వ పేజీలో...

1 అంబానీ ఇంట్లో పెళ్లంటే ఆ మాత్రం ఉండాలి!

స్నేహితులకు కానుకగా రూ.2 కోట్ల వాచీలు

- షారుక్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్ సహా పదిమందికి
- మండపంలోకి వెళ్లడానికి క్యూఆర్ కోడ్
- ఒక్కో జోన్‌లో ప్రవేశానికీ ఒక్కో రంగు చేతి బ్యాండ్
- అత్యవసర చికిత్సకు ప్రత్యేక వైద్య బృందాలు
- అనంత్, రాధిక వివాహ విశేషాలు

2




11

బడ్జెట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు!

ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఇతర ఫైనాన్షియల్ ఉత్పత్తులు

నడిరాత్రంతా రోడ్ల మీద తిప్పి..

- వివాహితపై సామూహిక అత్యాచారం
- భర్తపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వెళ్తుంటే దారుణం
- అల్వాల్‌లో ఘటన

3

పిల్లలను చూసేందుకు వచ్చి

మృత్యు ఒడికి

- నిజామాబాద్ గురుకుల పాఠశాల వద్ద ప్రమాదం
- విద్యార్థులను చూడానికి వచ్చిన వారిపైకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు మహిళల మృతి
- మద్యం మత్తులో నడిపిన డ్రైవర్

తెరుచుకున్న రత్నభాండాగారం

- 12వ శతాబ్దానికి చెందిన పూరీ జగన్నాథుడి ఖజానాను 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- బయటి గదిలోని సంపదను ఆరు చెక్క పెట్టెల్లోకి చేర్చి సీల్
- బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోనూ కూడా..
- స్వర్ణకారులు, నిపుణుల నియామకం తర్వాతే ఆభరణాల లెక్కింపు

12



డిసెంబరులోగా బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు!

2

- ఆగస్టు 1 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు
- నవంబరులో మండల, జిల్లా అధ్యక్షుల ఎన్నిక
- డిసెంబరులో రాష్ట్రాలకు నూతన సారథులు
- తెలంగాణలో పలువురు సీనియర్‌నేతల పోటీ

హరీశ్ వచ్చినా రాజీనామా చేయాల్సిందే

- బీఆర్ఎస్‌లో ఉన్న ఏకైక మంచి వ్యక్తి, వివాదరహితుడు ఆయనే
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రచారం.. ఓ డ్రామా
- కేసీఆర్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేక ఆ పార్టీ నేతలను ఢిల్లీకి పంపి లీకులిస్తున్నారు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్


14

డిసెంబరులోగా బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

» ఆగస్టు 1 నుంచి సంస్థాగత ఎన్నికలు షురూ

న్యూఢిల్లీ, జూలై 14: జేపీ నడ్డా స్థానంలో బీజేపీ నూతన జాతీయ అధ్యక్ష ఎన్నికకు కసరత్తు మొదలైంది. డిసెంబరు నెలాఖరులోపు కొత్త సారథి ఎన్నిక పూర్తికానుంది. ఆయన పదవీకాలం ఎప్పుడో పూర్తయింది. ఎన్నికల నేపథ్యంలో గత నెల వరకు పొడిగింపు లభించింది. అది కూడా ముగియడంతో కొత్త అధ్యక్ష ఎన్నికకు కసరత్తు మొదలైంది. ఈ సంస్థాగత ఎన్నికల ప్రక్రియకు ఆగస్టు 1న ప్రాథమిక సభ్యత్వ నమోదుతో శ్రీకారం చుడతారు. సెప్టెంబరు 15 వరకు ఇది కొనసాగుతుంది. సెప్టెంబరు 16 నుంచి 30 వరకు క్రియాశీల సభ్యత్వ ప్రక్రియ కొనసాగుతుంది. బీజేపీ నియమావళి ప్రకారం.. ప్రతి సభ్యుడు తొమ్మిదేళ్లకోసారి తప్పనిసరిగా సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలి. ఈ ఏడాది ప్రధాని మోదీ సహా పార్టీ నేతలంతా రెన్యువల్ చేసుకోవలసి ఉంటుంది. నవంబరు 1-15 వరకు పార్టీ మండల అధ్యక్షులు, 16-30 వరకు జిల్లా అధ్యక్షుల ఎన్నిక జరుగుతుంది. ఆ సమయంలోనే రాష్ట్ర, జాతీయ కొత్త కార్యవర్గాలను ఎంపిక చేస్తారు. డిసెంబరు 1న రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక మొదలవుతుంది. సగం రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక నియామకం పూర్తికాగానే జాతీయ సారథి ఎన్నికల అధికారిక ప్రక్రియను ప్రకటిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మేజిక్ మార్కు (272) సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో బీజేపీకి సంస్థాగత ఎన్నికలు కీలకంగా మారాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నడ్డాను మోదీ కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవడమే గాక రాజ్యసభ నాయకుడిగానూ నియమించిన సంగతి తెలిసిందే.

బీజేపీలోకి మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ జడ్జి

భోపాల్, జూలై 14: మధ్యప్రదేశ్ హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ ఆర్య బీజేపీలో చేరారు. భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇంచార్జి రాఘవేంద్ర శర్మ కాషాయ కండువా కప్పి జస్టిస్ రోహిత్ ఆర్యను పార్టీలోకి ఆహ్వానించారు. 2013 సెప్టెంబర్‌లో మధ్యప్రదేశ్ హై కోర్టు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన 2015 మార్చిలో శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల క్రితమే పదవీ విరమణ పొందారు. ఆయన తన పదవీ కాలంలో ఇచ్చిన పలు తీర్పులు వివాదాస్పదమయ్యాయి. 2021లో ఇండోర్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో చెలరేగిన మతపరమైన ఘర్షణల కేసును ఆయన విచారించారు. కొవిడ్ ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన హాస్యనటులు మునావర్ ఫరూఖీ, నలిన్ యాదవ్‌కు బెయిలు ఇచ్చేందుకు ఆయన నిరాకరించారు. 2020లో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఆమెతో రాఖీ కట్టించి జీవితాంతం ఆమెకు రక్షణగా ఉంటాననే హామీ తీస్కొని అతనికి బెయిల్ మంజూరు చేశారు.

ఆగస్టు చివరికల్లా దేశవ్యాప్తంగా యూ-విన్

న్యూఢిల్లీ, జూలై 14: గర్భిణులు, పిల్లలకు ఇచ్చే టీకాల నమోదుకు సంబంధించిన యూ-విన్ పోర్టల్ వచ్చే ఆగస్టు చివరినాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. కొవిడ్-19 వ్యాక్సిన్ నిర్వహణ వ్యవస్థ కోసం తెచ్చిన కో-విన్ తరహాలోనే యూ-విన్‌ను రూపొందించారు. సాధారణ టీకాల పంపిణీని ఎలక్ట్రానిక్ రిజిస్ట్రీ రూపంలో నిర్వహించాలన్న లక్ష్యంతో తీసుకువస్తున్న యూ-విన్ ఇప్పటికే అన్ని రాష్ట్రాలు (పశ్చిమబెంగాల్ మినహా), కేంద్రపాలిత ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా నడుస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జూలై 9 నాటికి వ్యాక్సిన్ తీసుకున్న 5.33 కోట్ల మంది వివరాలను యూ-విన్‌లో నమోదు చేశారు. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యూఐపీ) కింద గర్భిణులు, పిల్లలకు ఇచ్చే ప్రతి వ్యాక్సినేషన్‌ను యూ-విన్ ప్లాట్‌ఫామ్‌లో పొందుపరచనున్నారు. వీరికి సకాలంలో టీకాలను ఇవ్వడానికి యూ-విన్ దోహదపడుతుంది. ప్రస్తుతం యూఐపీ కింద వ్యాక్సినేషన్ రికార్డులను మాన్యువల్‌గా నిర్వహిస్తున్నారు. యూ-విన్ ద్వారా వ్యాక్సినేషన్ స్థాయిని రియల్ టైమ్ ప్రాతిపదికన అప్‌డేట్ చేయనున్నారు.

ఓబీసీ కోటాలోనే పూజకు ఎంబీబీఎస్ సీటు!

పుణే, జూలై 14: వివాదాస్పద ఐఏఎస్ ప్రొబెషనరీ అధికారి పూజా ఖేద్కర్ ఇతర వెనుక బడిన వర్గం(ఓబీసీ) కోటా ద్వారానే ఎంబీబీఎస్ సీటును సంపాదించినట్లు తెలుస్తోంది. ఎంబీబీఎస్ ఎంట్రన్స్ టెస్టులో 146/200 పొందిన ఆమె పుణే కాశీబాయి నవాలే వైద్య కళాశాలలో 2007లో వంజారీ వర్గం కోటాలో సీటు సంపాదించారని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే పూజా ఖేద్కర్ ఓబీసీ నాన్ క్రీమీ లేయర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందినప్పుడు ఆమె తండ్రి దిలీప్ ఖేద్కర్ మహారాష్ట్రలో ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు, ఇటీవల పుణేలో ప్రొబెషనరీ ఐఏఎస్ అధికారిగా ఉన్నప్పుడు ఆమె వాడిన ఆడీ కారును పోలీసులు ఆదివారం జప్తు చేశారు. మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఆమె కారుకు సైరన్, మహారాష్ట్ర ప్రభుత్వ స్టిక్కర్, వీఐపీ నంబర్ ప్లేట్లను వాడడం, 21 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సిద్దరామయ్యపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయండి

» న్యాయవాదులకు కేంద్రమంత్రి కుమారస్వామి సూచన

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) పరిధిలో ఇళ్ల స్థలాల పంపిణీలో జరిగిన అవినీతిలో సీఎం సిద్దరామయ్య కుటుంబ భాగస్వామ్యం, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ గ్రాంట్లు బినామీ ఖాతాలకు మళ్లించడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి న్యాయవాదులకు సూచించారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై దేశమంతటా చర్చ సాగుతోందన్నారు. కోర్టులను ఆశ్రయించి వివాదంపై చట్టపరంగా పోరాటం చేయాలన్నారు. డీ నోటిఫికేషన్ విషయంలో అప్పటి సీఎం యడియూరప్పపై న్యాయ పోరాటానికి అడ్వకేట్లు గవర్నర్ అనుమతులు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కారణంతోనే యడియూరప్ప 2011లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతోపాటు జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. దేశంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే మార్చిలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ ఖాతాల నుంచి రూ.94 కోట్లు బినామీ ఖాతాలకు జమ చేశారని ఆరోపించారు.

జొమాటోకు రూ.60 వేల జరిమానా

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటోకు కర్ణాటక వినియోగదారుల ఫోరం రూ.60వేల జరిమానా విధించింది. ధారవాడకు చెందిన షీతల్ అనే మహిళ 2023 ఆగస్టు 31న ఆన్‌లైన్‌లో మోమోస్‌ను ఆర్డర్ చేశారు. రూ.133.25 మొత్తాన్ని గూగుల్ పే చేశారు. 15 నిమిషాల తర్వాత ఆర్డర్ డెలివరీ అయినట్టు సందేశం వచ్చింది. జొమాటో సంస్థ మాత్రం డెలివరీ చేయలేదు. దీంతో ఆమె తన ఆర్డర్ గురించి ప్రశ్నించగా డెలివరీ ఏజెంట్ ఆర్డర్ తీసుకున్నారని రెస్టారెంట్ నిర్వాహకులు బదులిచ్చారు. వెబ్‌సైట్ ద్వారా డెలివరీ ఏజెంట్‌ను అడిగేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీంతో జొమాటో సంస్థకు ఈ-మెయిల్ చేయగా.. 72 గంటలపాటు వేచి ఉండాలని బదులిచ్చారు. తర్వాత జొమాటో నుంచి తన డబ్బుల రీఫండ్ కోసం యత్నించగా సాధ్యం కాలేదు. దీంతో ఆమె.. 2023 సెప్టెంబరు 13న జొమాటో సంస్థకు లీగల్ నోటీసు ఇచ్చారు. సంస్థ సేవలు నాసిరకంగా ఉన్నాయని, మానసికంగా ఇబ్బంది కలిగించారని ధారవాడ జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. విచారణ జరిపిన ఫోరం బాధితురాలికి మానసిక ఇబ్బందికి కలిగించినందుకు రూ.50 వేలు, కోర్టు దావా ఖర్చులకు రూ.10 వేలు మొత్తం 60వేలు చెల్లించాలని జొమాటో సంస్థను ఆదేశిస్తూ ఈ నెల 3న తీర్పునిచ్చింది.

నేపాల్ నూతన ప్రధానిగా కేపీ శర్మ ఓలి



కాఠ్మాండూ, జూలై 14 : నేపాల్ నూతన ప్రధానమంత్రిగా కేపీ శర్మ ఓలి(72) ఆదివారం నియమితులయ్యారు. చైనా సానుభూతిపరుడిగా పేరొందిన ఓలి నేపాల్ ప్రధాని కావడం ఇది నాలుగో సారి. పుష్పకమల్ దహల్ ప్రచండ నేతృత్వంలోని ప్రభుత్వంపై పార్లమెంట్‌లో పెట్టిన అవిశ్వాస తీర్మానం శుక్రవారం నెగ్గింది. 275 సీట్లున్న నేపాల్ పార్లమెంట్‌లో 194 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. కేవలం 66 మంది మాత్రమే ప్రచండ నాయకత్వానికి ఓటేశారు. దీంతో నూతన ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమైంది. ఈ క్రమంలోనే కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని సీపీఎన్-యూఎంఎల్, నేపాలీ కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కేపీ శర్మ ఓలి ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుంది. కాగా, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా, సీపీఎన్-యూఎంఎల్ చైర్మన్ కేపీ శర్మ ఓలి గత వారమే ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం తర్వాత తొలి 18 నెలలు ఓలి ప్రధానిగా ఉంటారు. ఆ తర్వాత పార్లమెంట్ గడువు ముగిసే వరకు దేవ్‌బా ప్రధానిగా కొనసాగుతారు.

ట్రంప్‌పై హత్యాయత్నం

రైఫిల్‌తో కాల్పులు జరిపిన యువకుడు.. వెంటనే స్పందించిన సీక్రెట్ ఏజెంట్లు

» దుండగుడి కాల్చివేత.. ట్రంప్ క్షేమం

» దాడిని ఖండించిన జో బైడెన్



బుల్లెట్ గాయం తర్వాత.. పిడికిలి బిగించి "ఫైట్.. ఫైట్.." అంటూ నినదిస్తున్న ట్రంప్

పెన్సిల్వేనియా/వాషింగ్టన్, జూలై 14: గన్‌కల్చర్‌కు నెలవైన అమెరికాలో మరోమారు తుపాకీ గర్జించింది..! ఈసారి ఏకంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఓ యువకుడు కాల్పులకు తెగబడ్డాడు. 5-6 రౌండ్ల కాల్పులు జరపగా ఆ సమయానికి ట్రంప్ కాకతాళీయంగా ముఖాన్ని పక్కకు తిప్పడంతో ఆయన కుడి చెవి పైభాగం నుంచి తూటా దూసుకుపోయింది. ట్రంప్‌ను నీడలా కాపాడుతున్న సీక్రెట్ ఏజెంట్లు క్షణాల్లో దుండుగుడిని మట్టుబెట్టారు. ఈ ఘటన శనివారం సాయంత్రం 6.10గంటల సమయంలో పెన్సిల్వేనియా ప్రావిన్స్‌లోని బట్లర్ పట్టణంలో చోటుచేసుకుంది. నవంబరు 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మరో రెండ్రోజుల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ప్రకటన జరగనుందనగా ట్రంప్ బట్లర్‌లో ప్రచార ర్యాలీలోపాల్గొన్నారు. భారీ ర్యాలీని ఉద్దేశించి ఆయన సరిహద్దుల్లో అక్రమ వలసలకు సంబంధించిన ఓ చార్ట్‌ను ప్రదర్శిస్తూ తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు. అంతలోనే తుపాకీ తూటాలు ట్రంప్‌వైపు దూసుకొచ్చాయి. వాటిలో ఒకటి ఆయన కుడి చెవి పైభాగం నుంచి దూసుకువెళ్లింది. ఆ వెంటనే ట్రంప్ రక్తమోడుతున్న తన చెవిని పట్టుకుని కిందకు జరిగిపోయారు. అదే సమయంలో ట్రంప్ వెనకున్న ఎత్తైన ప్రదేశంలో ఉన్న సీక్రెట్ ఏజెంట్ విభాగానికి చెందిన స్నైపర్లు దుండగుడిని కాల్చి చంపారు. తర్వాత సీక్రెట్ ఏజెంట్లు, సెక్యూరిటీ సిబ్బంది ట్రంప్ వద్దకు వచ్చి అతనికి వలయంగా నిలబడ్డారు. ట్రంప్‌ను అయన బుల్లెట్‌ప్రూఫ్ ఎస్‌యూవీ వద్దకు తీసుకెళ్తుండగా ఆయన తన కుడిచేతి పిడికిలిని పైకెత్తి చూపుతూ "పోరాడతా (ఫైట్)" అని నినదించారు. తర్వాత ట్రంప్‌ను చికిత్స నిమిత్తం బట్లర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి స్థిరంగా ఉందని రిపబ్లిక్ పార్టీ ప్రతినిధులు తెలిపారు. కాగా దుండగుడి కాల్పుల్లో ర్యాలీలో పాల్గొన్న ఓ వ్యక్తి మరణించాడని, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని తెలుస్తోంది.

పెరిగిన ట్రంప్ విజయావకాశాలు!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో క్రమంగా డొనాల్డ్ ట్రంప్ విజయావకాశాలు పెరుగుతున్నాయి. శనివారం నాటి కాల్పుల ఘటనకు ముందు ఆయన విజయావకాశాలను పోల్‌స్టర్ 62శాతంగా అంచనా వేసింది. పెన్సిల్వేనియా కాల్పుల ఘటనతో ప్రజల మద్దతు మరో 8% పెరిగి విజయావకాశాలు 70శాతానికి చేరుకున్నట్లు ఆ సంస్థ అంచనా వేసింది.

దాన్ని బలపరుస్తూ ప్రత్యక్ష సాక్షులు వాంగ్మూలాలిచ్చారని తెలుస్తోంది. మీడియాతో మాట్లాడిన ఓ ప్రత్యక్ష సాక్షి.. తాను ముందుగానే భద్రత సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. "ట్రంప్ రావడానికి ముందే.. ఓ యువకుడు చేతిలో రైఫిల్ తీసుకుని ఓ ఇంటి పైకి చేరాడు. అతను వేదిక వైపు గురిపెట్టి ట్రంప్ రాక కోసం సిద్ధంగా ఉన్నాడు. నేను వెంటనే భద్రత సిబ్బందికి సమాచారం అందించా. అయినా వారు పట్టించుకోలేదు. ట్రంప్ వేదికపైకి వచ్చి, ప్రసంగించడాన్ని చూసిన నేను ఆందోళనచెందాను. అంతలోనే కాల్పులు జరిగాయి" అని అన్నారు.



మాథ్యూ క్రూక్స్

దుండగుడు 20ఏళ్ల యువకుడు

ట్రంప్‌పై కాల్పులు జరిపిన దుండగుడిని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు గుర్తించారు. పెన్సిల్వేనియాలోని బెతెల్‌పార్క్ ప్రాంతానికి చెందిన థామస్ మాథ్యూ క్రూక్స్ (20) ఈఘాతుకానికి పాల్పడ్డట్లు పేర్కొన్నారు. కాగా క్రూక్స్ రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా నమోదవ్వడం గమనార్హం..! అయితే 2021లో ఆయన డెమోక్రాట్లకు అనుబంధంగా పనిచేసే ప్రోగ్రెసివ్ టర్నవుట్ ప్రాజెక్టుకు 15డాలర్లను విరాళంగా ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. క్రూక్స్ ఈ ఘాతుకానికి పాల్పడడానికి ముందు సోషల్ మీడియాలో.. తాను రిపబ్లికన్ పార్టీని, ట్రంప్‌ను ద్వేషిస్తున్నట్లు ఓ పోస్టు చేశాడు. అతను అసాల్ట్ రైఫిల్‌తో 200అడుగుల దూరం నుంచి ట్రంప్‌పై కాల్పులు జరిపినట్లు అధికారులు నిర్ధారించారు. క్రూక్స్ ఇంట్లో పేలుడు పదార్థాలు దొరికినట్లు తెలిపారు.

దాడికి పక్కా స్కెచ్..!

దుండగుడు పక్కా వ్యూహంతోనే ట్రంప్‌పై దాడి జరిపినట్లు ఎఫ్‌బీఐ అధికారులు అనుమానిస్తున్నారు.

చెవి పైభాగంలోంచి బుల్లెట్ దూసుకెళ్లింది: ట్రంప్

కాల్పుల ఘటనపై డొనాల్డ్ ట్రంప్ 'ట్రూత్' సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "కాల్పుల శబ్దం వినగానే.. ఏదో జరుగుతోందని అర్థమైంది. అంతలోనే నా కుడిచెవి పైభాగం నుంచి బుల్లెట్ దూసుకెళ్లింది. చెవి నుంచి రక్తస్రావమైంది. సీక్రెట్ సర్వీస్ సిబ్బంది నా ప్రాణాలు కాపాడారు. వారికి ధన్యవాదాలు. ఈ ఘటనలో మరణించిన వ్యక్తి, తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. ఇలాంటి చర్య మన దేశంలో జరగడం నమ్మశక్యంగా లేదు. గాడ్ బ్లెస్ అమెరికా!" అని పోస్ట్ చేశారు. ట్రంప్ కుమార్తె ఇవాంక సోషల్ మీడియా వేదికగా తన తండ్రిని కాపాడిన సీక్రెట్ సర్వీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అమెరికాలో హింసకు తావు లేదు: బైడెన్

ట్రంప్‌పై కాల్పులు జరగడాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఖండించారు. అమెరికాలో హింసకు తావులేదని బైడెన్ వ్యాఖ్యానించినట్లు వైట్‌హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. ట్రంప్‌తో బైడెన్ స్వయంగా మాట్లాడినట్లు.. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసినట్లు వెల్లడించింది. కాగా వారాంతంలో భాగంగా డెలావెర్ బయలుదేరాల్సిన బైడెన్.. ఈ ఘటనతో తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు వివరించింది. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, మాజీ అధ్యక్షులు ఒబామా, బిల్ క్లింటన్, బుష్ కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

లోకం తీరు



ట్రంప్ త్వరగా కోలుకోవాలి

» హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించిన పలు దేశాల నేతలు



వాషింగ్టన్, షికాగో, జూలై 14: ట్రంప్‌పై హత్యాయత్నాన్ని ప్రపంచ దేశాల అధినేతలు తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని స్టార్మర్.. ట్రంప్‌పై జరిగిన కాల్పుల ఘటనపై స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదన్నారు. "నా మిత్రుడైన ట్రంప్‌పై హత్యాయత్నం తీవ్ర వేదన కలిగించింది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆయన త్వరగా కోలుకోవాలి" అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ట్రంప్ త్వరగా కోలుకోవాలని రాహుల్‌గాంధీ, ఖర్గే ఆకాంక్షించారు. ట్రంప్‌పై హత్యాయత్నం అమెరికన్ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం అని భారతీయ అమెరికన్లు పేర్కొన్నారు. భారతీయ అమెరికన్ల నాయకుడు డాక్టర్ భరత్ బరయ్ మాట్లాడుతూ... ఈ ఘటన చాలా విచారకరమన్నారు. బైడెన్‌కు బలమైన మద్దతుదారు అయిన అజయ్ భుటోరియా మాట్లాడుతూ... ఈ హత్యాయత్నంపై అన్ని కోణాల్లో విచారించాలన్నారు.

బర్మింగ్‌హామ్‌లో కాల్పులు

» ఏడుగురి మృతి.. 9 మందికి గాయాలు

వాషింగ్టన్, జూలై 14: అమెరికాలోని అలబామా రాష్ట్రంలోని బర్మింగ్‌హామ్‌లో శనివారం రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఓ బాలుడు కూడా ఉన్నాడు. శనివారం రాత్రి బర్మింగ్‌హామ్‌లోని నైట్‌క్లబ్‌పై ఓ వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. 9 మంది గాయపడ్డారు. అంతకుముందు బర్మింగ్‌హామ్ నగరంలోనే ఇండియన్ సమ్మర్ డ్రైవ్ ప్రాంతంలో ఓ ఇంటి ముందు కారులో బాలుడు, మహిళ సహా ముగ్గురు బుల్లెట్ గాయాలతో చనిపోయి కనిపించారు.

తుపాకీ సంస్కృతి కొత్తేమీ కాదు!

అమెరికాలో పదవిలో ఉండగానే నలుగురు అధ్యక్షుల కాల్చివేత

(సెంట్రల్ డెస్క్)


మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నంతో అగ్రరాజ్యం అమెరికా ఉలిక్కిపడింది. ఈ రాజకీయ దాడి ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష అభ్యర్థులపై ఇలాంటి దాడులు అమెరికాకు కొత్తేమీ కాదు. 1776లో అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇలాంటి అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. 2008లో ప్రచురితమైన కాంగ్రెస్ నివేదిక ప్రకారం 1865 నుంచి 2005 మధ్యకాలంలో అమెరికాలో అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష అభ్యర్థులపై 15 ప్రత్యక్ష దాడులు జరిగాయి. చివరిసారిగా 2011లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా లక్ష్యంగా దాడి జరిగింది. అప్పుడు నేరుగా ఒబామాపై దాడి చేయలేదు కానీ, దుండగులు వైట్‌హౌస్‌పై కాల్పులు జరిపినట్టు అధికారులు గుర్తించారు. అలాగే 2018లో అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్ కోసం పంపిన బాంబును భద్రతా సిబ్బంది ముందే పసిగట్టారు. ఇప్పుడు కూడా మరోసారి ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. ఈ నేపథ్యంలో గతంలో అమెరికా అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష అభ్యర్థులపై జరిగిన కొన్ని దాడుల్లో కొన్ని ఘటనలు ఇవి..

హత్యకు గురైన నలుగురు అధ్యక్షులు	
అబ్రహాం లింకన్	: 1865 ఏప్రిల్ 14
జేమ్స్ గార్ఫీల్డ్	: 1881 జూలై 2
విలియం మెకిన్లీ	: 1901 సెప్టెంబరు 6
జాన్ ఎఫ్ కెన్నెడీ	: 1963 నవంబరు 22

జార్జి డబ్ల్యూ బుష్: 2005లో అప్పటి అధ్యక్షుడు జార్జి బుష్ జార్జియాలో నిర్వహించిన ఓ ర్యాలీలో అరుట్యునియన్ అనే వ్యక్తి గ్రెనేడ్ విసిరాడు. అది పేలకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ బాంబు బుష్‌కు కేవలం 61 అడుగుల దూరంలోనే పడింది. బుష్‌ను చంపాలనే గ్రెనేడ్ విసిరినట్టు ఆ వ్యక్తి అంగీకరించాడు.

రొనాల్డ్ రీగన్: అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ 1981లో వాషింగ్టన్ డీసీలోని హిల్టన్ హోటల్ నుంచి బయటకు వస్తుండగా జాన్ హింక్లీ జూనియర్ అనే వ్యక్తి .22 క్యాలిబర్ రివాల్వర్‌తో ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ దాడిలో ఆయనకు గాయాలైనప్పటికీ ప్రాణాలతో బయటపడ్డారు.

జెరాల్డ్ ఫోర్డ్: అమెరికా దేశ చరిత్రలో రెండు హత్యాయత్నాల నుంచి బయటపడిన ఏకైక అధ్యక్షుడు జెరాల్డ్ ఫోర్డ్. 1975 సెప్టెంబరు 5న ఆయన లినెట్ ఆలిస్ ఫ్రోమ్ అనే వ్యక్తి జరిపిన తుపాకీ కాల్పుల నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఈ సంఘటన జరిగిన 17 రోజుల తర్వాత సారా జేన్ మూర్ అనే మహిళ కూడా ఫోర్డ్‌ను తుపాకీతో కాల్చి చంపాలని ప్రయత్నించింది. తొలి గన్ షాట్ గురితప్పింది. రెండో షాట్‌కు ప్రయత్నించగా ఓ వ్యక్తి తుపాకీ పట్టుకోవడంతో ఆమె ప్రయత్నం విఫలమైంది.



జార్జి సి వాలెస్: 1972 మే 15న మేరీల్యాండ్‌లో నిర్వహించిన ర్యాలీలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, అప్పటి అలబామా గవర్నర్ జార్జి సి వాలెస్‌పై ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఐదు రౌండ్లు కాల్చగా బుల్లెట్ వాలెస్ నడుములోకి దూసుకెళ్లింది. దీంతో ఆయన పక్షవాతానికి గురయ్యారు.

రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ: 1968 జూన్ 5న కాలిఫోర్నియాలోని డెమోక్రటిక్ ప్రైమరీలో గెలిచిన అనంతరం.. అంబాసిడర్ హోటల్‌లో రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ నడుచుకుంటూ వెళ్తుండగా.. సిరాన్ అనే వ్యక్తి ఆయనను తుపాకీతో కాల్చాడు. తీవ్రంగా గాయపడిన కెన్నెడీ ఆ మరుసటి రోజు ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు.

హ్యారీ ట్రూమన్: 1950లో ఆస్కార్ కొలాజో, గ్రెసీలియో టొర్రెసోలా అనే వ్యక్తులు వైట్ హౌస్‌పై కాల్పులు జరిపారు. ఈ దాడిలో అప్పటి అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ ఒక పోలీస్ అధికారి మరణించారు.

ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్: ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి మూడు వారాల ముందు జిసెప్పె జంగారా అనే వ్యక్తి రూజ్‌వెల్ట్ లక్ష్యంగా తుపాకీతో కాల్పులు జరిపాడు. గురితప్పిన బుల్లెట్లు.. పక్కనే ఉన్న చికాగో మేయర్ ఆంటోనీ సెర్మాక్‌కు తగలడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

థియోడోర్ రూజ్‌వెల్ట్: 1901 నుంచి 1909 వరకూ అధ్యక్షుడిగా పనిచేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ 1912 అక్టోబరు 14న డిన్నర్‌కు వెళ్తుండగా జాన్ ష్రాంక్ అనే వ్యక్తి తన .38 క్యాలిబర్ కోల్ట్ రివాల్వర్‌తో కాల్చాడు. ఈ దాడిలో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

తుపాకీ చట్టాలపై మళ్లీ చర్చ..!

అమెరికాలో అధ్యక్షుడు, మాజీ అధ్యక్షులకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. అయినప్పటికీ మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన వ్యక్తులు సైతం సురక్షితంగా లేరని చెప్పడానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ. ఆసక్తికర విషయం ఏవిటంటే అమెరికాలో అధ్యక్షులు, మాజీ అధ్యక్షులపై జరిగిన దాడులన్నీ దాదాపు తుపాకీతో జరిగినవే. ఈ నేపథ్యంలో అమెరికాలో కఠినమైన తుపాకీ చట్టాలపై చర్చ మరోసారి తెరపైకి వచ్చింది.

ప్రపంచాన్ని కుదిపేసిన కెనడీ హత్య



వాషింగ్టన్, జూలై 14: అమెరికా 35వ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ 1963 నవంబరు 22న హత్యకు గురైన ఘటన నాడు అమెరికాతోపాటు యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. అధ్యక్ష పదవిలో ఉండగానే.. వరుసగా రెండోసారి డెమోక్రటిక్ అభ్యర్థిగా నిలిచిన ఆయనను ఎన్నికల ప్రచారంలోనే దుండగుడు కాల్చి చంపాడు. 1964 అధ్యక్ష ఎన్నికల కోసం ఆ రోజు టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్‌లో ఆయన ఓపెన్ టాప్ లైమోసెన్ కారులో కూర్చొని ప్రచారం నిర్వహించారు. భారీ వాహన శ్రేణితో నగర వీధుల గుండా వస్తుంటే, ఆయనను చూసేందుకు దారిపొడవునా జనం భారీగా నిల్చున్నారు. అయన పక్కనే భార్య జాక్వలైన్ కెనడీ కూడా ఉన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కాన్వాయ్ డీలే ప్లాజా వద్దకు చేరుకోగానే దుండగుడు కాల్పులు జరపగా.. కెనడీ వీపుపై ఒక తూటా, తలలో ఒక తూటా దిగబడ్డాయి. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్స్ వెంటనే కెనడీని పార్క్‌లాండ్ మెమోరియల్ ఆస్పత్రికి తరలించగా, మధ్యాహ్నం ఒంటిగంటకే ఆయన మరణించినట్టు ప్రకటించారు. అమెరికా నౌకాదళ మాజీ ఉద్యోగి ఓస్వాల్డ్(24)ను హంతకుడిగా గుర్తించారు. ఓస్వాల్డ్‌ను అరెస్టు చేసిన రెండు రోజులకే అతన్ని మరోవ్యక్తి కాల్చి చంపాడు. దీంతో, కెనడీ హత్య వెనుక కుట్ర ఉందని, అది బయటపడకుండా ఉండేందుకే ఓస్వాల్డ్‌ను హత్య చేశారని ప్రచారం జరిగింది.

అంబానీ పెళ్లంటే ఆ మాత్రం ఉండాలి!

స్నేహితులకు కానుకగా రూ. 2 కోట్ల వాచీలు

» మండపంలోకి వెళ్లడానికి క్యూఆర్‌కోడ్



అనంత్ అంబానీ-రాధిక వివాహ వేడుకలో ప్రధాని మోదీ, చిత్రంలో ముఖేశ్ అంబానీ దంపతులు

ముంబై, జూలై 14: అత్యంత వైభవోపేతంగా, అట్టహాసంగా జరుగుతున్న అనంత్ అంబానీ పెళ్లి వేడుకల్లో.. కొత్త 'టాక్ ఆఫ్ ది టౌన్'.. తన గ్రూమ్స్‌మెన్‌కు అంబానీ ఇచ్చిన ఖరీదైన వాచీలు! 'గ్రూమ్స్‌మెన్' అంటే.. పెళ్లికొడుకు ఎంచుకునే అత్యంత ఆప్తమిత్రులు. వేడుక అంతా వాళ్లు పెళ్లికొడుకుతోనే ఉంటారు. అనంత్ అలా తన గ్రూమ్స్‌మెన్‌గా.. బాలీవుడ్ హీరోలు షారుక్ ఖాన్, రణ్‌వీర్‌సింగ్, శిఖర్ పహారియా(జాన్వీకపూర్ బాయ్‌ఫ్రెండ్), వీర్‌పహారియా సహా పదిమందిని ఎంచుకున్నాడు. వారందరికీ.. 'ఔడెమాజ్ పిగే' అనే స్విస్ కంపెనీ తయారుచేసిన 'రాయల్ ఓక్ పర్‌పెచ్యువల్ క్యాలెండర్' వాచీలను బహుమతిగా ఇచ్చాడు. అవి కూడా ప్రీమియర్ లిమిటెడ్ ఎడిషన్. అనంత్ అంబానీ ఇచ్చిన ఆర్డర్ మేరకు ప్రత్యేకంగా ఆ కంపెనీ 25 వాచీలు తయారుచేసి ఇచ్చింది. వాటి విలువ అక్షరాలా రూ.2,08,79,000. 41 మిల్లీ మీటర్ల డయల్‌తో ఉండే ఈ వాచీలకు 18 క్యారెట్ల పింక్ గోల్డ్ కేస్‌లు, బ్రేస్‌లెట్లు ఉంటాయి. ఈ వాచీలు టైముతో పాటు వారం, తేదీ, నెల, లీప్ సంవత్సరం ఇలా చాలా వివరాలే చెప్పగలవు. 20 మీటర్లలోతు (అంటే దాదాపు 65 అడుగుల లోతు) నీటిలో పడ్డా ఈ వాచీలు బాగానే పనిచేస్తాయి. కాగా..మూడురోజులపాటు అత్యంత వైభవోపేతంగా జరిగిన ఈ పెళ్లి గురించి రకరకాల కొత్త విశేషాలు బయటికొస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సెలబ్రిటీలు, సినీ ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలు, ప్రధాని మోదీ సహా పలువురు రాజకీయ ప్రముఖులు పెళ్లికి వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సందట్లో సడేమియాలో ఎవరు పడితే వారు పందిట్లోకి దూరకుండా.. పెళ్లికి ఆహ్వానించినవారి మొబైల్ ఫోన్లకు ముహూర్తానికి ఆరు గంటల ముందు క్యూఆర్ కోడ్ మెసేజ్‌లు పంపించారు. అమితాబ్ బచ్చన్ అయినా.. షారుక్‌ఖాన్ అయినా.. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లోపలికి రావాల్సిందేనన్నమాట. అలాగే, పెళ్లి జరిగే చోట రకరకాల జోన్లు ఏర్పాటు చేశారు. అన్ని జోన్లలోకీ అందరికీ ప్రవేశం ఉండదు. అలా ప్రవేశించకుండా.. అతిథులకు, సెక్యూరిటీవారికి, రిలయన్స్ ఉద్యోగులకు ఒక్కో రంగు చేతి బ్యాండ్ వేశారు. వైద్యపరంగా అత్యవసరస్థితి ఏర్పడితే అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు.



గిఫ్టు వాచీతో రణ్‌వీర్ సింగ్

పిల్లలను చూసేందుకు వచ్చి మృత్యుఒడిలోకి..

- రహదారి పక్కన ఉన్నవారిపైకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు మహిళల మృతి, మరో ముగ్గురికి గాయాలు
- నిజామాబాద్ గురుకుల పాఠశాల వద్ద ప్రమాదం
- మద్యం మత్తులో వాహనం నడిపిన డ్రైవర్

నిజామాబాద్ అర్బన్, జూలై 14: ఇంటి బువ్వ తిని ఎన్నాళ్లైందో నాతల్లీ అంటూ.. కూతురికి నోరారా అన్నం తినిపిస్తున్న అమ్మ ఒకరు.. ఇంటికి దూరంగా ఉంటూ చదువు సాగిస్తున్న మనుమరాలిని చూసి ఆమె ముచ్చట్లు వింటున్న అమ్మమ్మ మరొకరు.. హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న తమ పిల్లలను కళ్లారా చూసుకుని ఆనందంలో ఉన్న ఆ అమ్మలను ఊహించని రీతిలో మృత్యువు కబళించింది. మద్యం మత్తులో కారు నడిపిన ఓ వ్యక్తి నిర్లక్ష్యం వారిని పొట్టనబెట్టుకుంది. నిజామాబాద్ శివారులోని జ్యోతిబాఫూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల వద్ద అదుపు తప్పిన ఓ కారు రహదారి పక్కన ఉన్న వారి మీది నుంచి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో కొత్తూరు పోశవ్వ(65), శ్రీరాం పద్మ(40)మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వసతి గృహంలోని తమ పిల్లలను కలిసేందుకు



ప్రమాదానికి కారణమైన కారు

వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో సందడిగా ఉన్న పాఠశాల వాతావరణం ఒక్కసారిగా ఉద్విగ్నంగా మారిపోయింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం సిర్నాపల్లికి చెందిన కొత్తూరు హారిక నిజామాబాద్ శివారు దాస్‌నగర్ వద్ద ఉన్న జ్యోతిబాఫూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్ చదువుతోంది. అలాగే, బోధన్ మండలం చిన్నమావందికి చెందిన శ్రీరాం ఈశ్వరి అదే పాఠశాలలో



పోశవ్వ, శ్రీరాం పద్మ (ఫైల్)

ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో హారికను కలిసేందుకు ఆమె అమ్మ లీల, అమ్మమ్మ పోశవ్వ పాఠశాలకు వచ్చారు. అదేవిధంగా ఈశ్వరి తల్లి శ్రీరాం పద్మ, అక్క గౌతమి కూడా వచ్చారు. వీరంతా పాఠశాల బయట రహదారి పక్కన మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో నందిపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు వీళ్ల మీద నుంచి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టి ఆగింది. ఈ ఘటనలో పోశవ్వ, శ్రీరాం పద్మ అక్కడికక్కడే మరణించారు. ఈశ్వరి, లీల, హారికకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ కారులో మద్యం సీసాలను గుర్తించిన స్థానికులు కారు నడిపిన సాయి అనే వ్యక్తిని చితకబాదారు. నందిపేటలో జరిగిన ఓ విందులో పాల్గొని వస్తున్న సాయి మద్యం మత్తులో కారు నడిపినట్టు చెబుతున్నారు. పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి, ప్రమాదానికి కారణమైన సాయిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిరుద్యోగులపై మోదీ అబద్ధాల వల

- ఎన్‌ఆర్‌ఏ నాలుగేళ్లుగా ఒక్క పరీక్షా కూడా నిర్వహించలేదు?
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శ



న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులపై ప్రధాని మోదీ అబద్ధాల వల విసురుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. మోదీ శనివారం ముంబైలో మాట్లాడుతూ నాలుగేళ్లలో 8 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని చెప్పడంపై ఖర్గే ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మోదీ జీ.. 2020 ఆగస్టులో జాతీయ నియామకాల సంస్థ (ఎన్‌ఆర్‌ఏ) గురించి ప్రకటించేటప్పుడు మీరు ఏం చెప్పారో మరోసారి మీకు గుర్తు చేయాలనుకుంటున్నాను. కోట్లాది మంది యువతకు ఎన్‌ఆర్‌ఏ ఒక వరమని చెప్పారు. అనేక పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఇక ఉండబోదని, ఒకే పరీక్షతో నియామకాలు చేపడతామన్నారు. ఇది అభ్యర్థులకు సమయం, వనరులను ఆదా చేస్తుందని, పారదర్శకతకు పెద్దపీట వేస్తుందన్నారు. కానీ.. ఈ నాలుగేళ్లలో ఎన్‌ఆర్‌ఏ ఒక్క పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదు? ఎన్‌ఆర్‌ఏ నిర్వహణకు రూ.1,517 కోట్లు కేటాయించి, రూ.58 కోట్లు మాత్రమే ఎందుకు ఖర్చు చేశారు? ఎన్‌ఆర్‌ఏను ఉద్యోగ నియామకాల కోసం ఏర్పాటు చేశారా లేదా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో పనిచేయకుండా చేస్తున్నారా? జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) పేపర్ లీకేజీకి పాల్పడింది.. ఎన్‌ఆర్‌ఏ ఒక్క పరీక్ష కూడా నిర్వహించలేదు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విద్యా వ్యవస్థను నాశనం చేసి, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నాయ'ని ఖర్గే మండిపడ్డారు.

మాయమాటలతో చెల్లెలిని చెరబట్టిన అన్న

- ఇద్దరు కలిసి ఇంటి నుంచి పారిపోయిన వైనం
- జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు.. దర్యాప్తు

బిజినేపల్లి, జూలై 14: చెల్లెలిని కంటికి రెప్పలా కాపాడాల్సిన అన్నయ్య మాయమాటలతో ఆమెనే చెరబట్టాడు. కర్ణాటక రాష్ట్రంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు ఇద్దరు భర్తలున్నారు. మొదటి భర్తతో ఒక కుమారుడు, రెండో భర్తతో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం ఆమె తన నలుగురు పిల్లలతో కలిసి మహబూబ్‌నగర్‌కు వచ్చి స్థిరపడింది. గ్రెనేట్ రాయి కొట్టేందుకు ఆమె కుమారుడు (21) బిజినేపల్లి మండలంలోని ఓ తండాకు ముగ్గురు చెల్లెళ్లతో కలిసి వచ్చాడు. ఇక్కడే ఉంటూ పరిసర గ్రామాల్లో రాయి కొట్టేందుకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం రెండో చెల్లెలి (15)కి మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. మహబూబ్‌నగర్‌కు వెళ్లిన తర్వాత కూడా సోదరితో సన్నిహితంగా మెలుగుతుండడాన్ని తల్లి గుర్తించి మందలించింది. తప్పుడు పనులు చేయొద్దంటూ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో గత నెల ఒకటిన ఇంట్లో నుంచి ఇద్దరు కలిసి వెళ్లిపోయారు. 10 రోజులు గడిచినా వారు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శనివారం వనపర్తి జిల్లా ఘణ్‌పూర్ మండలంలోని బలిజపల్లి గ్రామంలో వారిద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో గ్రామస్థులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి సమాచారం ఇచ్చారు. అధికారులు వారిద్దరినీ విచారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయువు తీసిన అప్పులు!

- తీర్చలేక రైతు ఆత్మహత్య.. రెండేళ్ల క్రితం తండ్రి బలవన్మరణం

వలిగొండ, జూలై 14: పంటల సాగు కోసం చేసిన అప్పులు ఆ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. రెండేళ్ల క్రితం తండ్రి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా, కుమారుడు అదే సమస్యతో ఆయువు తీసుకున్నాడు. ఈ విషాదకర ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాకలో జరిగింది. గ్రామానికి చెందిన జోర్క శంకరయ్య, శ్యామల దంపతులకు ముగ్గురు కుమారులు. ఈ దంపతులు గ్రామంలో భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తుండగా రెండేళ్ల క్రితం అప్పుల బాధతో శంకరయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో కుమారుడైన శివకుమార్ (18) వ్యవసాయం చేస్తుండగా, పెద్ద కుమారుడు, తల్లి కూలి పనులకు వెళుతున్నారు. చిన్న కుమారుడు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఉంటూ పదో తరగతి చదువుకుంటున్నాడు. శివకుమార్ రూ.2 లక్షలు అప్పులు తెచ్చి నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పంటలు సరిగా పండక, సరైన దిగుబడి లేక మానసిక వేదనతో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



శివకుమార్ (ఫైల్)

ప్రియురాలు చెప్పిందని..

(మొదటి పేజీ తరువాయి)

కన్నబిడ్డలిద్దరినీ ముక్కు, నోరు మూసి చంపేశాడు. ఆపై రోడ్డు ప్రమాదం జరిగినట్టు, ఆ ప్రమాదంలోనే భార్యాపిల్లలు చనిపోయినట్లు సీన్ క్రియేట్ చేశాడు. అయితే ఘటన జరిగిన 48 రోజుల తర్వాత అతడి దుర్మార్గం బట్టబయలైంది. మరో అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఆ వైద్యుడు, తన ఆ ఆనందానికి భార్యాబిడ్డలు అడ్డుగా ఉన్నారని భావించి ఈ ఘోరానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో రోడ్డు ప్రమాదం-ముగ్గురి మరణం ఘటన వెనుక మిస్టరీ వీడింది. ఖమ్మం ఏసీపీ రమణమూర్తి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రామ్‌నగర్‌కు చెందిన కుమారి(28)కి రఘునాథపాలెం మండలం బావోజీ తండాకు చెందిన డాక్టర్ బోడా ప్రవీణ్‌తో 2019లో వివాహం జరిగింది. ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనస్థిషియా వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ప్రవీణ్-కుమారి దంపతులకు కూతుళ్లు కృషిక(5), కృతిక (3) ఉన్నారు. కుటుంబంతో కలిసి ప్రవీణ్ హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. వృత్తిలో భాగంగా ఆస్పత్రిలో రాత్రిపూట విధులు నిర్వహించే ప్రవీణ్‌కు అక్కడే పనిచేస్తున్న కేరళకు చెందిన సోనీ ఫ్రాన్సిస్ అనే యువతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ సంగతి భార్య కుమారికి తెలియడంతో దంపతుల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఇరు కుటుంబాల పెద్దలు పంచాయతీలు నిర్వహించి భార్యాభర్తలకు నచ్చజెప్పారు. ఈ గొడవలు సోనీకి చికాకు తెప్పించాయి. భార్యాపిల్లలను అడ్డుతొలగించుకుంటే ఇద్దరం కలిసి ప్రశాంతంగా ఉండొచ్చంటూ ఆమె ప్రవీణ్‌కు చెప్పింది. దీనికి ప్రవీణ్



భర్త ప్రవీణ్‌తో కుమారి(ఫైల్)

అభ్యంతరం చెప్పకపోగా భార్యపిల్లల హత్యకు పథకం వేశాడు. సొంతూర్లో ఇంటి వద్ద పనులున్నాయని చెప్పి.. మే నెలలో పది రోజులు ప్రవీణ్ సెలవు పెట్టి భార్యాపిల్లలను వెంటబెట్టుకొని బావోజీ తండాకు వచ్చాడు. అధిక మోతాదులో మత్తు ఇంజెక్షన్ ఇస్తే ఎన్ని గంటల్లో చనిపోతారనే విషయమ్మీద అప్పటికే గూగుల్లో వెతికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. మే 26న కుమారి ఇంజెక్షన్ చేయడానికి విఫలయత్నం చేశాడు. రెండ్రోజుల తర్వాత ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయాలంటూ భార్యాపిల్లలను వెంటబెట్టుకొని కారులో ఖమ్మానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కుమారి.. అనారోగ్యంగా ఉందనడంతో బల్లేపల్లి సెంటర్‌లోని ఓ మెడికల్ షాపులో క్యాల్షియం ఇంజెక్షన్‌తో పాటు మరో ఇంజెక్షన్‌నూ కొనుగోలు చేశాడు. ఓ 3 కి.మీ దూరం వెళ్లాక కోయచెలక సమీపంలో కారు ఆపాడు. భార్యను వెనుక సీట్లో పడుకోబెట్టి రెండు ఇంజెక్షన్లు ఇచ్చాడు. వెంటనే కుమారి స్పృహ కోల్పోయింది. తర్వాత.. ఒకరు తర్వాత మరొకరుగా ఇద్దరు చిన్నారులను ముక్కు, నోరు మూసి శ్వాస ఆడకుండా చేసి హత్య చేశాడు. కుమారి కూడా చనిపోయిందని నిర్ధారించుకొని మృతదేహాలతో కారులో బయలుదేరాడు. సొంతూరు వెళ్లే దారిలో మంచుకొండ అనే ప్రాంతం వద్ద కారు ఎడమవైపు దెబ్బతినేలా పథకం ప్రకారం రోడ్డు పక్కన చెట్టుకు బలంగా ఢీకొట్టాడు.

కారులో దొరికిన ఖాళీ సిరంజ్ ఆధారంగా

ప్రవీణ్ స్వల్పగాయాలతో బయటపడటం, ఏ చిన్నగాయం కూడా కాకున్నా కుమారి, ఇద్దరు పిల్లలు చనిపోవడం.. ఆమె తరఫువారిలో తీవ్ర అనుమానాలు రేకెత్తించింది. ఫలితంగా ఘటన మరుసటి రోజే కుమారి తరఫు బంధువులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. తమ కూతురు, మనుమరాళ్ల మృతి విషయంలో అనుమానాలున్నాయని కుమారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు కారులో ఖాళీ సిరంజి దొరికింది. కుమారి మృతదేహం చేతికి చిన్న చిన్న మచ్చలు ఉండటంతో అవి ఇంజెక్షన్లకు సంబంధించినవి కావొచ్చునని అనుమానంతో ఫోరెన్సిక్ నిపుణులకు సిఫారసు చేయగా వారొచ్చి నమూనాలు స్వీకరించారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఆధారంగా ముగ్గురిది హత్య అని తేలింది. ప్రవీణ్‌ను పోలీసులు విచారణ చేయగా నేరాన్ని అంగీకరించాడు. అతడి ప్రియురాలు సోనీపైనా కేసు నమోదు చేశారు.



నడి రాత్రంతా రోడ్ల మీద తిప్పి..
వివాహితపై ఇద్దరి అత్యాచారం

- భర్తపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వెళ్తుంటే దారుణం
- అల్వాల్‌లో ఆలస్యంగా వెలుగులోకి

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఇంటికి బయలుదేరిన మహిళ (29) సామూహిక అత్యాచారానికి గురైంది. అల్వాల్ పరిధిలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శుక్రవారం సాయంత్రం యాప్రాల్‌లో ఓ మహిళ ఉబెర్ ఆటో (వాహనం నంబరు ఏపీ 11టీఏ 0266) బుక్ చేసింది. అందులో డ్రైవర్ పేరు ఎస్ శంకర్ అని ఉంది. ఆ ఆటో రాగానే ఎక్కి ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ పని ముగించుకొని, మళ్లీ అదే ఆటోలో ఇంటికి తిరుగుముఖం పట్టింది. అప్పటికే ఆమెపై కన్నేసిన డ్రైవర్, ఆమెను మాటల్లో పెట్టి, వీధుల గుండా తిప్పుతూ ఓ మద్యం షాపు వద్ద ఆటోను ఆపాడు. మహిళ అభ్యంతరం చెబుతున్నా, అక్కడ ఇద్దరు వ్యక్తులను ఆటో ఎక్కించుకున్నాడు. ఆ ఇద్దరు, మద్యం తాగుతూ మహిళ వద్దువద్దంటున్నా ఆమె తోనూ బలవంతంగా మద్యం తాగించారు. వాహనాన్ని అల్వాల్‌లోని వెంకట్రావు లేన్‌లో ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెను బెదిరింపులకు గురిచేసి ఓ కారు ఎక్కించారు. తర్వాత ఆటో డ్రైవర్ అక్కడి నుంచి తన వాహనంతో వెళ్లిపోగా, కారులోనే ఇద్దరూ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. శనివారం తెల్లవారుజామున 2:45కు ఆ ఇద్దరి నుంచి తప్పించుకొని బాధితురాలు రోడ్డు మీదకొచ్చి కాపాడడంటూ కేకలు వేసింది. ఓ గూడ్స్ క్యారియర్ ఆటో డ్రైవర్ సాయంతో ఆ వాహనంలోనే సమీపంలోని గణేశ్ ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడ స్థానికుల సాయంతో డయల్ 100కు కాల్ చేసి ఘటనపై ఫిర్యాదు చేసింది. బొల్లారం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాధితురాలిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఘటనపై శుక్రవారం జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు, కేసును అల్వాల్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఆటో డ్రైవర్ శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

ఆస్పత్రిలో రోగిని కాల్చి చంపిన దుండగుడు

- దేశ రాజధాని ఢిల్లీలో ఘటన

న్యూఢిల్లీ, జూలై 14: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగిని ఓ దుండగుడు తుపాకీతో కాల్చి చంపేశాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఘటన జరిగింది. పొత్తి కడుపు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న రియాజుద్దీన్ (32) కొన్ని రోజులుగా జీటీబీ ఆస్పత్రిలో ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఆదివారం రియాజుద్దీన్ ఉన్న వార్డు వద్దకు వచ్చిన ఓ 18 ఏళ్ల దుండగుడు తుపాకీతో ఆయనపై కాల్పులు జరిపి పారిపోయాడు. దాంతో రియాజుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆస్పత్రిలోని రోగులతో పాటు సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కాల్పుల వెనకాల ఉన్న కారణాన్ని తెలుసుకునేందుకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అసోంలో రూ. 17.5 కోట్ల హెరాయిన్ పట్టివేత

గువాహటి, జూలై 14: అసోంలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు జరిపిన దాడుల్లో సుమారు రూ. 17.5 కోట్ల విలువైన హెరాయిన్ పట్టుబడగా, నలుగురు అరెస్టయ్యారు. ఆదివారం గోల్‌ఘాట్ జిల్లా ఉరియమ్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిపై దాడి చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్) బృందం... ఇద్దరు వ్యక్తుల నుంచి 13 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. విచారణ అనంతరం వారి సోదరి ఇంట్లో కూడా సరుకు దాచినట్లు నిందితులు ఒప్పుకోవడంతో... అక్కడి నుంచి దాదాపు 1.72 కేజీల హెరాయిన్‌ను పట్టుకుంది. శనివారం రాత్రి గువాహటిలోని కట్టబరి ప్రాంతంలో ఇద్దరు వ్యక్తుల నుంచి సుమారు రూ. 2.50 కోట్ల విలువైన 308 గ్రాముల హెరాయిన్‌ను ఎస్టీఎఫ్ స్వాధీనం చేసుకుంది.

విమాన ఇంధనంపై వ్యాట్ 5-10% పెంపు?

- ఆదాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వ కసరత్తు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆదాయ వనరులను పెంచుకోవడానికి ఉన్న అన్ని మార్గాలనూ అన్వేషిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. 'విమానాల ఇంధనం (ఏటీఎఫ్)'పై పన్నును పెంచాలని యోచిస్తోంది. ఏటీఎఫ్‌పై విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను 5 నుంచి 10 శాతం వరకు పెంచాలని ఆలోచిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏటీఎఫ్‌పై 1 శాతం వ్యాట్ వసూలు చేస్తున్నారు. దీన్ని 10 శాతానికి పెంచితే ఏడాదికి రూ.300 కోట్ల ఆదాయం వస్తుంది. వాస్తవానికి విమానాల ఇంధనంపై దేశంలో తెలంగాణ ప్రభుత్వ మాత్రమే అతి తక్కువ వ్యాట్ వసూలు చేస్తోంది. రాష్ట్రంలో 16 శాతంగా ఉన్న వ్యాట్‌ను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 1 శాతానికి తగ్గించింది. 2017లో దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి వచ్చినప్పుడు.. పెట్రోలు, డీజిల్, ఏటీఎఫ్‌పై విధిస్తున్న వ్యాట్‌ను కూడా జీఎస్టీలో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్‌ను తగ్గించాలని కేంద్రం సూచించింది. కేంద్రం సూచనలతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు విమాన సర్వీసుల కనెక్టివిటీని పెంచుకోవాలంటే ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను తగ్గించాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. ఏటీఎఫ్‌పై 16 శాతంగా ఉన్న వ్యాట్‌ను 1% శాతానికి తగ్గిస్తూ 2018లో నిర్ణయం తీసుకుంది. కేంద్రం సూచన మేరకు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణా, త్రిపుర, ఉత్తరాఖండ్, హిమాచల్ వంటి రాష్ట్రాలు 1 నుంచి 4 శాతం వరకు వ్యాట్‌ను తగ్గించాయి. కొన్ని రాష్ట్రాలు మాత్రం 18 నుంచి 29 శాతం వరకు వసూలు చేస్తున్నాయి. తమిళనాడు, బిహార్‌లో 29%; రాజస్థాన్‌లో 26%, ఢిల్లీ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లో 25 శాతం చొప్పున; అసోంలో 23.65%, కర్ణాటకలో 18% మేర వ్యాట్ వసూలు చేస్తున్నాయి. ఈ తరుణంలో ఒకసారి తగ్గించిన వ్యాట్‌ను మళ్లీ భారీగా పెంచితే.. కేంద్రానికి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రావొచ్చన్న సందేహం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అందుకే ఇదివరకు అమలైన 16 శాతానికి కాకుండా.. కనీసం 10 శాతం వరకైనా పెంచాలన్న ఆలోచన చేస్తోం ది. వ్యాట్ పెంపును పరిశీలించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

భూ బకాసురులపై చర్యలేవీ?

అసెంబ్లీ ఎన్నికల వేళ అడ్డగోలుగా సర్కారు స్థలాల క్రమబద్ధీకరణ

- నాటి ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలున్న వారి అక్రమాలు
- రిజిస్ట్రేషన్ ధరలకే రూ.కోట్ల స్థలాల స్వాహా
- 7 నెలల కిందటే వెలుగులోకి..
- క్రమబద్ధీకరణలను పునఃసమీక్షించాలని సీసీఎల్‌ఏ ఉత్తర్వులు
- అయినా అడుగు ముందుకు పడని వైనం

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 59 కింద అక్రమంగా క్రమబద్ధీకరించిన భూముల వ్యవహారం వెలుగులోకి వచ్చి దాదాపు ఏడు నెలలైనా.. ఇప్పటి వరకు ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న కన్వేయన్స్ డీడ్‌లను రద్దు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. అక్రమాలు ఎక్కడెక్కడ జరిగాయి, ఎవరు క్రమబద్ధీకరించుకున్నారు, వెనక ఉండి నడిపింది ఎవరు వంటి వివరాలతో సమగ్ర సమాచారాన్ని విజిలెన్స్ అధికారులు సేకరించి ప్రభుత్వానికి అందజేశారు. అయినా ప్రభుత్వం కబ్జాదారులకు కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. అడ్డదారిలో క్రమబద్ధీకరించుకున్న కన్వేయన్స్ డీడ్‌ను రద్దు చేయాలంటే ముందు నోటీసులు ఇవ్వాలి. సంజాయిషీ ఇచ్చేందుకు విధించిన గడువు పూర్తయ్యాకే రద్దు చేయటానికి అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియకు అడుగులేమీ పడలేదు.

ఇదీ నేపథ్యం..



రాష్ట్రవ్యాప్తంగా జీవో 59 కింద భూముల క్రమబద్ధీకరణకు 2022, 2023లలో 1.40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 32 వేల దరఖాస్తులకు సంబంధించిన స్థలాలను క్రమబద్ధీకరించారు. క్రమబద్ధీకరణ నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో 2020 జూన్ 2 నాటికి ఇల్లు నిర్మించుకొని, అందులో నివాసం ఉండి, ఆ అడ్రస్‌పైనే ఆధార్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, కరెంటు, వాటర్ బిల్లు మొదలైనవి ఉన్నవారికి మాత్రమే ఆ స్థలాన్ని క్రమబద్ధీకరించాలి. జీవో 59లో పేర్కొన్న ఈ నిబంధనలను తుంగలో తొక్కి పలువురు భారీ అక్రమణలకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఖాజాగూడ, గండిపేట, శేరిలింగంపల్లి, మల్కాజిగిరి, అబ్దుల్లాపూర్‌మెట్, కీసర, పటాన్‌చెరు, బాచుపల్లి, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో కోట్ల విలువ చేసే స్థలాలను కేవలం రిజిస్ట్రేషన్ విలువలకే అడ్డదారిలో క్రమబద్ధీకరించుకున్నారు. ఈ తతంగం అంతా 2023లో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ముందు నుంచి, ఎన్నికల ఫలితాలు వెలువడే ముందు రోజు వరకు జరిగింది. రాష్ట్రంలో అనేక ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోనూ ఈ జీవోను అడ్డం పెట్టుకొని కొందరు భారీ అక్రమాలకు పాల్పడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు తమ ఇంట్లో పనిచేసేవారు, డ్రైవర్లు, కార్యకర్తలు, వారి వారి కుటుంబసభ్యుల పేర్ల మీద క్రమబద్ధీకరణ చేయించారు. కొందరు ఇల్లు లేకపోయినా ఆ స్థలాలను క్రమబద్ధీకరించుకున్నారు. గతంలో కూల్చిన ఇళ్ల మొండిగోడలకు ఇంటి నెంబర్లు, కరెంట్ బిల్లులు తెచ్చుకొన్నారు. మరికొందరు ఒకే ఇంటి నెంబరుతో అనేక దరఖాస్తులు చేసి క్రమబద్ధీకరించుకున్నారు. ఒకే కరెంట్ బిల్లుతో పదుల సంఖ్యలో దరఖాస్తులను క్రమబద్ధీకరించుకున్నారు. క్రమబద్ధీకరించిన స్థలాలను కొందరు మరుసటి రోజే విక్రయించారు. మరికొందరు అదేరోజు అమ్మేశారు.

దృష్టి పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ భారీ భూ కుంభకోణంపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. వీటికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, అర్హులను గుర్తించే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, జీవో 59 కింద అప్పటికే క్రమబద్ధీకరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని సీసీఎల్‌ఏ నవీన్‌మిత్తల్ ఈ ఏడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాలలో క్రమబద్ధీకరణ పూర్తయిన స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వరాదని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీలను ప్రభుత్వం ఆదేశించింది. రంగారెడ్డి జిల్లాలో క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించి అమ్మకాలు, కొనుగోళ్లకు అనుమతివ్వరాదని జిల్లా కలెక్టర్ శశాంక్.. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌కు జనవరి 29న ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోకపోవటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రి ప్రకటనతో మళ్లీ తెరపైకి

తాజాగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అక్రమంగా క్రమబద్ధీకరించిన స్థలాలను వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పటంతో ఈ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. కబ్జాదారులు ప్రభుత్వానికి చెల్లించిన (కన్వేయన్సీ డీడ్ అమౌంట్) దాదాపు రూ.32 కోట్లు తిరిగి వారికే చెల్లించి, భూములను స్వాధీనం చేసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో భారీ అక్రమాలు జరిగినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఇకనైనా ముందడుగు పడుతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

మఖ్దూమ్ మొహియుద్దీన్ పురస్కార ప్రదాన సభ

మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం (2024) ప్రదాన సభ జూలై 16 ఉ.11 గంటలకు హైదరాబాద్ లోని ప్రభుత్వ సిటీ కాలేజ్‌లో జరుగుతుంది. పురస్కారాన్ని అమ్మంగి వేణుగోపాల్ స్వీకరిస్తారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ పి. బాల భాస్కర్ అధ్యక్షతన జరిగే సభలో ముదిగంటి సుజాతా రెడ్డి, యాకూబ్, వాహెద్, రాయారావు సూర్య ప్రకాశరావు అతిథులుగా పాల్గొంటారు. అవార్డు కమిటి కన్వీనర్ విప్లవ్ దత్ శుక్ల, సభ్యులు ఏలూరి యాదయ్య, జె రత్న ప్రభాకర్.

కోయి కోటేశ్వర రావు

కరుణాకర్ స్మారకోపన్యాసం

కరుణాకర్ 3వ వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసం, సంస్మరణ సభ జూలై 21 ఉదయం 10గంటలకు ఎల్‌బిజి హాల్, రంగారాయుడి చెరువు దగ్గర, ఒంగోలులో జరుగుతుంది. అధ్యక్షత రమాసుందరి. 'నూతన విద్యా విధానం, సమాజంపై దాని ప్రభావం' అంశంపై వేణుగోపాల్, 'పర్యావరణ సంక్షోభం, రాజకీయ ఆర్థిక మూలాలు' అంశంపై వరలక్ష్మి మాట్లాడతారు.

అరసవిల్లి కృష్ణ

తంగిరాల కృష్ణప్రసాద్ రంగస్థల పురస్కారం

25వ తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని సుఖమంచి కోటేశ్వరరావు స్వీకరిస్తారు. పురస్కార ప్రదానం జూలై 21 సాయంత్రం 5 గంటలకు, ఠాగూర్ గ్రంథాలయం, విజయవాడలో జరుగుతుంది. ముఖ్య అతిథి వడ్డే శోభనాద్రీశ్వరరావు. 25 మంది సాహితీవేత్తలకు, కళాకారులకు సత్కారం ఉంటుంది.

తంగిరాల చక్రవర్తి

కార్టూనిస్ట్ శేఖర్ పురస్కారం

కార్టూనిస్ట్ శేఖర్ స్మారక పురస్కారం 2024 సంవత్సరానికి గాను తెలంగాణ టుడే కార్టూనిస్ట్ పి. నర్సిం ఎంపికయ్యారు. పురస్కార ప్రదానం జులై 21 ఉదయం 10.30 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది. వివరాలకు: 9052116323

శేఖర్ కుటుంబ సభ్యులు

థాంక్స్ గివింగ్

ఎవడైనా సరే
రణరంగంలోనే పాఠాలు నేర్చుకోవాలి
శిబిరం నుంచే తొలి పోరాటం మొదలుపెట్టాలి
ఎవడి చరిత్రను వాడే రాసుకోవాలి

నేల సారవంతంగా ఉన్నా భయాపహాస్యాల గుప్పెట్లో చేతన పెరగక
దళితోద్యమం ఎడారిలో పెరుగుతున్న చెట్టు గనక
చదవేసిన కొంపల్లో ఆత్మగౌరవోద్యమం
ఎర్ర సూర్యాస్తమయంలా కనుమరుగయ్యే లోపల
విహంగ వీక్షణ యాత్ర ఇక్కడినుంచే మొదలుపెట్టాలి...
'మాదిగ కుక్కల్లారా!
మమ్మల్ని ఎదిరించినందుకు గుణపాఠం నేర్చుకున్నారా' అని
సవాలు చేసిన జాతి గ్రామాలకు
గుంటూరు నగరవీధుల్లో పట్టపగలు దివిటీలతో ఊరేగిన కవికోకిల
గుర్తుకొస్తే ఎవరికెవరు గుణపాఠాలు నేర్పారో తెలుస్తుంది
కుల ఘర్షణల కుండపోతల మధ్య
విచిత్ర దేశం దాక్కుని ఆత్మగౌరవాన్ని వాగ్దానం చేసినా
నమ్మని తాటాకుల ఇళ్ళలో విజయనగర్ కాలనీలు మొలుస్తాయి..
గంజికి గతిలేని పద్దెనిమిది పేద పేటల్లో
'పూటకో పేట' నినాదమై ఆకలి తీర్చిన రోజుల్నీ
అన్నం దొరకని రాత్రుళ్ళు కడుపు నింపిన స్వచ్ఛమైన వాగులా
తేనెలా తీపి చేసిన తెనాలి మంచి నీళ్ళనీ ఎలా మర్చిపోతాం

నాలుగు దశాబ్దాల ఉద్యమ పుట్టనెక్కి
తెలుగు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ తలదాచుకున్న
పొన్నూరు తెలుగు లుంబినీ వనానికి తీర్థయాత్ర చేసి
శాక్యముని కత్తిని పలకరించి 'కట్టెలమోపు'ను మొయ్యాలి
లుంబినీ వనమే గానీ దేదీప్యమానంగా వెలిగే పార్కులుండవు
స్వర్ణకుమారి నివాసమేగానీ, స్వర్ణ భస్మమే తప్ప,
లేశమాత్రం స్వర్ణం ముండదు.
రాజమాత మాయావతి భవనాలూ, బ్రాహ్మీలిపిలో శాసనాలూ..
రాతితో చెక్కిన ఠీవిగా కనబడే గొప్ప అశోక స్తంభం,
మౌర్యుల కాలం నాటి కలప నిర్మాణాల భవనాలు ఉండవు.
శ్రీనాధుడి హంస తూలికా తల్ప దృశ్యాలు చూడముగానీ



పాత మడత కుర్చీలో ఒక మూల కూర్చుని
కవిత్వమో కథో వ్యాసమో డిక్టేట్ చేస్తూ కనబడతాడుగానీ
కన్నమనీడై ఖడ్గాన్ని ధరించిన జ్ఞాపకాలింకా పచ్చిగానే ఉన్నాయి..

దుఃఖభాజనమైన నదులు చెలియలికట్టలు దాటుతాయి కాబోలు
వినడానికొక సింగిల్ విండో పథకమెప్పుడూ తెరిచే ఉంటుంది
అన్ని ట్రోల్ ఫ్రీ నంబర్లూ అక్కడ పనిచేస్తాయి

నవలల్లో తప్ప ఎవరూ ఊసెత్తని 'మాలపల్లి' చుండూరులో
కొన్ని బియ్యే ఎమ్మేలు మోటార్ సైకిళ్లెక్కి చక్కర్లు కొడుతున్నాయని
అంటరాని వసంతం అక్కడంతా విరగబూస్తోందని
ద్విత్వాక్షర కులాలు కత్తులు దూసిన నెత్తుటి దార్లలో అతను

హంసగీతంను గుర్తుచేసిన ఊరిని చూసి రావాలని ఉంది
ఇంకా కులం లేదని బుకాయించేవాళ్ళని
మోదుకూరు బ్రిడ్జి కిందకూ ట్రెక్కింగ్ చేయించాలని ఉంది


అతని స్వరం ఉద్యమానికి బలమైన సాక్ష్యంలా.
సుద్ద కళాకారుడిలా పోరాట చిత్రాల్ని వీధుల్లో గీస్తూ...
గ్రీకు ఎరితోస్తెనేస్ నీడల్ని కనుగొన్నట్టు
తుంగభద్ర కాలువలో నిర్భాగ్య మృతదేహాల బయటకు తీస్తుంది
నిద్రపుచ్చిన కథలతో మనమంతా హాయిగా నిద్రపోతున్నప్పుడు
కళ్ళు తెరిచి పాలీ ప్రాకృత హిందీ తమిళ్ మళయాళ భాషల్లో
'న్యాయ' పదానికి చెబుతున్న అర్థం
తెలుగు మాగాణంలో ఎందుకు లేదో ఆలోచిస్తూ ఉంటుంది...

పదేళ్ల క్రితమే పదవీ విరమణ చేసినా
కనీసం లక్షరూపాయల పెన్షన్ పట్టుకెళ్ళే ఉద్యోగాన్ని ఒదిలేశాక
నిరాశ సంకెళ్ళతనికి ఎవరు వెయ్యగలరు!
ఇంటి ముందు పడ్డ ఉద్యమాల పరకల్ని మోకు పేనుకుంటూ
బాధల క్షేత్రాల్ని వెదుక్కుంటూ వెళ్ళిపోతాడతను...
ఇంత పోరాట వారసత్వం మిగిల్చాక
తనకు చావెక్కడిదని గలగలా నవ్వుతాడు...
అవును!
ఎంతిస్తే మాత్రం అతని రుణాన్ని ఈ జాతి తీర్చుకుంటుంది గనక
అతనికి బాకీపడ్డ రుణాన్ని ఎవరు మాఫీ చేస్తారు గనక...

(నాలుగు దశాబ్దాల దళితోద్యమంపై విహంగ వీక్షణం)

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
95380 53030

గౌరిపెద్ది అవధాన పద్య కళాసౌరభం



ఆంధ్ర సారస్వతంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనా సాహిత్యం అనేక అనర్ఘ వాఙ్మయ రత్నాలకు గని. ఆ రత్నాలను త్రవ్వి తీసి, సానపట్టి కాంతి పుంజాలను తెలుగువారి హృదయ మందిరాలలో ఆరని జ్యోతులుగా ప్రకాశింప చేసినవారు పండిత ప్రకాండులు వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గార్లు. అంతటి విద్వాంసుల సరసన ఆసీనులై అన్నమయ్య కీర్తనల పరిష్కరణ ఘనతను సాధించినవారు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు (10.09.1922 - 21.01.1991).

మహాభారతాంధ్రీకరణలో సింహభాగం తిక్కనకు దక్కినట్లుగానే అన్నమయ్య కీర్తనల పరిష్కరణ తపస్సులో అధిక భాగం రామసుబ్బ శర్మ గారికి దక్కింది. అన్నమయ్య సంకీర్తనలతో 27 సంపుటాలను పరిష్కరించారు. 19 సంపుటాలకు విస్తృత పరిశోధనాత్మక పీఠికలు రచించారు. ఎన్నో పద్య కావ్యాలు రచించారు. అవధాన విద్యలో అగ్రగణ్యులు. శతాధిక అష్టావధాన, శతావధానాలు చేశారు.

అవధానంలోని అన్ని అంశాలలోనూ శర్మగారి ప్రతిభ నవనవోన్మేషంగా వికసించేది. సంస్కృతాంధ్ర భాషలు రెండింటిలోనూ రసవత్తరంగా సమస్యాపూరణలు సాగేవి. శతావధానులే వీరి అవధానాలలో పృచ్ఛకులుగా పాల్గొనేవారు. ఒకసాటి అష్టావధానంలో గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారికి పృచ్ఛకుడు ఇచ్చిన సమస్య- "వర్జ్యము కాదు మాంస మధుపానము బ్రాహ్మణ జాతికెయ్యెడన్" అనేది. సహజంగా ఇది వ్యవహార విరుద్ధం. ఈ విరుద్ధ భావాన్ని తొలగించి సమస్యను పరిష్కరించాలి. ఈ క్లిష్టతకు తోడు దీనిలో ప్రాసాక్షరం 'ర్జ్య' అనే దుష్కర ప్రాస. నిఘంటువులలో 'ర్జ్య' సంయుక్తాక్షరం రెండో అక్షరంగా కల పదాలు కనిపించవు. బ్రాహ్మణులకు మాంస మధుపానము వర్జింప (విడిచిపెట్ట) తగినవి కావు అనే సదాచార వ్యతిరిక్త భావాన్ని సానుకూలంగా మలచుకొని అవధానిగారు ఈ విధంగా పూరించారు.

"భర్జ్యములౌచు నంజుడులు పాకమునన్ రుచినించ వచ్చుపో
వర్జ్యము లేక వానినొక వర్గము వారు భుజింపవచ్చుపో
మార్జ్యత గల్గు చోట అనుమానము లేక భుజింప వచ్చు ఆ
వర్జ్యము కాదు మాంస మధుపానము బ్రాహ్మణజాతి కెయ్యెడన్."

- ఇలా 'వర్జ్యము' అనే పదానికి 'ఆ' అనే అక్షరాన్ని ముందు చేర్చి స్వీకరింప దగినవి కావు అనే సముచితార్థాన్ని సాధించారు. సంస్కృత ధాతువులకు ముందు చేరే కొన్ని ప్రత్యయాలు (ప్రాదులు) ధాతువు అర్థాన్ని మార్చి వేస్తాయి. 'గమనం - ఆగమనం' అనేది ప్రసిద్ధమైన ఉదాహరణ. పై పూరణ పద్యంలోని 'భర్జ్యము, మార్జ్యత' పదాలు పాణిని అష్టాధ్యాయి వ్యాకరణ శాస్త్రంలోని ఉణాది సూత్రాల ఆధారంగా రూపొందింపబడిన పదాలు. ఇది గౌరిపెద్ది వారి పాండిత్య ప్రకర్షకు, వ్యాకరణ శాస్త్ర అధికారానికి ప్రబల నిదర్శనం.

సంస్కృత భాషలోనైతం గౌరిపెద్ది అవధాన చాతుర్యం పలు సందర్భాల్లో ప్రస్ఫుటం అయింది. ఒక పర్యాయం కర్నూలులో చేసిన అవధానంలోని వర్ణనాంశంలో వర్షర్తువు, ఒక కన్య అనే రెండర్థాలతో కూడిన శ్లేషాలంకారంతో సంస్కృత శ్లోకం చెప్పవలసినదిగా పృచ్ఛకుడు అడిగినప్పుడు శర్మగారు-

"తటిల్లతాచారు పయోదరోజ్జ్వలా
నవాంబుధారా రశనోజ్జ్వలత్కటీ
సుబర్హిణోపాత్త మనోహర స్వరా
నికామయా నృత్యతి వర్ష కన్యా" అని వర్ణించారు.

మెరుపు తీగ వంటి శరీర కాంతి, మనోహరమైన వక్షస్థలమూ కలిగి నూత్నమేఘం వలె సౌందర్యవతియై మొలనూలి కాంతిచే శోభాయమానంగా కదులుతూ నెమలి కంఠ ధ్వని వంటి మనోహర కంఠ ధ్వని కలిగినదై వర్ష సమయంలో ఒక కన్య నృత్యం చేస్తున్నదని స్త్రీ పరమైన అర్థం. మెరుపు తీగలు, అందమైన మేఘాలచే ప్రకాశిస్తూ నూతన జలధారలు కలిగి రశనా కాంతి వలె ప్రకాశమానమై మయూర రావ మనోహరమై స్వేచ్ఛగా వర్ష కన్య నృత్యం చేస్తున్నదని వర్షపరమైన అర్థం. గౌరిపెద్దివారి సంస్కృత పాండితీ గరిమకు ఇది ఒక ఉదాహరణ.

> **అవధానం తెలుగు భాషకు సహజసిద్ధమైన ఆభరణం. తమ అవధానాల ద్వారా తెలుగు భాష విశిష్టతను చాటిచెప్పిన ఖ్యాతిని ఆర్జించిన వారు గౌరిపెద్ది. సంస్కృతాంధ్ర భాషాభిజ్ఞతతో, శ్లేషాది అలంకార సౌభాగ్యంతో, పద ప్రయోగ చమత్కారాలతో, మనోజ్ఞమైన ప్రకృతి దృశ్యాలతో, పౌరాణిక నేపథ్యంతో, జనజీవన సరళితో గౌరిపెద్ది వెలువరించిన అవధాన పద్యాలు తెలుగువారి హృదయాలలో అమందానందానుభూతిని పండించేవి.**

సాధారణంగా పదాలను సందర్భోచితంగా విభజించటం వలన వినూత్నమైన అర్థాలు గోచరించి సన్నివేశానికి సొగసును చేకూర్చుతాయి. అటువంటి స్వారస్యయుతమైన సమస్యా పూరణను గౌరిపెద్ది అవధానాలలో ప్రేక్షకులు ఆస్వాదించి రసానుభూతి నందిన సందర్భాలు కోకొల్లలు. ఒక పృచ్ఛకుడు ఇచ్చిన "మంచాలన్ బిగియించె గూటములకమ్మా బిందియన్ దేగదే" అనే సమస్యను ఈ విధంగా పూరించారు:

"సంచారంబులు మాని ధేనువులు నిశ్శంకంబుగా దొడ్లలో
చంచద్వత్సతరావళీ కలితదుస్సంబాధలై తోచు నా
పంచన్ పెత్తనమేల దూడలవిగో పారెన్ వడిన్ పిండ ని
మ్మంచాలన్ బిగియించె గూటముల కమ్మా బిందియన్ దేగదే"

- ఇక్కడ అచ్చమైన పల్లె జీవితం నేపథ్యంగా ఈ సమస్య పూరింపబడింది. గోధూళివేళ ధేనువులు సంచారాలు మాని, లేగదూడలు అటూయిటూ గంతులు వేస్తూ ఇరుకు స్థలంలో బాధపడుతున్నాయి. పంచలో పెత్తనం విడిచిపెట్టి పాలు పిండటానికి వెంటనే బిందె తీసుకొనిరా. ఆవులు గూటాలకు బిగించి కట్టివేయబడినాయి అని ఒక తల్లి తన కుమార్తెతో అంటున్న సన్నివేశాన్ని అవధాని దృశ్యీకరించారు ఈ పద్యంలో. 'పిండనిమ్ము + అంచు + ఆలన్' అనే పద విభాగంతో సమస్య తొలగిపోయింది. 'అనుచు' అనే క్రియాపదంలో నడుమ 'ను' వర్ణం స్థానంలో బిందువు వచ్చి 'అంచు' అవుతుంది. 'ఆవు + లు' - 'లు' బహువచనం పరమైనప్పుడు ఏకవచన ప్రత్యయం 'వు' లోపించి 'ఆలు' - అవుతుంది.

అవధానాలలో ఆశువు ఒక అంశం. గౌరిపెద్దివారి ఒక అవధానంలో పార్వతీ పరమేశ్వరుల సమాగమాన్ని సీస పద్యంలో ఆశువుగా వర్ణించమని పృచ్ఛకుడు అడిగినప్పుడు ఆలంకారిక శైలిలో చక్కని సీస పద్యం వారి ముఖతః వెలువడింది. గౌరిపెద్దివారికి శ్రీనాథుని కవిత్వంపైనా, శ్రీనాథుని సీసపద్య రచన పట్లా అపారమైన ప్రీతి. ఆనాటి అవధానంలో శ్రీనాథుని సీస పద్య శైలిని తలపించే రీతిలో సుకుమార భావ సౌందర్యంతో వారు అల్లిన సీసం పండితుల తలలూపింపచేసింది.

"బంధూక కుసుమ ప్రభాహారి కౌశేయ
వీచికా బంధంబు వెలుగులుమీయ
శింజాన మంజీర మంజుల ధ్వనిపాద
విన్యాస తాళంబు విధము దోప
శివుచూడ నడసాగు చిన్నారి చూపులే
దారి చూపెడి ప్రతీహారిగాగ
గిరిరాజసుత వచ్చె తరలిపొందను లీల
మొలనూలిడెల్ బరాబరులు సేయ
మేనికలపంబు వాసన మిడిసి పడగ
సుమకరందము వల చేత సొగసు కూర్ప
మరుని యూపిరి తన్నని మసలు కొనగ
అభవు కొలువంగ వచ్చు మాయమ్మ దలతు"

కైలాస గిరిపై తపోదీక్షలో ఉన్న పరమేశ్వరుని సేవకై నడచి వస్తున్న పార్వతి రమణీయ రూపాన్ని దర్శింపచేశారు. శైలీ మనోహరత్వం, రచనలో పొంకమూ, పదప్రయోగంలో నాజూకుతనమూ, గౌరి నడకలో విలాసమూ గౌరిపెద్దివారి సీసంలో చిందులు వేశాయి.

అవధానం తెలుగు భాషకు సహజసిద్ధమైన ఆభరణం. తమ అవధానాల ద్వారా తెలుగు భాష విశిష్టతను చాటిచెప్పిన ఖ్యాతిని ఆర్జించినవారు గౌరిపెద్ది. సంస్కృతాంధ్ర భాషాభిజ్ఞతతో, శ్లేషాది అలంకార సౌభాగ్యంతో, పద ప్రయోగ చమత్కారాలతో, మనోజ్ఞమైన ప్రకృతి దృశ్యాలతో, పౌరాణిక నేపథ్యంతో, జనజీవన సరళితో గౌరిపెద్ది వెలువరించిన అవధాన పద్యాలు తెలుగువారి హృదయాల్లో అమందానందానుభూతిని పండించేవి.

వెలువోలు నాగరాజ్యలక్ష్మి
93941 13848

సువర్ణముఖి ఒడ్డున ఇసక బొమ్మల గూడు



ఆధునిక తెలుగు సాహిత్యం చాలావరకు మిడిల్ క్లాస్ వ్యవహారం లానే నడిచింది. పంతొమ్మిదొందల ఎనభైలూ తొంభైల దాకా కూడా అది మిడిల్ క్లాస్ చేత, మిడిల్ క్లాస్ కోసం, మిడిల్ క్లాస్ థీమ్స్‌తో రాయబడిందే. దాన్ని బేరీజు వేసింది కూడా అదే క్లాసు. పేద వర్గాల నుంచి ప్రతిభావంతులైన రచయితలు రావడం మొదలైంది ఎనభైలూ తొంభైల తర్వాతే (అప్పటిదాకా కులం, దాన్నంటుకునే ఉన్న పేదరికం వాళ్ళని చదువుల దాకా రానివ్వక). నాగప్పగారి సుందర్రాజు లాంటి రచయితల తర్వాత తెలుగు సాహిత్యపు సెంటర్ మిడిల్ క్లాస్ నుంచి పక్కకు జరుగుతూ వచ్చింది. ఇక్కడ మిడిల్ క్లాస్ అంటే జేబు తాహతు మాత్రమే కాదు, అదొక మనస్తత్వం కూడా.

ఇప్పటికీ ఎనభైల ముందే తెలుగులో గొప్ప సాహిత్యం అంతా వచ్చేసిందీ, ఇక ఆ తర్వాతంతా వేస్ట్‌లాండ్సే అన్న అభిప్రాయంతో చాలామంది ఉన్నారు. సాహిత్యాన్ని బేరీజు చేసే వ్యవస్థను ఇంకా మిడిల్ క్లాస్ మనస్తత్వమే ఆక్రమించుకుని ఉండటం దీనికి ముఖ్య కారణమనుకోవాలి. ఈ మెంటాల్టీ ఉన్నవాళ్ళు ఇప్పుడు అనేక అస్తిత్వాల నుంచి, వర్గాల నుంచి విరివిగా వస్తున్న సాహిత్యాన్ని నొస్టాల్జియా సాహిత్యం కేటగిరీలోకో, లేదంటే ఊళ్ళ పేర్లు పెట్టుకుని రాసే కతలు అనో పక్కకు తోసేస్తారు. అదీకాదంటే ఉదారంగా అథోజగత్ సహోదరుల కథలు అని దీవిస్తారు. వీళ్ళ ఉద్దేశంలో 'అథోజగత్' అంటే వీళ్ళకి కింద ఉన్న ప్రపంచం, మరి వీళ్ళెక్కడయ్యా అంటే- మిడిల్ క్లాస్! ఒకవేళ వీళ్ళు ఈ సాహిత్యాన్ని ఒప్పుకున్నా ఆ లెక్కలు వేరే ఉంటాయి. ఆయా సామాజిక వర్గాల అస్తిత్వాలకు సంబంధించిన సోషల్ డాక్యుమెంట్లలాగ మాత్రమే ఈ సాహిత్యానికి విలువ ఇస్తారు. దీనికి తగ్గట్టే కొంతమంది రచయితలు ఊరిలో బాల్య జీవితాల్నీ పేదరికాన్నీ మిడిల్ క్లాస్ టేస్ట్‌కు నప్పేట్టు, వాళ్ళకు నొప్పెట్టనంత సున్నితంగానూ కంఫర్టబుల్‌గానూ, మ్యూజియంలో అద్దాల వెనక ప్రదర్శనల్లాగా చేసి చూపించేవాళ్ళూ ఉన్నారు. ఇలాంటి ప్రదర్శనాభిలాష లేకుండా, "మా జీవితాలు మీ లివింగ్ రూముల్లోకి వచ్చి మీ సోఫాల్లో కూర్చోవు, చూడదల్చుకుంటే మీరే అంబేద్కర్ బొమ్మ దాటి మా వాడల్లోకి వచ్చి ఇక్కడ నిలబడి చూడండి!" అని ఎసెర్టివ్‌గా రాసే వాళ్ళు అరుదు. అలాంటి అరుదైన రచయితల వరసకు గొప్ప చేర్పు సొలోమోన్ విజయ్ కుమార్. రచయితగా ఆయన వయసు రెండు పుస్తకాలు. మొదటిది 'మునికాంతపల్లి కతలు' కథా సంపుటి, రెండోది 'సన్ ఆఫ్ జోజప్ప' నవల.

> **'మునికాంతపల్లి మనుసుల్ని సొర్ణముకి యేటి ఇస్కతో జేసినట్టుండారు. పాడిసక ఎంత తేలిగ్గా యాళ్ల సందల్నుంచి జారిపోతాదో తడిసక అంత బొరువు' అంటాడు రచయిత. ఆ బరువైన తడి ఇసకతో చేసిన బొమ్మల చుట్టూ మెత్తిన ఇసక గూడు ఈ కథల పుస్తకం.**



మునికాంతపల్లి అనే ఊరు ఎక్కడా లేదు. అది సొలోమోన్ విజయ్ కుమార్ సువర్ణముఖి నది ఒడ్డున తనకు తెలిసిన మనుషుల్నీ, కథల్నీ సాహిత్యం చేసేందుకు కల్పించుకున్న ఊరు. విజయ్ కుమార్ తనకు జరిగిన అనుభవాల్నీ, తనకు తెలిసిన మనుషుల్నే కథలుగా చెప్తున్నానంటారు. ఆయన శైలి ఆ కథల్ని ఆపకుండా చదివిస్తుంది. కథ మొదలు పెట్టడమే ఒక సంఘటనతో మొదలుపెట్టి రెండు మూడు వాక్యాల్లోనే పాఠకుడ్ని కథ మధ్యలోకి తెచ్చి పడేస్తారు. తేరుకునే లోగానే రెండు మూడు పేజీల్లో ముగించేస్తారు. తన కవిత్వ నేపథ్యం తనను ఇలాంటి క్లుప్తతవైపు నడిపించిందని ఆయన చెప్తారు. కథేం లేదూ అనుకున్న చోట కథ పుట్టించడంలో సొలోమోన్ విజయ్ కుమార్‌ది ప్రత్యేక ప్రతిభ. ఈ కథలు చదివితే మనం మన చుట్టూ ఉన్న ఇన్ని కథల్ని చూడనే లేకుండా మిస్ అవుతున్నామా అనిపిస్తుంది.

ఊళ్ళో అన్ని సందులూ, అందరు మనుషులూ తెలిసినవాడొకడు ఫ్రెండ్ లాగా మన భుజం మీద చేయేసి ఆ ఊరి వీధులమ్మటా మనల్ని నడిపిస్తూ దార్లో కనపడిన ప్రతి మనిషినీ చూపించి 'యీడి గురించి నీకోటి చెప్పాలిరా' అనో 'ఈమె భలే మనిషిరా' అనో వాళ్ళ కథలు చెప్తూ తీసుకెళ్తున్నట్టు ఉంటుంది. విజయ్ కుమార్‌కి సృష్టిలో మనుషులకంటే, వాళ్ళ కథలకంటే ముఖ్యమైందేదీ లేదు. ఒక కథలో దేశదిమ్మరి కాశయ్య ఎక్కడెక్కడో తిరిగొచ్చి ఓ రోజు ఊళ్ళో చెట్టు కింద తన పక్కనే కూలబడి, 'అడవుల్లోని సల్లదనవూ, బచ్చదనవూ, కొండల కాడ గాలీ..' అంటా ఉంటే, అదంతా వద్దు కథకుడికి. కాశయ్య ఎప్పుడో యవ్వనంలో పెళ్ళి చేస్కుని వదిలేసినామె కథే కావాలి. 'మల్లమ్మని జేసుకున్నానంటివే, యేమైనాదావే?' అంటాడు. ఆ ఊళ్ళో ఉన్న ప్రతి మనిషి కథ పట్లా ఈ 'ఇళ్ల బుచ్చోడి'కి ఉన్న కుతూహలమే, తరగని దాహమే ఇందులోని ప్రతి కథనీ చేయిపట్టి నడిపిస్తుంది! 'సిన్నప్పుడు వాకిటికొక కతా, మనిషికొక కళా గెవణిస్తా తిరిగినాను కాబట్టే ఇన్ని సంవొచ్చరాలు గడిసినాక ఈ పిడికెడు సిట్టిపొట్టి కతల్ని రాయగలిగానని అనుకుంటుండాను' అని చివరిమాటలో చెప్తాడు. 'మునికాంతపల్లి మనుసుల్ని సొర్ణముకి యేటి ఇస్కతో జేసినట్టుండారు. పాడిసక ఎంత తేలిగ్గా యాళ్ల సందల్నుంచి జారిపోతాదో తడిసక అంత బొరువు' అంటాడు. ఆ బరువైన తడి ఇసకతో చేసిన బొమ్మల చుట్టూ మెత్తిన ఇసక గూడు ఈ కథల పుస్తకం. చదువుతుంటే కరిగి నీరైపోయే మన మనసు లోనే ఆ బొమ్మలన్నీ కరిగి కలిసిపోతాయి.

ఈ కథలు చెప్పటానికి విజయ్ కుమార్ అచ్చంగా 'చెప్పే' శైలినే ఎంచుకున్నాడు. అంటే పుస్తకంలో అక్షరాల రూపంలో కనిపిస్తున్నప్పటికీ ఇవి 'రాయబడిన' కథలు కావు. పాత్రల సంభాషణల్ని వేరు చేస్తూ కొటేషన్ గుర్తులు కూడా లేకపోవటం ఇందుకు ఒక ఋజువనుకోవచ్చు. చెప్పటంలో ఏ విషయాన్ని ఎలా దాచి ఎక్కడ చెప్తే ఆ కథ రక్తి కడుతుందో ఆ శిల్పం విజయ్ కుమార్‌కి తెలుసు. దేవగన్నిక సిత్ర ఆడా మగా కానివాడని ఎక్కడ చెప్పాలో, చివరకి చెరువులో తేలే ఎంగిలోడికి కుష్టురోగముందని ఎక్కడ చెప్పాలో అక్కడే చెప్తాడు. ఈ కథల్లో బూతుల్ని ఎక్కువ వాడతాడు, కానీ ఏ మాటా రచయిత తెచ్చి ఆ పాత్రల నోట పెట్టినట్టు ఉండదు. పాత్రలే వచ్చి రచయిత చెవిలో కూర్చుని చెప్పి రాయించుకున్నట్టు ఉంటాయి.

రచయిత రెండో పుస్తకం 'సన్ ఆఫ్ జోజప్ప'కి వచ్చేసరికి, ముందొచ్చిన కతల పుస్తకం కేవలం నెట్ ప్రాక్టీస్ లాగా అనిపిస్తుంది. కథలకీ, నవలకీ పోలిక తేలేం నిజమేగానీ ఇంతకుముందు కథల్లో అక్కడక్కడా కన్పించిన మొదలుపెట్టాకా ఎటుపోవాలో తెలీనితనం, రెండు మూడు థీమ్స్ మధ్య తన్నకలాడటం లాంటివి ఈ నవల్లో లేవు. ఒకే థీమ్‌ని పట్టుకుని చాలా అందంగా, ధైర్యంగా చెప్పిన నవల ఇది. ఒకానొక హోమోసెక్సువల్ 'పిల్లాడి' కథ (ఆ కేరెక్టర్ పేరు పిల్లోడే). వాడి బాల్యం నుంచి మొదలుకొని, వాడు తన సెక్సువాలిటీ ఇదీ అని అర్థం చేసుకునే క్షణాల మీదుగా, ఆ తర్వాత వాడు దారీతెన్నూ తెలియక తొక్కే చీకటి దారుల గూండా, చివరికి వాడు ఎక్కడకొచ్చి తేలాడో, అదెలాంటి ఒంటరితనమో మనకి అనుభవానికి తెస్తాడు రచయిత. హోమో సెక్సువల్ అంటే అదేదో వేరే జీవి అన్నట్టూ, అలాంటి అనుభవాలు వేరే జీవితం అన్నట్టూ కాకుండా, మన అందరికీ ఉన్న కామమే కాస్త అటు దిశ మార్చుకుంటే, దాన్ని ఒప్పుకునే సమాజం చుట్టూ లేనప్పుడు, అది ఎంత కష్టమైన జీవితం కాగలదో, మనకి అర్థమయ్యేలా చూపిస్తాడు. అలాంటి మనుషుల పట్ల వెక్కిరింతే ఉన్న ప్రపంచంలో మనల్ని ఆ మనిషి మనసు లోకి తీసుకెళ్తాడు, వాడ్ని మనం మన గుండె లోకి తీసుకునేలాగ చేస్తాడు. ఒకరకంగా ఇది భయానక అనుభవాల సంపుటి. చాలా బాధపెట్టే కథ. రాసేవాడు తన తాతగారి వంశపారంపర్య పడక్కుర్చీలో ఒద్దిగ్గా కూర్చుని రాస్తున్నాడా, తడి బారిన గోడల మధ్య వెలుతురు రాని గదిలో చింకి చాప మీద పడుకుని రాస్తున్నాడా అన్న దాంతో సంబంధం లేకుండా, వాడు రాసే రాతలో ఏం పణంగా పెడుతున్నాడూ, ఏ చీకటి మూలల్ని పందెం ఒడ్డుతున్నాడూ అన్నది కూడా లెక్కలోకి వస్తుందంటే- రచయిత ఇక్కడ చాలా పెద్ద పందెం ఒడ్డి ఈ నవల రాశాడు. ధైర్యాన్ని కూడా సాహిత్యానికి ఒక గుణం అని చెప్పగలిగితే ఇది తెలుగులో అత్యంత ధైర్యం గల పుస్తకమని చెప్పొచ్చు. తెలుగు సాహిత్యం మొహమాటం మొహమాటంగా దాటుకుపోయిన ఇతివృత్తాన్ని, ఏదో తెగించి అందర్నీ అఫెండ్ చేయటానికి రాస్తున్నా అన్నట్టు కాకుండా, అలాంటి జీవితాల్ని అత్యంత కరుణతో చదివినవారికి అర్థం చేయించేలాగ ఈ కథ చెప్పారు సొలోమోన్ విజయ్ కుమార్.

ఈ రెండు పుస్తకాలూ తెలుగు సాహిత్యం ఎల్లల్ని మరింత విశాలం చేసే పుస్తకాలు. మిడిల్ క్లాస్ మెంటాల్టీ పక్కనపెట్టి చూస్తే, తెలుగు సాహిత్యానికి ఇప్పుడు నడుస్తున్నవీ, ఇక ముందు రానున్నవీ ఎంతో మంచి రోజులే అనిపించేట్టు చేసే పుస్తకాలు.

ఎమ్. ఈశ్వర్ ప్రసాద్

పింగళి జగన్నాథరావు పురస్కారం

సాహితీ కిరణం 15వ వార్షికోత్సవం సందర్భంగా పింగళి జగన్నాథ రావు స్మారక సాహిత్య పురస్కారాన్ని మరుమాముల దత్తాత్రేయ శర్మ, సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని రమణ వెలమకన్ని, సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్య పురస్కారాన్ని శైలజామిత్ర, గట్టుపల్లి చెంచురామారావు స్మారక ఆధ్యాత్మిక సాహిత్య పురస్కారాన్ని బండారుపల్లి రామచంద్రరావు స్వీకరిస్తారు. ఈ సభ జూలై 19న హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ గుండవరపు హనుమంతరావు కళావేదిక నందు జరుగుతుంది. ముఖ్య అతిథి కె.వి. రమణ, సభాధ్యక్షులు గుదిబండి వెంకటరెడ్డి.

పొత్తూరి సుబ్బారావు

సింగిల్ పేజీ కథల పోటీ

వంశీ ఇంటర్నేషనల్ - సాహితీ కిరణం మాసపత్రిక సంయుక్తంగా నిర్వహిస్తున్న సింగిల్ పేజీ కథలకు సామాజిక స్పృహ గల కథలను పంపాలి. ఉత్తమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. డిటిపిలో ఒక పేజీకి (ఫాంట్ 16, ఎ4సైజు) మించని, సామాజిక స్పృహ కలిగిన కథలను, జూలై 31లోగా చిరునామా: సాహితీ కిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ - 500102, ఫోన్: 9490751681కు పంపాలి.

సాహితీ కిరణం



దేశం లోపల యుద్ధం

ఇప్పటికిప్పుడు
యుద్ధమేదీ లేనట్టే వుంటుంది
నీ వద్దా నా వద్దా
యుద్ధబీభత్స వాతావరణం
వ్యాపిస్తున్నట్టే కనిపించదు
ఒట్టిగానే నిరాలంకార ముఖాలతో
ఎవరి పుట్టల్లో వాళ్లు
తలలు దాచుకొని బతకడమే
వైచిత్రి-

* * *

ఇప్పటికిప్పుడు ఇక్కడ
మాటల్లో చేతల్లో
నిజాన్నే ప్రకటించే పిల్లలున్నారు
అబద్ధపు ప్రచారాలూ
ఢాంబిక ప్రదర్శనలూ
పిల్లల ముందు వృథా

దేశంలోపల
యుద్ధముందో లేదో
చెప్పే సాక్ష్యం
పిల్లలు-

* * *

దేశంలోపల
రగులుతున్న అరణ్యంలో
యుద్ధముంది

మూకుమ్మడిగా
పులులు వేటాడితే
చెదిరిన జింకల్లా ఆదివాసీలు
రగులుతున్న అరణ్యంలో
జింకలు విల్లమ్ములను ధరించి
ఎర్రటి నిప్పులను
వెదజల్లడమే చరిత్ర
ఎర్రటినిప్పుల పూలవనంలో
కర్కసబూటు ముద్రలు వేయాలనుకునే
నీ కల ఒట్టి కల మాత్రమే
ఒట్టి కల మాత్రమే-

* * *

దేశంలోపల యుద్ధముంది
సముద్రకల్లోలముంది
యుద్ధకల్లోల సందర్భంలో
లేతచూపులను వేకువలుగా పూయించే
పిల్లలున్నారు

ఏమీ తెలియనట్టే వుంటారు
అన్నీ తెలియజేస్తారు పిల్లలు
ఏదీ మాట్లాడనట్టే వుంటారు
అన్నీ మాట్లాడుతారు పిల్లలు

వీరులతో పాటూ పిల్లలూ
దేశంలోపల యుద్ధాన్ని
చిరునవ్వుతో ఓడించే ధీరులే-

మంగ్తు

పేదల వైద్యంపై పట్టింపేది?!

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో అందని వైద్యం


ఎంజీఎంలో వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు


ఎంజీఎంలోని ఈసీజీ సెంటర్ వద్ద ప్రజల రద్దీ

- పలు విభాగాల్లో వేధిస్తున్న వైద్యుల కొరత
- మందులు కూడా లేక బయట కొనాల్సిన దుస్థితి
- కిట్లు, కెమికల్స్ కొరతతో వివిధ రకాల టెస్టులకు బ్రేక్
- ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్న వైనం
- ఎంజీఎం అభివృద్ధిపై 8 ఏళ్లుగా జరగని సమీక్ష
- అధికారుల ఇష్టారాజ్యంతో గాడితప్పుతున్న పాలన
- దారి తప్పుతున్న ఆస్పత్రి అభివృద్ధి నిధులు
- జిల్లా పాలకులు, సీఎం దృష్టిపెడితేనే మెరుగైన వైద్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పేదల పెద్దాస్పత్రి వరంగల్ ఎంజీఎంను సమస్య ల జబ్బు పట్టి పీడిస్తోంది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వచ్చే రోగులకు అస్పత్రిలో అన్ని అగచాట్లే ఎదురవుతున్నాయి. ఎంజీఎంలో ఉచిత మందులు, వైద్య పరీక్షలు ఉత్తమాటే అవుతున్నాయి. టెస్టులకు కిట్లుండవు.. చేసేందుకు వైద్యులుండరు.. అనే పరిస్థితి నెలకొంది. సూది మందు నుంచి సెలైన్ వరకు అన్ని బయట కొనాల్సిన దుస్థితి ఉంది. ఇక ఎంజీఎంలో అన్ని విభాగాల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. కార్డియాలజీ, న్యూరో, డెంటల్, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవటంతో రోగులకు దేవుడే దిక్కవుతున్నారు. వందల కోట్ల నిధులు వస్తున్నప్పటికీ సౌకర్యాలు మాత్రం మృగ్యమయ్యాయి. పట్టించుకునే వారు లేక వైద్యాధికారుల ఇష్టారాజ్యంగా మారుతోంది.

ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగు

ఎంజీఎం అస్పత్రితో పాటు అనుబంధంగా ఏర్పాటు చేసిన కేఎంసీ సూ పర్‌స్పెషాలిటీ అస్పత్రిలోని 21 విభాగాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రతీరోజు సుమారుగా 4వేల మందికి పైగా ఓపీ, ఐపీ రోగులు వస్తున్నారు. అయితే థైరాయిడ్, షుగర్, హెచ్‌ఐవీ, క్యాన్సర్ తదితర వాటి కోసం బయో కెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ టెస్టులు చేసేందుకు ల్యాబరేటరీల్లో కెమికల్స్ అందుబాటులో లేవు. దీంతో వైద్యం కోసం ఎంజీఎం కు వచ్చే రోగులను పరీక్షల నిమిత్తం ప్రవేటు ల్యాబ్ లకు పంపిస్తున్నారు. ఇదే అదనుగా పరీక్షల పేరుతో రోగుల నుంచి ప్రవేటు ల్యాబ్‌ల్లో అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుండె జబ్బులకు సంబంధించి నిర్వహించేందుకు కనీసం ఐదారు టూడీ ఎకో పరికాలు అవసరం ఉండగా, ఎంజీఎంలో కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. ప్రతీరోజు 50 నుంచి 100మంది వరకు టూడీ ఎకో టెస్టుల కోసం ఎంజీఎంకు వస్తున్నారు. ఒక్కోసారి 150 మందికి పైగా బాధితులు టెస్టుల కోసం వస్తున్నారు. రెండే టూడీ ఎకో యంత్రాలు ఉండటంతో పాటు కేవలం ఇద్దరే కార్డియాలజీస్టులు ఉన్నారు. వీరిలో ఒకరు సెలవు పెడితే ఇక అంతే సంగతులు. టూడీ ఎకో టెస్టులకు ప్రైవేటు అస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎంజీఎంలో కోట్లాది రుపాయలు వెచ్చించి తెచ్చిన యంత్రాలన్నీ చిన్నపాటి మరమ్మతులు చేయించలేక మూలన పడేస్తున్నారు. ఇందులో గ్యాస్ట్రో డిపార్ట్‌మెంట్‌లో కొలనోస్కోపీ, ఎండో స్కోపీ యంత్రాలు పాడై పనికి రాకుండా పోయాయి. దీంతో జీర్ణ సంబంధిత, మూత్ర సంబంధిత వ్యాధులతో వచ్చే బాధితులకు ఎంజీఎంలో పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో బాధితులను ప్రవేటు ల్యాబ్‌లకు టెస్టుల కోసం రెఫర్ చేస్తుండటంతో ఆర్థిక భారంతో సతమతవుతున్నారు.

మాత్రలు కరువే..

పేదల పెద్దాస్పత్రిలో మాత్రలు కూడా కరువవుతున్నాయి. ఎంజీఎంలో వైద్యం ఉచితమే కానీ.. వైద్య పరీక్షలు, మాత్రలు మాత్రం బయట కొనుక్కోవాలిన పరిస్థితి ఉంది. ఎంజీఎంలో సుమారు 200రకాలకు పైగా మందులు అందుబాటులో ఉండాల్సి ఉంది. అయితే కొన్ని సాధారణ రకాల మందులు మాత్రమే ఎంజీఎం ఔషధ షాపుల్లో ఇస్తున్నారు. మిగతా మందుల కోసం బయట ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. దీంతో వేలాది రూపాయలు మందులకే ఖర్చు అవుతున్నాయని రోగులు వాపోతున్నారు. ఎంజీఎం బడ్జెట్‌లో 20శాతం మందులు కొనుగోలు కోసం ఖర్చు చేసే అవకాశం ఉన్నప్పటికీ వైద్యాధికారుల నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జాడలేని హెచ్‌డీఎస్ కమిటీ

వరంగల్ ఎంజీఎంపై హాస్పిటల్ డెవల్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పుడో 8 ఏళ్ల కిందట హెచ్‌డీఎస్ కమిటీ ఎంజీఎం ఆస్పత్రిపై సమీక్ష నిర్వహించింది. ప్రస్తుతం కమిటీ ఉందా లేదా అన్నట్లుగా ఉండటంతో ఎంజీఎంలో పెద్ద సారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం అస్పత్రికి వివిధ టెండర్ల ద్వారా రావాల్సిన అద్దె బకాయిలు కూడా వసూలు చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

న్యూరో ఖాళీ.. కార్డియాలజీకి అరకొరే..

ఎంజీఎంతో పాటు అనుబంధంగా ఉన్న కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిలో సుమారు 21 విభాగాలు ఉన్నాయి. వీటిలో పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో లేకపోవటం రోగులకు నరకం కనిపిస్తోంది. పేదలకు దేవాలయంగా భావించే ఎంజీఎంలో వైద్యులు లేక సరైన చికిత్స అందకపోవటంతో దేవుడిపై భారం వేస్తున్నారు. ప్రధానంగా ఎంజీఎంలో న్యూరో డిపార్ట్‌మెంట్ ఖాళీ అయింది. ఈ విభాగంలో కనీసం ఇద్దరు న్యూరో ఫిజీషియన్లు, ఇద్దరు న్యూరో సర్జన్లు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే నాలుగైదు రోజుల వరకు ఒక్కరే డ్యూటీ చేశారు. అయితే ఇటీవల ఆ వైద్యుడికి కూడా పదోన్నతిపై బదిలీ చేయటంలో ప్రస్తుతం ఎంజీఎంలో న్యూరో విభాగంలో డాక్టర్లు లేకపోవ టంతో రోగులు విలవిలలాడుతున్నారు. అలాగే కార్డియాలజీలో కూడా ఇదే పరిస్థితి. గుండె సంబంధిత వ్యాదులను పరీక్షించేందుకు ఇద్దరు వైద్యులున్నారు. ఇందులో ఒకరు మాత్రమే డ్యూటీకి వస్తుండగా, మరొకరు మాత్రం ప్రైవేటు అస్పత్రికి పరిమితం అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో గుండెను చేతిలో పట్టుకుని ఎంజీఎంలో రోగులు బిక్కుబిక్కుమనే దుస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే డెంటల్ విభాగంలో నలుగురు వైద్యులు ఉండాల్సి ఉంది. అయితే డెంటల్


ఆక్సిజన్ సిలిండర్‌తో చిన్నారిని టెస్ట్ కోసం ఎత్తుకొని తీసుకెళ్తున్న దృశ్యం

మిగతా 7వ పేజీలో..

త్వరితమాతగా భద్రకాళి

తొమ్మిదో రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు


త్వరితమాత అలంకారంలో భద్రకాళి అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 14: నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శాకంబరీ ఉత్సవాలు ఆదివారానికి తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. త్వరితమాత అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అష్టమి తిథి సందర్భంగా అష్టమికి ఆదిదేవుడు శంకరుడని దశ మహావిద్యలోని కాళీ క్రమాన్ని అనుసరించి ఆదిదేవత ఉగ్రప్రభ అని అమ్మవారు ఉత్సవ మూర్తికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉగ్ర ప్రభ అలంకారం నిర్వహించారు. శోడశీ క్రమాన్ని అనుసరించి భద్రకాళి అమ్మవారికి త్వరితమాత అలంకరణను నిర్వహించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

మడికొండ, జూలై 14: రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సూచించారు. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న రుణం తీర్చుకోవడానికి రైతు బిడ్డగా మంచి అవకాశం లభించడంపై ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. తాను డీసీసీబీ చైర్మన్‌గా పని చేసినపుడు వరంగల్ జిల్లా రైతాంగం మేలు కోసం ఎంతగా కృషి చేశానో అందరికీ తెలుసన్నారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదని, అలాంటి వాటిని చూపించి ఎవరైనా భ్రమపడితే ప్రజలకు, రైతన్నలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. దేశానికి వెన్నుముక అయిన రైతన్న పండించిన పంటకు కనీస మద్దతు ధర లభించినపుడే సరైన భరోసా అని తెలిపారు. రాష్ట్రంలో ప్యాడీ ఎక్కువగా వస్తోందని, దాని నుంచి ఇతర పంటలకు మారాల్సిన అవసరం ఉందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారని రాఘవరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భూములు, వాతావరణం ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం కాబట్టి ఆయిల్‌పామ్ సాగు చేయడంవల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో 12 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్‌లను సాగు చేయడం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుందని స్పష్టం చేశారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ ఓపీ కింద బడ్జెట్‌లో కేంద్రం వాటాను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్‌కు టన్నుకు కనీస గ్యారెంటీ ధర రూ.18000 అందించాలని, ఆయిల్ పామ్‌కు బిందు సేద్యంపై సూచిక ధరను పెంచాలని, జీఎస్టీతో అదనంగా రైతుపై ఎకరానికి రూ.3500 భారం పడుతున్నందున ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకాల కింద ఇచ్చే పరికరాలకు జీఎస్టీ నుంచి తప్పించాలని కేంద్రానికి లేఖ రాస్తామని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పని చేస్తున్న కంపెనీల పని తీరును క్షేత్రస్థాయిలో సందర్శించి లోటుపాట్లను సరిదిద్ది ఆయిల్‌పామ్ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని తెలిపారు. అందులో భాగంగా మొదట జనగామ జిల్లా నర్మెట ప్రాంతంలో ఉన్న ఆయిల్‌పామ్ సాగు, ఫ్యాక్టరీల పని తీరుపై ఆయా శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తామని జంగా రాఘవరెడ్డి తెలిపారు.

నేడు రైతు భరోసాపై సదస్సు

- కలెక్టరేట్‌లో కార్యక్రమం
- హాజరు కానున్న ఐదురుగు మంత్రులు
- 250 మంది రైతులకు ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, జూలై 14: రైతు భరోసా పథక విధివిధానాలపై సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో రైతు భరోసా పథకంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు. రైతు భరోసా పథకంపై వివిధవర్గాల నుంచి వస్తున్న అభిప్రాయాలను సేకరించి రైతు బంధు ఎవరికి ఇవ్వాలనే ఆలోచనతో ముగ్గురు మంత్రులతో మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారు. ఈ మంత్రి వర్గ ఉప సంఘం చైర్మన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సభ్యులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో రైతుభరోసా విధి విధానాలపై రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతరవర్గాల నుంచి మంత్రి వర్గ ఉప సంఘం అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి సమర్పిస్తుంది. కాగా, రైతు భరోసా సదస్సుకు ఉమ్మడి వరంగల్ నుంచి 250మంది రైతులను ఆహ్వానించారు. ఈ రైతులతో రైతు బంధు పథకం ఎన్ని ఎకరాలకు ఇవ్వాలనే దానిపై చర్చించనున్నారు.



బొగతకు జల (జన) కళ

వాజేడు, జూలై 14: ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి ఆటవీ ప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగరా బొగత జలపాతం కళకళలాడుతోంది. ఆదివారం వారాంత సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ఎత్తైన కొండలపై నుంచి జాలువారుతున్న జలపాతాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. దాని అందాలను తమ కెమెరాల్లో బంధించారు. సెల్ఫీలతో సందడి చేశారు. జలపాతం వద్ద ఉన్న కొలనులో ఉత్సాహంగా జలకాలాడారు.

షాపింగ్ మార్ట్ పేరిట మోసం

- స్థానికుల నుంచి భారీగా డబ్బులు వసూలు
- ముఠా గుట్టు రట్టు చేసిన పాలకుర్తి పోలీసులు

పాలకుర్తి, జూలై 14: గొర్రె కసాయిని నమ్మినట్టు కొందరు వ్యాపారులు ఆన్‌లైన్‌లో పరిచయమైన కేటుగాళ్లను నమ్మారు. అత్యాశకు పోయి లక్షల రూపాయలు ముట్టజెప్పి మోసపోయారు. అసలు విషయం బటయపడ్డాక లబోదిబోమంటూ వాళ్ల కోసం దేశమంతా తిరిగారు. ఎక్కడా అడ్రస్ దొరకకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో చివరికి పోలీసులను ఆశ్రయించారు. వారు రంగంలోకి దిగి కీలక నిందితుడిని ఢిల్లీ నుంచి పట్టుకొచ్చి కోర్టుకు రిమాండ్ చేశారు. కేసు వివరాలను ఆదివారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన పరశురాం రజనీత్‌భాయ్ పాల్‌తో పాటు మరో ఐదుగురు కలిసి 2022లో ఉత్తర భారతదేశంలో కొన్నిచోట్ల 'ఆర్మడ బజార్' పేరుతో షాపింగ్ మార్ట్‌లను స్థాపించారు. ఆయా ప్రాంతాల్లో ఇన్వెస్టర్ల దగ్గర డబ్బులు వసూలు చేసి ఫ్రాంఛైసీలు ఏర్పాటు చేశారు. కొంత కాలం తర్వాత అవి దివాళా తీయడంతో నిర్వాహకులను భారీ నష్టం వాటిల్లింది. దీంతో ఎలాగైనా డబ్బులు రికవరీ చేసుకోవాలనే దురుద్దేశంతో పరశురాంరజనీత్ భాయ్ పాల్ ఢిల్లీకి చెందిన భీమ్‌సింగ్‌ను ప్రమోటర్‌గా రంగంలోకి దింపాడు.

ఫ్రాంఛైసీలు ఏర్పాటు చేస్తామంటూ ఇద్దరు కలిసి కొన్ని ప్రాంతాల్లో ఇన్వెస్టర్ల దగ్గర భారీగా డబ్బులు వసూలు చేశారు. సోషల్ మీడియాను అడ్డాగా ఎంచుకొని పలువురితో చాటింగ్ చేసి ముగ్గులోకి లాగారు. ఈ క్రమంలో పాలకుర్తికి చెందిన ముగ్గురు వ్యక్తులు వారి వలలో పడ్డారు. వారి దగ్గర తలా పది లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షలు వసూలు చేశారు. చివరికి ఫ్రాంఛైసీలు ఏర్పాటు చేయకుండానే మాయమయ్యారు. దీంతో బాధితులు ఖంగుతిన్నారు. ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో నిందితుల కోసం కాల్లరిగేలా తిరిగారు. ఇక లాభం లేదనుకొని చివరికి పాలకుర్తి పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన సీఐ మహేందర్‌రెడ్డి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఢిల్లీకి పంపారు. పథకం ప్రకారం వారు భీమ్‌సింగ్‌ను పట్టుకొని తీసుకొచ్చి జిల్లా కోర్టుకు రిమాండ్ చేశారు. ఇందులో కీలకపాత్ర పోషించిన సీఐ మహేందర్‌రెడ్డితో పాటు ఎస్సై యాకూబ్‌హుస్సేన్, కానిస్టేబుళ్లు నరేష్, సోమేశ్వర్, శ్రావన్, భాస్కర్, రాజ్‌కుమార్, గోపిని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య అభినందించారు.

గంజాయి నియంత్రణపై సీపీ నజర్





- నియంత్రణకు డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఏర్పాటు
- గంజాయి సమాచారం కోసం 87125 84473

వరంగల్ క్రైం, జూలై 14: గంజాయి నియంత్రణపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక దృష్టి సారించారు. వరంగల్‌ను గంజాయి రహిత కమిషనరేట్‌గా మార్చేందుకు నడుంబిగించారు. ఇందులో భాగంగా ఆదివారం డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఏర్పాటు చేశారు. కమిషనరేట్ కేంద్రంగా విధులు నిర్వహించనున్న డ్రగ్స్ కంట్రోల్ టీమ్‌లో ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 4 కానిస్టేబుళ్లతో పాటు మరింత మంది సిబ్బంది ఉంటారు. వీరు ట్రైసిటీస్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టనున్నారు. ఈ ప్రత్యేక టీమ్‌తో పాటు సమాచారం కోసం ప్రత్యేక నంబర్ ఏర్పాటు చేశారు. గంజాయి సమాచారం తెలిపిన వారికి బహుమతులు ఇస్తామని ప్రకటించారు.

టీమ్ విధులు

ఈ ప్రత్యేక విభాగం ట్రైసిటీస్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో, కాలేజీలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లు, షాపింగ్ మాల్స్‌పై దృష్టి సారించడంతో పాటు రాత్రివేళల్లో గంజాయి వినియోగించేందుకు అనువైన ప్రదేశాలను గుర్తిస్తుంది. దీనికోసం ప్రత్యేక విభాగం స్థానిక పోలీసులతో కలిసి గంజాయి సేవించే ప్రాంతాలపై దాడులు చేస్తుంది. క్రయవిక్రయదారులపై ప్రత్యేక నిఘా పెడతారు. గంజాయి అరికట్టడం ద్వారా గంజాయి మత్తులో జరిగే నేరాలను అదుపు చేస్తుంది. కాగా, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గంజాయి నియంత్రణలో తల్లిదండ్రులు సైతం భాగస్వాములు కావాలని ఆయన పిలుపిచ్చారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయిస్తున్న, మత్తు పదార్థాలు సేవిస్తున్నట్లు సమాచారం ఉంటే 8712584473 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని ఆయన సూచించారు. అధిక మొత్తంలో గంజాయి సమాచారం అందించిన వారికి నగదు పురస్కారం అందచేయడంతోపాటు వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి రహిత పోలీస్ కమిషనరేట్ అందరి ప్రధాన లక్ష్యమని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

విచ్చలవిడిగా విక్రయాలు

నగరంలోని పలు విద్యాకేంద్రాలతో పాటు పలు సెంటర్లలో గంజాయి దందా విచ్చలవిడిగా నడుస్తోంది. పొరుగు రాష్ట్రాలైన ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి మీదుగా నగరానికి గంజాయి చేరుకుంటోంది. కిందటేడు వరంగల్ నగరంలో 417 కిలోల గంజాయి (రూ.1కోటి 4 లక్షల 42వేలు) పట్టుకున్నారు. ఈ యేడు ఆరు మాసాల్లో 520 కిలోల గంజాయి (రూ.1కోటి 30లక్షలు) పట్టుకుని నాలుగు రోజుల కిందట పోలీసులు నగర పరిసర ప్రాంతలో దహనం చేశారు. ప్రతీ రోజు ఏదో ఒక ప్రాంతంలో గంజాయి పట్టుకుంటూనే ఉన్నారు. పట్టుబడిన గంజాయిని గమనిస్తే నగరంలో ఏ మేరకు విక్రయాలు జరుగుతున్నాయి.. యువత ఏ మేరకు గంజాయి బారిన పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో గంజాయి నియంత్రణను సీపీ అంబర్ కిషోర్ ఝా సవాల్‌గా తీసుకున్నారు.

పుష్కరకాలం తర్వాత మోక్షం

- పంచాయతీరాజ్‌శాఖలో ఎట్టలకేలకు బదిలీలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5 వేల మంది ఉద్యోగులు

7

నేటి బల్దియా ప్రజావాణి రద్దు

వరంగల్ కార్పొరేషన్, జూలై 14: నగర ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్టు వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పరిపాలనాపరమైన కారణాల వల్ల రద్దుచేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి రావొద్దని కమిషనర్ తెలిపారు.

చెప్పుల షాపులో మంటలు

▸ హనుమకొండ చౌరస్తాలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

వరంగల్ క్రైం, జూలై 14 : హనుమకొండ చౌరస్తాలోని ఖాదిమ్ చెప్పుల షాపు పైఅంతస్తులో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం కావడంతో షాపు మూసిఉండగా, రాత్రి వేళలో ఒక్కసారిగా షాపులో నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ట్రాఫిక్ పోలీసులు, ఫైర్ డిపార్ట్‌మెంట్ వారు మంటలు ఆర్పారు. అయితే నష్టం ఎంత అనేది తెలియరాలేదు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



దగ్ధమవుతున్న చెప్పుల షాపు

దొంగతనానికి వచ్చి అనుమానాస్పద స్థితిలో మృతి

▸ మహబూబాబాద్ జిల్లాలో ఘటన

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జూలై 14 : మహబూబాబాద్ జిల్లా కేసము ద్రం విలేజి పూలే సెంటర్ బ్రాందీషాపు సమీపంలో ఆదివారం దొంగతనానికి వచ్చిన ఓ వ్యక్తి అదే ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం... బ్రాందీ షాపు సమీపంలో వల్లందాసు నగేష్ చిన్నకిరాణం షాపుడబ్బాను నడుపుకుంటూ, దానికి వెనుక వైపునే రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ ఇంట్లోకి మంగళవారం సాయంత్రం ఇదే గ్రామం పెట్రోల్ పంపు సమీపంలో నివాసం ఉంటున్న జిలుకర నాగరాజు(35) దొంగతనానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఏం జరిగిందో ఏమో కాని నాగరాజు విగతజీవిగా ఇంట్లో పడి ఉన్నాడు. ఈ విషయం బయటకు పొక్కగానే పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. అయితే నగేష్ ఇంటికి నాగరాజు దొంగతనానికి రావడంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ప్రాథమికంగా పోలీసులు చెబుతున్నారు. పూర్తివివరాలు విచారణ అనంతరం తెలుస్తాయని వారు వెల్లడించారు. ఘటన స్థలాన్ని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ వంశీధర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌కు తరలించారు. స్థానికుడైన జిలుకర రాఘవులు, మంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులుకాగా, నాగరాజు పెద్ద కుమారుడు. మృతుడికి వివాహం కాగా, రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. గతంలో కారుడ్రైవర్‌గా పనిచేయడి, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ విషయంపై రూరల్ సీఐ సర్వయ్య మాట్లాడుతూ నాగరాజు మృతి చెందిన ఇంటియజమాని వల్లందాసు నగేష్‌ను అదుపులోకితీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. తదుపరి విచారణలో పూర్తివివరాలు వెల్లడిస్తామని చెప్పారు.



నాగరాజు మృతదేహం

సీపీని కలిసిన ఎస్ఐలు



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐలు

వరంగల్ క్రైం, జూలై 14: ఇటీవల ఎస్ఐలుగా పదోన్నతి పొంది స్పెషల్ బ్రాంచ్‌కు కేటాయించబడిన ఎస్ఐలు ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీని కలిసిన వారిలో నజీర్, సారంపాణి, రమేశ్ ఉన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠ పెంచే విధంగా సేవలందించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా ఎస్ఐలకు సూచించారు.

నేడు నగరంలో జగన్నాథ రథయాత్ర

▸▸ వరంగల్, హనుమకొండలో హరికీర్తనలతో శోభాయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు

వరంగల్ కల్చరల్, జూలై 14 : వరంగల్ ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం హనుమకొండ, వరంగల్ జంట నగరాల్లో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ టెంపుల్ కోఆర్డినేటర్ ధమేశ్వర ధర్మేంద్రదాస్, భూపావన హరినామదాస్ తెలిపారు. ఆదివారం ఇస్కాన్ టెంపుల్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏటా నగరంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహిస్తున్నామని, సోమవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి రథయాత్ర ప్రారంభమై చౌరస్తా, అలంకార్, ములుగురోడ్, ఎంజీఎం, పోచమ్మమైదాన్ మీదుగా తిరిగి ఎంజీఎం, వెంకటేశ్వర గార్డెన్ వరకు యాత్ర సాగుతుందన్నారు. రథయాత్రలో భక్తులకు ప్రసాదాలు, తాగునీరు అందజేస్తామని, హరినామ సంకీర్తనతో రోడ్లపై రంగోళీలు వేస్తూ జగన్నాథ రథయాత్ర శోభాయమానంగా కొనసాగుతుందని వరంగల్ ట్రైసిటీ ప్రజలు ఇందులో పాల్గొనాలని వారు కోరారు.

తల్లీ, కూతురు పట్ల అసభ్య ప్రవర్తన

▸▸ నిందితుడిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

వరంగల్ క్రైం, జూలై 14: తల్లీ, కూతురు పట్ల అసభ్యంగా ప్రవర్తించి కులం పేరుతో దుర్భాషలాడిన బి.శ్రీధర్ అనే వ్యక్తిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవిందర్ తెలిపిన ప్రకారం.. స్టేషన్ పరిధిలోని యాదవనగర్‌లో శ్రీధర్ కుటుంబంతోపాటు బాధితులు నివాసం ఉంటున్నారు. వీరితో ఉన్న పరిచయాన్ని అవకాశంగా తీసుకున్న శ్రీధర్ ఆదివారం రాత్రి బాధితుల ఇంటికి వెళ్లి తలుపుకొట్టాడు. తలుపు తీసిన తల్లితో పాటు ఆమె కూతురు పట్ల శ్రీధర్ అసభ్యంగా ప్రవర్తించాడు. శ్రీధర్‌ను వాళ్లు మందలించే ప్రయత్నం చేయగా, అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు కులం పేరుతో దూషించాడు. బాధిత మహిళ కేయూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శ్రీధర్‌పై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రవిందర్ తెలిపారు.

నా భర్తను బతికించండి

▸▸ వరంగల్‌కు చెందిన ఓ వికలాంగురాలి వేడుకోలు

▸▸ బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమైన భర్త

▸▸ భారంగా మారిన ఇద్దరు పిల్లల ఆలనాపాలనా



భర్త ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్న వికలాంగురాలు శ్రీలత, బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న రామకృష్ణ

వరంగల్ సిటీ, జూలై 14 : బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న భర్త ఓ వైపు.. ఇద్దరు చిన్నారుల ఆలనాపాలనా మరో వైపు.. కూలి పనులు చేసుకునే ఆకుటుంబంలో అనుకోని ఘటనలు తీవ్ర భారాన్ని మోపాయి. వికలాంగురాలు అయిన ఆ ఇల్లాలిని దిక్కుతోచని స్థితిలోకి నెట్టాయి. ఆపరేషన్ చేస్తే కానీ భర్త బతకడంటూ చనిపోతాడని వైద్యులు స్పష్టం చేయడంతో ఇప్పుడామె ఆపన్న హస్తాల కోసం ఎదురు చూస్తోంది. తన భర్త ప్రాణాలను కాపాడాలని దాతలను వేడుకుంటోంది. హనుమకొండ జిల్లా ఉరుగొండ గ్రామానికి చెందిన శ్రీలత వికలాంగురాలు.. వరంగల్ నగరం ఏనుమాముల ఎన్టీఆర్ నగర్‌కు చెందిన గుండా రామకృష్ణను ప్రేమించింది. వారిద్దరూ 2017లో ప్రేమ వివాహం చేసుకోగా వారికి ఒక కూతురు, ఒక కుమారుడు జన్మించారు. ఓ హోటల్ పనిచేస్తూ గుండ రామకృష్ణ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒక రోజు తల నొప్పి వస్తుందని చెప్పడంతో రామకృష్ణను ఓ ప్రయివేట్ హాస్పటల్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ స్ట్రోక్ అని చెప్పడంతో రామకృష్ణ తండ్రి యాదగిరి, ఆయన సోదరుడు కృష్ణ కలిసి తెలిసిన వాళ్ల వద్ద అప్పుగా తీసుకువచ్చి రూ.8లక్షల వరకు ఖర్చు చేసి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. కానీ వారు తెచ్చిన అప్పులు తీర్చే పరిస్థితి లేక, కుమారుడు రామకృష్ణ అనారోగ్యం బారిన పడటం, కోడలు శ్రీలత వికలాంగురాలు కావడంతో మనోవేదనకు గురైన రామకృష్ణ తండ్రి యాదగిరి నెలన్నర క్రితం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

అయితే ప్రస్తుతం రామకృష్ణ ఆరోగ్యం అంత గా బాగోకపోవడంతో వైద్యులు మరో వారం రోజుల్లో మళ్లీ రామకృష్ణకు ఆపరేషన్ చేయాలని లేదంటే ప్రాణానికే ప్రమాదమని చెప్పారు. కానీ ఇప్పటికే అప్పులపాలైన తనకు మళ్లీ ఆపరేషన్ చేయించేందుకు చేతిలో డబ్బులు లేవని, తన ఇద్దరు పిల్లలకు తిండి కూడా పెట్టలేని పరిస్థితిలో ఉన్నానని, వికలాంగురాలైన తన బాధను అర్థం చేసుకుని దాతలు సాయం చేయాలని శ్రీలత కోరుతోంది. ఈ క్రమంలో 'ఆంధ్రజ్యోతి' వరంగల్ కార్యాలయానికి వచ్చిన ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. ఉండడానికి ఇళ్లు లేక కిరాయి ఇంట్లో ఉన్న తన కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఉన్నట్లు వాపోయింది. అయిన వాళ్లను కలిసినా ఎవరు దగ్గరకు రానివ్వడంలేదని, తన భర్త ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో ఇద్దరు పిల్లలను చూసుకునే పరిస్థితి లేకుండా పోయిందని దాతలు ముందుకు వచ్చి తన భర్త ప్రాణాలు కాపాడాలని వేడుకుంటోంది. సాయం చేయాలను కునేవారు గుండ రామకృష్ణ అకౌంట్ నెంబరు 063012010002862, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐ ఎన్ 0806307, ఫోన్‌పే నెంబరు 8897266948కు సాయం అందించాలని వేడుకుంటోంది.

పోషకాలే కాదు.. లాభాలూ అధికమే..

దశాబ్ద కాలంగా బొప్పాయి తినే అలవాటు గణనీయంగా పెరుగుతోంది. అందులో అత్యధిక పోషకాలు ఉండడం, అంతే కాకుండా డయాబెటిక్ బాధితులుకూడా తినవచ్చని డాక్టర్లు సూచిస్తుండటంతో మార్కెట్‌లో డిమాండ్ అధికమైంది. ప్రస్తుతం జనగామ జిల్లా పాలకుర్తి మండలం కోతులబాదు, మల్లంపల్లి, చెన్నూరు, విస్నూరు గ్రామాల్లో రైతులు బొప్పాయి పంటను సాగు చేస్తూ గణనీయంగా లాభాలు గడిస్తున్నారు. ప్రభుత్వం సైతం రైతులకు డ్రిప్ పరికరాలతో పాటు మల్చింగ్‌కు సబ్సిడీ అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో ఒక ఎకరా బొప్పాయి సాగు చేయాలంటే ఎంత పెట్టుబడి అవుతుంది.. ఎంత లాభం వస్తుంది.. ఎలా సాగు చేయాలి.. తదితర అంశాలపై ఈ కథనంలో తెలుసుకుందాం..

▸▸ బొప్పాయి సాగుతో అనేక ప్రయోజనాలు

▸▸ ఎకరాకు రూ.60వేల పెట్టుబడి.. రూ.2.50లక్షల రాబడి

▸▸ నికరంగా రూ.1.90లక్షల లాభం

▸▸ ఒక్కసారి నాటితే మూడేళ్లవరకు దిగుబడి

▸▸ మల్చింగ్, డ్రిప్ పరికరాలకు ప్రభుత్వ సబ్సిడీ

▸▸ ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్న రైతులు



పాలకుర్తి మండలం కోతులబాదులో సాగు చేస్తున్న బొప్పాయి పంట

పాలకుర్తి, జూలై 14 : సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా లభిస్తూ శరీరానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలను అందిస్తుంది బొప్పాయి. అందుకే ఈ పండును దేవదూతగా పిలుస్తారు. ఈ పండు తినేవాళ్లకే కాకుండా పండించిన వాళ్లకు కూడా అధిక లాభాలు వస్తున్నాయి. దీంతో జిల్లాలో రైతులు సాగుపై ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్నారు. బిందుసేద్యం, మల్చింగ్ విధానాలు అలంబిస్తూ ఈపంటను సాగు చేస్తున్నారు. బొప్పాయి ఉష్ణమండల పంట అయినప్పటికీ అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేదు, అదేవిధంగా చలిని కూడా తట్టుకోలేదు. వేసవిలో 38 డిగ్రీల సెల్సియస్ వరకు బాగా పెరుగుతుంది. అంతకంటే ఎక్కువగా ఉన్నట్లయితే మొక్క పెరుగదల తగ్గడం, పూత మరియు పిందె రాలడం జరుగుతుంది. నీరు నిలువని సారవంతమైన ఎర్ర చెక్క నేలలు, మధ్యరకం నల్ల నేలలు అనుకూలం. నీరు నిలిచే నేలలు అధిక చౌడు, అమ్ల భూములు సాగుకు పనికి రావు.



ఆంధ్రప్రదేశ్ నుంచి మొక్కలు తెచ్చి..

విశాఖపట్టణం, రాజమండ్రి సమీపంలోని రావులపాలెం ప్రాంతంలో మొక్కలు లభిస్తాయి. ప్రస్తుతం రెడ్‌లేబుల్ 786 రకం ఎక్కువగా రైతులు సాగుచేస్తున్నారు. ఇతర రకాలు పూసా మెజిస్టి, పూసా డెలిషియస్, సన్‌రోస్ సోలో కూర్గ్ హనీడ్యు లాంటి రకాలున్నాయి. ఎకరానికి 1000 మొక్కలు నాటాలి. ఒక్క మొక్కకు రూ.18 ఖర్చు అవుతుంది. విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన తర్వాత ట్రైకోడెర్మావిరిడి 10 గ్రాములు, 1 కిలో గ్రాముల సుడోమోనస్, 10 గ్రాముల జీవ శిలీంద్ర నాశినులను విత్తనాలకు పట్టించి 30 నిమిషాల వరకు నీడలో ఆరబెట్టాలి.

సాగు విధానం..

మొక్క నాటినప్పటి నుంచి నాలుగు నెలల కొకసారి మట్టిని ఎగదోస్తూ 10 కిలోల పశువుల పేడ, ఇతర సేంద్రీయ ఎరువులను వేస్తూ ఉండాలి. ఆ తర్వాత బెడ్ లాగా చేస్తే వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. ప్రతీ పదిహేను రోజులకు ఒకసారి పంచగవ్య 30 లీటర్లు, అదేస్థాయి నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేయాలి. వేస్ట్ డీకంపోజర్, ద్రవ, జీవామృతం ప్రతీ 15 రోజులకు ఒకసారి ఒకదాని తర్వాత ఒకటి మార్చి మొక్క మొదట్లో భూమి తడిసేలా పోయాలి. అయితే మొదటి రెండు నెలల్లో మొక్కకు ఐదు లీటర్ల చొప్పున మూడు నుంచి నాలుగు నెలల్లో పది లీటర్ల చొప్పున ఆ తర్వాత ఐతు నెలల నుంచి 20 లీటర్ల చొప్పున పోయాలి. ఈ విధంగా సేంద్రియ ఎరువులు మాత్రమే వాడాలి. స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించాలి. దీంతో మొక్క ఆరోగ్యవంతంగా పెరిగి వైరస్ తెగుళ్లను తట్టుకుంటుంది.

నీటి తడులు..

బొప్పాయి మొక్కల్లో నీటి యాజమాన్యం చాలా ముఖ్యం. కాలువల ద్వారా నీరు పారిస్తే వర్షపు నీరు మొక్కల మొదట్లో నిలిచి వేరు కుళ్లు తెగులు వచ్చి మొక్క చనిపోయే ప్రమాదం ఉంటుంది. అదేవిధంగా మొక్క మొదలుకు నీరు తగిలినట్లయితే కాండానికి కుళ్లు తెగులు సోకుతుంది. అందువల్ల పిల్ల పాదులు తయారు చేసి నీరు పారించాలి. డ్రిప్ పద్ధతిలో నీరు పెడితే అధిక దిగుబడి పొందవచ్చు. భూమిలో తేమను బట్టి ప్రతీ రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి నీరు అందించాలి.

పెట్టుబడి.. ఆదాయం..

ఎకరాకు 1500 మొక్కలు నాటాలి. నాటిన ఎనమిది నెలలకు మొదటి కాపు వస్తుంది. అప్పటి నుంచి మూడేళ్ల వరకు వరుసగా దిగుబడి వస్తుంది. రెండు నెలలకి ఒక కోత చొప్పున ఏడాదిలో ఆరు కోతలు వస్తాయి. ఒక్కో కోతకు ఎకరాకు 4 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ. 60 వేల వరకు పెట్టుబడి అవుతుంది. మొక్కలకు రూ. 18 వేలు, ఎరువులు, కూలీలు, కోతలకు రూ. 40 నుంచి రూ. 45 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుత మార్కెట్లో టన్ను బొప్పాయి ధర రూ.10 వేలు ఉంది. ఈ లెక్కన మొత్తం 25 టన్నుల దిగుబడి వచ్చినా రూ. 2.50 లక్షలు ఆదాయం వస్తుంది. ఇందులో రూ. 60 వేలు పెట్టుబడి పోను రూ. 1.90 లక్షల లాభం వస్తుంది. ఏ ఇతర పంటల్లోనూ ఇంత ఆశాజనకంగా ఆదాయం ఉండదు. అందువల్ల రైతులు బొప్పాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

బొప్పాయిలో లాభాలున్నాయి..

ఏనుగు వెంకట్‌రెడ్డి, కోతులబాదు



మొదటి సారి విశాఖపట్టణం నుంచి మొక్కలు తీసకువచ్చాను. ఈసారి హైదరాబాద్ నుంచి రూ.18వేలు ఖర్చు చేసి 1500 మొక్కలు తెచ్చాను. ఎకరం భూమిలో బొప్పాయి పంటను సాగుచేశాను. ఈ పంట సాగులో లాభాలు అధికంగా ఉన్నాయి. పాలకుర్తి చుట్టు గ్రామాల నుంచి అనేక మంది పంట చేను వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కష్టం కూడా అదే తరహాలోనే ఉంటుంది.

రైతులు ఆసక్తి చూపుతున్నారు..

డీఎస్ లత, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి, జనగామ



బొప్పాయి పంట సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగవచ్చు. ఈ పంట ఒక్క సారి సాగు చేస్తే రెండు నుంచి మూడు సంవత్సరాలు ఉంటుంది. ప్రభుత్వం డ్రిప్, మల్చింగ్‌కు సబ్సిడీ ఇస్తుంది. వైరస్ సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. ఆకులపై వైరస్ సోకితే వాటిని తొలగించాలి. మార్కెట్‌లో టన్నుకు రూ. 10 వేలు ధర పలుకుతోంది. ఎకరానికి 60 టన్నులు దిగుబడి వస్తుంది. జనగామ జిల్లాలో గత ఏడాది 40 ఎకరాలు సాగుచేయగా, ఈసారి మరో 5 ఎకరాలు పెరిగింది. రైతులు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపిస్తున్నారు.

జనరల్ బోగీలు పెంపు

▸▸ విశాఖ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అవకాశం

▸▸ బల్లార్ష వైపు వెళ్లే ప్రయాణికులకు నిరాశ

కాజీపేట, జూలై 14: పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనరల్ బోగీలు పెంచాలని ప్రయాణికుల డిమాండ్ పరిగణలోకి తీసుకున్న రైల్వే ఉన్నతాధికారులు.. ఎట్టకేలకు సానుకూలంగా స్పందించారు. కానీ కేవలం విశాఖ వైపు వెళ్లు రైళ్లకు మాత్రమే పెంచి బల్లార్ష వైపు వెళ్లే రైళ్లకు మాత్రం జనరల్ బోగీలు పెంచకపోవడంతో ప్రయాణికులకు నిరాశ మిగిల్చింది. జనరల్ బోగీలు పెంచిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్ - విశాఖపట్నం (12728) గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రెండు జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు నవంబర్ 11 నుంచి, విశాఖపట్నం - హైదరాబాద్‌కు వెళ్లు (12727) గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రెండు జనరల్ సెకండ్‌క్లాస్ బోగీలు నవంబర్ 10 నుంచి, సికింద్రాబాద్-భువనేశ్వర్(17016) విశాఖ ఎక్స్‌ప్రెస్ రెండు జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు నవంబర్ 14 నుంచి, భువనేశ్వర్ - సికింద్రాబాద్ (17015) విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు రెండు జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు నవంబర్ 16 నుంచి పెంచుతున్నట్లు రైల్వే అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇవే కాకుండా సింహపురి, చార్మినార్, కాకినాడ షిర్డీ, కాకినాడ ఎల్‌టీటీఈ, మచిలీపట్నం,.ధర్మవరం, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఒక బోగీని పెంచారు.

బల్లార్ష ప్రయాణికులకు నిరాశే..

సికింద్రాబాద్ డివిజన్‌లో బల్లార్ష వైపు వెళ్లే దాదాపు అన్ని రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంటాయి. ఈ వైపు వెళ్లే రైళ్లలో వారణాసి, దానాపూర్, యశ్వంతాపూర్ గోరఖ్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లలో కాలు పెట్టే వీలుండదు. కొంతమంది మరుగుదొడ్లలో, బోగీల మెట్లవద్ద కూర్చుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కాజీపేట జంక్షన్‌లో కేవలం రెండు నిమిషాల హాల్టింగ్ ఉండటంతో తాగునీరుకోసం, ఆహారపదార్థాల కోసం దిగిన ప్రయాణికులు మళ్లీ రైలెక్కే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అంతటి రద్దీ వున్న రైళ్లలో జనరల్ బోగీలు పెంచకపోవడంతో రైల్వేఅధికారులు తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. ఇప్పటికైనా బల్లార్ష వైపు వెళ్లే రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

కత్తిపోట్ల దాడిలో నిందితుడి అరెస్టు

వర్ధన్నపేట, జూలై 14 : కత్తిపోట్ల దాడిలో ఇద్దరిని గాయపర్చిన నిందితుడిని ఆదివారం వర్ధన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట పట్టణంలో గురువారం రాత్రి భారతీయుడు-2 సినిమా చూస్తున్న కళ్లెం విజయ్‌పై ఊర కృష్ణ అనే వ్యక్తి దాడి చేస్తున్న క్రమంలో విజయ్ బంధువు గడ్డం రాజ్‌కుమార్ అడ్డుకోవడంతో ఆయనకు కూడా గాయాలయ్యాయి. ఈ సంఘటనలో నిందితుడైన ఊర కృష్ణను ఆదివారం సాయంత్రం వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వర్సిటీ ప్రహరీ నిర్మాణానికి అధికారులతో కమిటీ

▸▸ ల్యాండ్స్ సర్వేలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులపై చర్చ

▸▸ పనులను పరిశీలించిన వర్సిటీ, రెవెన్యూ అధికారులు



ల్యాండ్ సర్వే, వర్సిటీ ప్రహరీ గోడ పనులను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారులు

కేయూ క్యాంపస్, జూలై 14: కాకతీయ యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు, వర్సిటీ ల్యాండ్ సర్వేలో స్థాయిలో ఇబ్బందులను పరిష్కరించి పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారులు, వర్సిటీ ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాటు చేసిన కమిటీ బాధ్యులు ఆదివారం వర్సిటీ ప్రహరీ నిర్మాణ పనులు, ల్యాండ్ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి క్యాంపస్‌లోని కుమార్‌పల్లి, గుండ్ల సింగారం, కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను గుర్తించి పనులు పూర్తిచేసి ప్రహరీని నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ల్యాండ్ సర్వే, ప్రహరీ గోడ కమిటీ నియామకం

వర్సిటీ ల్యాండ్ సర్వే, ప్రహరీ గోడ కమిటీలో కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, బిల్డింగ్ డివిజన్ పూర్వ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్, కేయూ లీగల్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్, డీవో ఎస్.వాసుదేవారెడ్డి, వర్సిటీ ఇంజనీర్ పి.రామయ్య, బిల్డింగ్ డివిజన్ సూపరింటెండెంట్‌ను కన్వీనర్‌గా ఎం.సునీల్‌కుమార్‌ను నియమించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తెలిపారు.

పేదల వైద్యంపై పట్టింపేది?!

(5వ పేజీ తరువాయి)

విభాగం హెడ్‌గా ఉన్న వైద్యుడు కాళోజీ హెల్త్ వర్సిటీలోకి డిప్యూటేషన్‌పై వెళ్లారు. మిగిలిన మూడు పోస్టులు ఖాళీగాఉండగా, ఇటీవలే ఒక వైద్యుడిని కాంట్రాక్టుపై విధుల్లోకి తీసుకున్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు కేసులు ఎక్కువగా వస్తే ఇబ్బంది పడాల్సి వస్తోందని రోగులు పేర్కొంటున్నారు. మొత్తంగా ఎంజీఎం, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ అస్పత్రుల్లో 43మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 24మంది అసోసియేట్ ప్రొఫెసర్లు అవసరం ఉంది. అలాగే ఇటీవలే జరిగిన బదిలీల్లో ఎంజీఎం నుంచి 34మంది బదిలీపై వెళితే ఎంజీఎంకు గురువారం వరకు కేవలం ఇద్దరిని మాత్రమే కేటాయించారు. దీంతో పెద్దాస్పత్రిలో వైద్యులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఫలితంగా రోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దేవుడిపై భారం వేయాల్సిన దుస్థితి నెలకొంది.

పాలకులు చూడరా?

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎంజీఎం అస్పత్రి అభివృద్ధి, సౌకర్యాలపై సమీక్ష కూడా నిర్వహించకపోవటంతో కొంతమంది వైద్యులు డ్యూటీలు చేయకుండానే ప్రవేటు ప్రాక్టీస్‌కు పరిమితం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి ఎంజీఎంను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యుల నియామకంతోపాటు అస్పత్రికి కావాల్సిన ఇన్ఫ్రాస్ట్రక్చర్, టెస్టులకు కావాల్సిన కిట్లు, కెమికల్స్, రోగులకు సరిపడా మందులను ఎంజీఎంకు అందించాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉరివేసుకుని బాలిక ఆత్మహత్య



అభినయ మృతదేహం

కాజీపేట, జూలై 14: ఇంట్లో ఎవరూలేని సమయంలో ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట దర్గాకు చెందిన అంబాల రాజశేఖర్‌కు కూతురు అంబాల అభినయ(12) స్థానికంగా వుండే ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. రాజశేఖర్ నిట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం విధుల నిమిత్తం డ్యూటీకి వెళ్లారు. అతడి భార్య రేణుక మార్కెట్‌కు వెళ్లి వచ్చేసరికి అభినయ ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలిక ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో ఎవరికీ అంతుబట్టడంలేదు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

బస్సుల కోసం ప్రయాణికుల ఇక్కట్లు



హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బాలసముద్రం, జూలై 14: హనుమకొండ ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్, మహబూబాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ఏటూరునాగారం రూట్లలో వెళ్లే ప్రయాణికులకు బస్సులు లేకపోవడంతో గంటల తరబడిబస్ స్టేషన్‌లో వేచి చూశారు. వచ్చిన బస్సులో ఎక్కువ మంది ప్రయాణించడంతో బస్సులు రద్దీగా వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్సులు ఎక్కేటప్పుడు మహిళలు గొడవపడిన సందర్భం నెలకొంది.

పుష్కరకాలం తర్వాత మోక్షం

▸▸ పంచాయతీరాజ్ శాఖలో ఎట్టకేలకు బదిలీలు

▸▸ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5వేల మంది ఉద్యోగులు



హనుమకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పంచాయతీరాజ్ ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పుష్కరకాలం తర్వాత బదిలీల భాగ్యం లభిస్తునందుకు వారు ఒకింత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2012లో పీఆర్ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఆ తర్వాత ఇప్పుడు పన్నెండేళ్లకు బదిలీలకు మోక్షం లభించడంతో చాలా మందికి స్థానచలనం కలుగనున్నది. ఈ బదిలీల ప్రక్రియ కొందరు ఉద్యోగుల్లో మోదాన్ని, మరికొందరి ఉద్యోగుల్లో ఖేదాన్ని కలిస్తోంది. ప్రధానంగా జిల్లా కేంద్రాల్లో తిష్టవేసిన ఉద్యోగులు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. ఏ దూర ప్రాంతానికి బదిలీ అవుతామోనని కలవరపడుతున్నారు.

2018లో బదిలీలకు బ్రేక్

వాస్తవానికి బదిలీ నిబంధనలు అందరి ఉద్యోగులతోపాటు పంచాయతీరాజ్ ఉద్యోగులకూ వర్తిస్తాయి. కానీ 2018లో ఇతర శాఖల్లోని ఉద్యోగుల బదిలీలు జరిగినా.. పంచాయతీరాజ్ శాఖకు వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయన్న కారణంతో బదిలీలను చేపట్టలేదు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తయ్యేసరికి బదిలీ పుణ్యకాలం కాస్తగడిచిపోయింది. దీంతో ఎక్కడివారు అక్కడే ఉండాల్సి వచ్చింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు గత ఫిబ్రవరిలో బదిలీ అయిన పీఆర్ అధికారులు మినహా జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల సిబ్బంది జిల్లాపంచాయతీ ఉద్యోగులు, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లోని బోధనేతర సిబ్బందిని పంచాయతీరాజ్ ఉద్యోగులు మిషన్ భగీరథ, పీఆర్ ఇంజనీరింగ్ విభాగాల్లోనూ కొందరు పీఆర్ ఉద్యోగుల బదిలీలు జరుగనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదువేల మందికిపైగా పీఆర్ ఉద్యోగులు ఉన్నారు.

కొత్త జడ్పీల ఏర్పాటుతో..

2016లో కొత్తగా జిల్లాలు ఏర్పడ్డాయి. ఆ మేరకు 2019లో జిల్లాకు ఒకటి చొప్పున కొత్త జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. ఈ లెక్కన వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు కొత్తగా జిల్లా పరిషత్తులు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయం ప్రస్తుతం ఉన్న భవనంలోనే కొనసాగుతుండగా, హనుమకొండ జిల్లా పరిషత్తును ఇదే కార్యాలయం ఆవరణలోనే ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటైన జిల్లా పరిషత్తులకు కొత్తగా ఉద్యోగులను నియమించకుండా ఆర్డర్ టు సర్వ్ కింద ఉన్న ఉద్యోగులతోనే ఆయా చోట్ల పోస్టింగ్ ఇచ్చి సర్దుబాటుచేశారు. దీంతో అప్పటి వరకు హనుమకొండ జిల్లా కేంద్రంలోని పూర్వ వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులంతా ఆరు జిల్లాలకు చెల్లాచెదురయ్యారు. తాజాగా వీరందరూ ఇప్పుడు బదిలీలు అర్హులు. నాలుగో తరగతి ఉద్యోగులు, రికార్డు అసిస్టెంట్, టైపిస్టు, సూపరింటెండెంట్, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇలా పీఆర్ ఉద్యోగులకు సంబంధించి అన్ని కేటగిరీల వారీగా జాబితాను ఆయా శాఖల అధికారులు తయారు చేశారు.

జాబితా ప్రదర్శన

నాలుగేళ్ల పాటు ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగుల జాబితాను తయారు చేసి ఈ నెల 8న సోమవారం జిల్లా పరిషత్, మండల ప్రజాపరిషత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ తదితర కార్యాలయాల్లో ప్రదర్శించారు. బదిలీ అయ్యే ఉద్యోగులంతా ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆప్షన్స్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. వీటిని పరిశీలించి నిబంధనల మేరకు బదిలీలను చేపడతారు. ఈ ప్రక్రియ ఈనెల 20వ తేదీన ముగుస్తుంది.

40 శాతం మించకుండా..

ఒకే చోట మూడేళ్లు దాటిన వారిలో 40 శాతం మందికి స్థానచలనం కలగనుండడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్నవారు తీవ్ర కలవరానికి లోనవుతున్నారు. బదిలీలను తప్పించుకునేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇప్పటికే కొందరు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్టు తప్పుడు పత్రాలతో మినహాయింపు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలాకాలంగా పని చేస్తున్న ఉద్యోగులు మాత్రం కొత్త చోటుకు వేళ్లేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

ఫిబ్రవరిలోనే..

లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ యేడు ఫిబ్రవరిలో బదిలీ అయిన వారిని ఈ తాజా బదిలీల నుంచి మినహాయించారు. అప్పుడు సీఈవోలు, డీఆర్‌డీవోలు, అడిషనల్ డీఆర్‌డీవోలు, డీపీవోలు బదిలీ అయ్యారు. సొంత జిల్లాల్లో పని చేస్తున్నవారితో పాటు మూడేళ్లకుపైగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు ఆరు జిల్లా పరిషత్తుల అధికారులకు స్థాన చలనం కలిగింది.

బదిలీల ఫీవర్

ఉద్యోగుల్లో బదిలీల జ్వరం పట్టుకున్నది. తాము పని చేస్తున్న చోటు నుంచి ఎక్కడికి స్థాన చలనం జరుగుతోందనన్న భయం పట్టుకున్నది. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సాధారణ బదిలీలకు అవకాశం కల్పిస్తూ ఈనెల 3వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఈ నెల 5తేదీ నుంచి బదిలీ ప్రక్రియను ప్రభుత్వ శాఖలు మొదలు పెట్టాయి. ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఈనెల 20వ తేదీ వరకు సడలిస్తూ.. నిర్దేశించిన షెడ్యూల్‌లోగా అన్ని ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వ శాఖలు విడివిడిగా బదిలీ మార్గదర్శకాలను విడుదల చేసింది. బదిలీలకు సంబంధించిన రోజువారీ షెడ్యూల్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా దంపతులు

అమ్మవారిని దర్శించుకున్న పోలీసు కమిషనర్

వరంగల్ కల్చరల్, జూలై 14: నగరంలోని భద్రకాళి అమ్మవారి శాకంబరీ ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా దంపతులు కుటుంబంతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సీపీ దంపతుల చేత ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ దంపతులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు ఆశీర్వచనం, శేష వస్త్రాలను అందజేశారు.

కడిపికొండ ఆర్‌వోబీపై

గుంతలకు మరమ్మతులు చేపట్టాలి



ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మడికొండ, జూలై 14: కాజీపేట కడిపికొండ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన పెద్ద, పెద్ద గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టేవిధంగా సంబంధిత అధికారులకు సూచించాలని కోరుతూ రాంపేటకు చెంది న ఆర్.శ్రీనివాస్‌రెడ్డి శనివారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రిడ్జిపై 2019 నుంచి గుంతలు ఏర్పడి ఆ గుంత ల్లో నుంచి ఇనుప రాడ్‌లు బయటికి వచ్చి అనేక మంది ప్రమాదాలబారిన పడుతున్నారని పేర్కొన్నారు. గుంతలు పూడ్చి మరమ్మతులు చేయాలని అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదన్నారు. ఆయా శాఖల అధికారులకు చెప్పి సమస్యను పరిష్కరించి వాహనదారులను ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని వినతిపత్రంలో ఎంపీని కోరినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గాంధీనగర్‌లో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

వడ్డెపల్లి, జూలై 14: గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గాంధీనగర్‌లో గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు కాలనీలోని రోడ్లను ఊడ్చి పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటరాజిరెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను రోడ్లపై వేయకుండా చెత్తబుట్టల్లో వేసి మునిసిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య, ఉపాధ్యక్షులు వీరేందర్, కోశాధికారి గోపగాని అశోక్, జనార్ధన్‌రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాజిరెడ్డితో పాటు మునిసిపల్ సిబ్బంది శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



స్నేహితురాలి కూతురి పేరుపై ఫిక్స్‌డిపాజిట్‌ను అందజేస్తున్న బాల్య స్నేహితులు

ఐనవోలు, జూలై 14: స్నేహితురాలి కుటుంబానికి బాల్య మిత్రులు ఆర్థిక సహాయం చేశారు. పంథినిలో 2004-05 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితురాలు గడ్డం సరిత భర్త ఐనవోలుకు చెందిన గడ్డం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాల్యస్నేహితులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని రూ.21 వేలను పోగు చేసి సరిత కూతురు లాస్య పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆదివారం ఆ కుటుంబానికి పాస్‌బుక్‌ను అందజేసి ఔదార్యాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో మదూరి రాజు, బండి రమేష్, గుర్రపు రాము, తుమ్మల మహేందర్, చింతిరెడ్డి రాజులు పాల్గొన్నారు.

ఒరిగిన వడ్డెపల్లి చెరువు కట్ట ప్రహరీ

● ఏ క్షణాన్నైనా కూలే ప్రమాదం
● భయపడుతున్న పాదచారులు, వాహనదారులు

హనుమకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి చెరువు కట్టపై శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయం సమీపంలో కేయూ 100 ఫీట్ల రోడ్డువైపు ఉన్న ప్రహరీ కొంతభాగం కూలడానికి సిద్ధంగా ఉంది. వడ్డెపల్లి చెరువు కట్టను ఆనుకొని కేయూ వంద అడుగుల రోడ్డు వైపు ఉన్న ప్రహరీగోడ ఏళ్ల కిందట నిర్మించింది. ప్రస్తుతం ఈ చెరువు కట్ట పొడవునా కాంక్రీట్ వాల్ నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ప్రహరీగోడను కొన్ని చోట్ల కూల్చివేశారు. అయితే ఫాతిమా జంక్షన్ వైపు చెరువు కట్ట చివరన ఉన్న దేవాలయం సమీపంలో గోడలో కొంత భాగం కుంగిపోయింది. అది ఏ క్షణాన్నైనా కూలిపోయే ప్రమాదం ఉంది.

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అది మరింత కుంగే అవకాశం ఉంది. ఈ గోడ కుంగిపోవడంతో రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులు ఎక్కడ తమ పై పడిపోతుందోనని భయపడుతున్నారు. గోడ కుంగిన భాగాన్ని వెంటనే తొలగించి కొత్త గోడను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. భక్తులు, వాకర్స్ పెద్దసంఖ్యలో ఈ గోడ పక్క నుంచే వస్తుంటారు. గోడ కుంగిపోవడంవల్ల చూసి భయపడుతున్నారు. వరంగల్ నగర పాలక సంస్థ లేదా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఈ విషయంలో తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పూర్తిగా రోడ్డు వైపు వంగి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ప్రహరీగోడ

శ్యామల చెరువు శుద్ధికి చర్యలు

రాంనగర్, జూలై 14: నగరంలోని 55వ డివిజన్ భీమారం గ్రామంలోని శ్యామల చెరువు శుద్ధికి చెరువు పరిరక్షణ సభ్యులు నడుంబిగించారు. కొంతకాలంగా చెరువు పరిరక్షణ కోసం పోరాడుతున్న సభ్యులు చెరువు శుద్ధి చేయాలని నిర్ణయించారు. గ్రామం నడిబొడ్డున ఉన్న చెరువు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. చెరువు ఒడ్డుకు శివాలయం, హనుమాన్ ఆలయాలున్నాయి. ఈ ఆలయాలకు వచ్చే భక్తులు చెరువులో పేరుకుపోయిన చెత్త కంపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊరి చెత్తంతా చెరువులోనే వేస్తున్నారు. దీంతో చెరువులో దిగి నీటిని తాకే పరిస్థితి లేదు. గతంలో ఇదే చెరువులో గ్రామస్తులంతా స్నానాలు చేసేవారు. ఇదే చెరువులో ఉన్న బావి నీళ్ల తాగేవారు. చెరువు నీరు గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గణపతి నవరాత్రి ఉత్సవాల అనంతరం విగ్రహాలు ఇదే చెరువులో వేసేవారు. ప్రస్తుతం చెరువు కంపుకొడుతోంది. స్నానాలు చేయడం దేవుడెరుగు.. కనీసం నీటిని ముట్టుకునే పరిస్థితి లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరు కూడా చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

దీంతో చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు శ్యామల చెరువు శుద్ధికి శ్రీకారం చుట్టారు. పరిరక్షణ సభ్యులకు గ్రామస్తులు తోడయ్యారు. స్వచ్ఛందంగా వచ్చి ఆదివారం శుద్ధి కార్యక్రమం చేపట్టారు. పిచ్చి మొక్కలు తీసేసి, చెత్తను తొలగించారు. వారం పాటు ఈ కార్యక్రమం చేసి శ్యామల చెరువుకు పూర్వవైభవం తీసుకురావాలని నిర్ణయించారు. వర్షం నీరు చెరువులోకి చేరకముందే పూర్తి స్థాయిలో శుద్ధి చేయనున్నారు. అనంతరం చెరువులో చెత్త వేయకూడదు, పశువులను చెరువులోకి రానివ్వకూడదు లాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శ్యామల చెరువు శుద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంపట్ల గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.



చెరువు శుద్ధి చేస్తున్న సభ్యులు

టెస్కాబ్ చైర్మన్‌ను కలిసిన ఎస్సై శ్రీనివాస్



రవీందర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, జూలై 14: టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఐనవోలు నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాస్‌కు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీనివాస్ ను కాంగ్రెస్ మండల పార్టీ నాయకులతోపాటు శాలివాహన యూత్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా వేర్వేరు సమయాల్లో కలిసి పుష్పగుచ్ఛా లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాకర సాంబయ్య, మండల అధికార ప్రతినిధి కొత్తూరి సునీల్, మైనారిటీ అధ్యక్షుడు రహీంపాషా, అనుముల రవీందర్, మాజీ సర్పంచ్ మంజూలయాదగిరి, మాజీ ఎం పీటీసీ మండల సరళసత్యంగౌడ్, మురళిగౌడ్, రాజేష్‌గౌడ్, రాజారపు రాజ్‌కుమార్, అమరవాది రమేష్, వి. రమేష్, అరవింద్, రాజశేఖర్ కలిసిన వారిలో ఉన్నారు.

అనారోగ్యంతో కేయూ ఉద్యోగి మృతి

కేయూ క్యాంపస్, జూలై 14: కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగి దామెర స్వామి (56)అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఎంజీఎంలో తుదిశ్వాస విడిచారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ పెగడపల్లిలోని మృతుడు స్వామి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వామికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

భార్య గతంలోనే చనిపోయింది. స్వామికి నివాళులర్పించిన వారిలో ఆల్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, కచ్చకాయల చిరంజీవి, వల్లాల తిరుపతి, ప్రభాకర్, ఎ.సతీశ్ బాబు, పోలేపాక కోర్నేల్ తదితరులున్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

సుబేదారి, జూలై 14: డ్రగ్స్ ర హిత సమాజ నిర్మాణమే తమ సంస్థ లక్ష్యమని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పాలక వర్గ సమావేశంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డ్రగ్స్ రహిత సమాజం కోసం రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రతీ పాఠశాల, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సంస్థ నిర్ణయించింది. ఈ సందర్భంగా విజయ్ చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత భావితరాలకు ఆదర్శంగా నిలువాలంటే డ్రగ్స్‌కు బానిస కాకుండా నవ యువ సమాజాన్ని నిర్మించాలని అన్నారు. దేశ భవిష్యత్ యువతపై, విద్యార్థులపై ఆధార పడి ఉందని చెప్పారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ పాలక వర్గ సభ్యుడు డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్‌సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషుమాధవ్, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ హెచ్. సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి

మల్లికుదుర్లలో మట్టిదందా

ప్రభుత్వ భూమి నుంచి తరలిస్తున్నారంటున్న స్థానికులు
పట్టించుకోని అధికారులు



మల్లికుదుర్లలో మట్టి రవాణా చేయడంతో గుంతలుగా మారిన భూమి

వేలేరు(ధర్మసాగర్), జూలై 14: వ్యవసాయానికి అనువైన, ఎంతో విలువైన భూముల నుంచి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని సర్వే నంబర్ 89లో 33.16 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో పది ఎకరాల వరకు బండ ఉండగా, మిగతా 20 ఎకరాలు వ్యవసాయానికి అనువుగా ఉంది. ఈ భూమిని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయకపోవడం, ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోకపోవడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ భూమిపై కన్నేశారు. మొదటగా సొంత వ్యవసాయ భూముల్లో మట్టి రవాణా చేసుకునేందుకు మైనింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. తర్వాత సుమారు ఆరెకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాలుగేళ్ల నుంచి 12 ఫీట్ల లోతు వరకు మట్టి తీసి రవాణా చేస్తున్నారు. స్థానికులు నోగబడ్డ వద్ద ఉన్న ప్రభుత్వ భూమి నుంచి మట్టి రవాణా చేస్తున్నారని మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మట్టి రవాణాను ఆపనూ లేదు. వేలేరు, మల్లికుదుర్ల, శాయిపేట, ఎలుకుర్తి గ్రామాల్లో మట్టిని డంపు చేసి నగరానికి రవాణా చేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు మల్లికుదుర్ల గ్రామంలోని ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు నాటి నిరుపేదలు, లేదా ప్రభుత్వ అవసరాలకు వినియోగించు కోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుండెపోటుతో ఏఎన్ఎం మృతి

గట్లనర్సింగాపూర్‌లో విషాదం

భీమదేవరపల్లి, జూలై 14: భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామా నికి చెందిన బొల్లంపల్లి పర్మిల (40) అనే ఏఎన్ఎం గుండెపోటుతో ఆదివారం మృతి చెందింది. ప్రస్తుతం పర్మిల ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామాల్లో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పర్మిలకు భర్తతో పాటు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. పర్మిల మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పర్మిల (ఫైల్)



అశ్రునయనాల మధ్య

అభిలాష్ అంతక్రియలు

ఐనవోలు, జూలై 14: అశ్రునయనాల మధ్య ఇంజనీరింగ్ విద్యార్థి అభిలాష్ అంతక్రియలు కొనసాగాయి. ఒం టిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మామిండ్ల అభిలాష్(20) జూన్ 30న పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది తెలిసిందే. ప్రమాదం జరిగిన వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించి మెరుగైన చికిత్సకోసం అక్కడి నుం చి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి నుజ్జునుజ్జు అయిన ఎడమకాలును తొలగించారు.

తల, వృషణాలకు గాయాలు కావడంతో శస్త్ర చికిత్సలు చేశారు. వారం రోజులకు స్పృహలోకి వచ్చి మాట్లాడాడు. అవయవాలు తొలగించిన పర్వాలేదు.. కళ్ల ముందు కుమారుడు బతికి ఉండాలని తల్లిదండ్రులు మానస-తిరుపతిలు ఎంతగానో ఆశపడి కనిపించిన దేవుళ్లను మొక్కుకున్నారు. వైద్యులు రెండోసారి తలకు ఆపరేషన్ చేశాక ఇక స్పృహలోకి రాలేదు. ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు కుటుంబసభ్యులకు వివరించారు. హైదరాబాద్ నుంచి వరంగల్ ఎంజీఎంకు మృతదేహాన్ని తీసుకువచ్చారు. ఐనవోలు ఎస్సై శ్రీనివాస్ శవపంచనామా పూర్తయ్యాక మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. 14 రోజుల వైద్యానికి రూ.28లక్షల ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. అభిలాష్ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఇం టికి వచ్చాడు. మళ్లీ హైదరాబాద్ కళాశాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా. అంతలోనే దుర్ఘటనలో తీ వ్రంగా గాయపడి చావుతో పోరాడి తనువు చాలించాడు.

భారీ శవయాత్ర.. టెస్కాబ్ చైర్మన్ పరామర్శ

ఎంజీఎం మార్చురీలో అభిలాష్ మృతదేహాన్ని టెస్కా బ్ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్‌రావులు సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అభిలాష్ మృతదేహం ఐనవోలుకు చేరుకున్నాక ఐనవోలు, ఒంటిమామిడిపల్లి గ్రామాల స్నేహితులు గ్రామస్థులు వేలసంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. ఐనవోలు పెట్రోల్ పంపు నుంచి ఒంటిమామిడిపల్లి వరకు శవయాత్రను నిర్వహించారు. దీంతో గ్రామంలో విషా దం అలుముకుంది. సాయంత్రం అంత్యక్రియలు పూర్తయ్యాయి.



శవయాత్రలో పాల్గొన్న స్నేహితులు, రెండు గ్రామాల ప్రజలు, ఇన్‌సెట్లో అభిలాష్(ఫైల్)



అలంకార్ జంక్షన్ ప్రధాన కూడలిలో నిలిచిన వర్షపు నీరు



చెరువును తలపిస్తున్న అలంకార్ జంక్షన్

వర్షపు నీరుతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు, ప్రయాణికులు
అధికారులకు విన్నవించినా చర్యలు శూన్యం

హనుమకొండ చౌరస్తా, జూలై 14: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ 10, 11 డివిజన్లకు అనుసంధానంగా ఉన్న అలంకార్ జంక్షన్ ప్రాంతంలోని ప్రధాన రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. చిన్న చినుకు పడితే చాలు.. రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోతున్నాయి. దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా రోడ్లన్నీ జలమయంగా మారడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది సమీప కాలనీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అలాగే నిల్వ ఉన్న నీటితో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీ కాలువలు మట్టి, చెత్త, చెదారంతో నిండటంతో వర్షపునీరు రోడ్లపైకి చేరి రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. రోజుల తరబడి వర్షం నీరు ప్రధాన రోడ్డుపై నిలిచి ఉండటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని భయం భయంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. గతంలో స్థానికుల ఫిర్యాదుల మేరకు స్పందించిన ఉన్నతాధికారులు.. ఒకటి, రెండుసార్లు జంక్షన్‌ను సందర్శించి సుందరీకణతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను తీరుస్తామని హామీలు ఇచ్చారు. అయితే అవి హామీలకే పరిమితమయ్యాయి తప్ప.. అభివృద్ధి పనులు జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే షాపుల ముందు వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరడంతో కొనుగోలుదారులు రాక ఇబ్బందులు పడుతున్నట్లు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

కాలువలను పునరుద్ధరించాలి



అలంకార్ జంక్షన్‌లో డ్రైనేజీ కాలువలు సరిగాలేక తేలికపాటి వర్షం కురువడంతో రోడ్లపైకి వర్షపు నీరు ఎద్ద ఎత్తున చేరుతోంది. అలంకార్ జంక్షన్ నుంచి కాపువాడకు వెళ్లేమార్గంలో ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై వర్షపునీరు పెద్దఎత్తున చేరడంతో తీవ్ర దుర్గంధంతో పాటు ఈగలు, దోమలు చేరి రోగాల బారిన పడుతున్నాం. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెట్టి జంక్షన్‌లో డ్రైనేజీ కాలువలను పునరుద్ధరించి రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి.

- మాడిశెట్టి చంద్రశేఖర్, స్థానికుడు.

కుంటను తలపిస్తోంది..



అలంకార్ జంక్షన్‌లోని ప్రధాన రోడ్డు వర్షపు నీటితో నిండి కుంటను తలపిస్తోంది. వివిధ పనుల నిమిత్తం ప్రతీరోజు అటుగా ప్రయాణం కొనసాగిస్తుంటాం. రోడ్డు పక్కన డ్రైనేజీల సరిగాలేక వరదనీరు రోడ్డుపైకి చేరడంతో రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. రోడ్డుపై వరద నీరు నిలిచి ఉండటంతో ప్రాణాలను చేతులో పెట్టుకొని ప్రయాణం కొనసాగిస్తున్నాం. సంబంధిత అధికారులు అలంకార్‌జంక్షన్‌లో రోడ్డు పై వర్షపు నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలి.

- గంట శ్రీనివాస్, వాహనదారుడు.

సాధికారత

ఆమే ఒక 'వర'ం



అందరిలానే ఎన్నో కలలు కన్నారు... డాక్టర్ కావాలని! ప్రయత్నం ఫలించలేదు. కానీ నిరాశతో కుంగిపోలేదు. భర్తతో కలిసి సొంత కంపెనీ బాధ్యతలు పంచుకున్నారు. లక్ష రూపాయలతో మొదలైన సంస్థను 28 కోట్ల టర్నోవర్‌కు తీసుకువెళ్లి... కంపెనీకి ఆమే ఒక 'వర'మయ్యారు. 'గ్రీన్‌టెక్ ఇండియా లిమిటెడ్' డైరెక్టర్ వరలక్ష్మి గన్నారపు... తన పాతికేళ్ల పారిశ్రామిక ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

"పెళ్లి తరువాత చాలామంది అమ్మాయిల కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పడిపోతుంది. కానీ పారిశ్రామికవేత్తగా నా జీవితం మొదలైంది పెళ్లి తరువాతే. అందుకు ప్రధాన కారణం... మావారు సత్యకిరణ్ గన్నారపు, ఇతర కుటుంబ సభ్యుల ప్రోత్సాహం. 1995లో మావారు 'గ్రీన్‌టెక్' సౌర విద్యుత్ ఉపకరణాల సంస్థను ప్రారంభించారు. అంతకముందు ఆయన సోలార్ వాటర్ హీటర్లు విక్రయించేవారు. ఈ రంగంలో ఆయనకు ఆసక్తి ఎక్కువ. అందుకే మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన ఆయన ఇటువైపు వచ్చారు. 1999లో మా పెళ్లయింది. మూడు నాలుగేళ్ల తరువాత నేను కూడా కంపెనీ కార్యకలాపాల్లో భాగస్వామినయ్యాను. నేను వెళ్లింది మావారికి కాస్త సాయంగా ఉందామని. కానీ నాటి నుంచి పాతికేళ్లుగా కంపెనీతో మమేకమైపోయాను. నేను పుట్టి పెరిగిందంతా కామారెడ్డిలో. అత్తవారిది హైదరాబాద్.

గృహిణిగానే ఉండాలనుకోలేదు...

చిన్నప్పటి నుంచి నా లక్ష్యం డాక్టర్ కావాలని. మా సోదరుడు ఒకాయన డాక్టర్. ఆయన స్ఫూర్తితో మెడిసిన్ చదవాలనుకున్నా. అందుకే ఇంటర్‌లో సైన్స్ గ్రూప్ తీసుకున్నా. మెడిసిన్‌లో సీటు కోసం కష్టపడ్డాను. రాలేదు. అలాగని కుంగిపోలేదు. 1997లో బీజెడ్‌సీ పూర్తయ్యాక డిప్లమా ఇన్ ఫార్మసీ చదివాను. రెండేళ్లు మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్ ప్రయత్నించాను. ఒక గృహిణిగా మిగిలిపోవాలని ఎన్నడూ అనుకోలేదు. నాకంటూ ఒక కెరీర్‌ను నిర్మించుకోవాలని అనుకున్నా. పెళ్లి తరువాత మా కంపెనీ బాధ్యతలు చేపట్టినా... మధ్యలో ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా కూడా చేశాను.

మార్కెటింగ్ నేనే...

లక్ష రూపాయల పెట్టుబడితో ప్రారంభమైన మా కంపెనీ 2007లో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారింది. ఆరంభంలో బెంగళూరు నుంచి వాటర్ హీటర్లు తెచ్చి విక్రయించేవాళ్లం. క్రమంగా వాటి తయారీ మొదలుపెట్టాం. ఒక్కో ఉత్పత్తి పెంచుకొంటూ పోయాం. ప్రస్తుతం సోలార్ ప్యానల్స్‌తో పాటు ఇతర ఉపకరణాలు కూడా తయారు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఇళ్లు, కంపెనీలు, కమర్షియల్ బిల్డింగ్స్‌కు సోలార్ పవర్ ప్రాజెక్ట్ చేపడుతున్నాం. చిన్న యూనిట్‌గా ఆరంభమైన మా కంపెనీకి ఇప్పుడు ఢిల్లీ, పుణే, చెన్నైల్లో బ్రాంచీలు ఉన్నాయి. ప్రొడక్షన్, ఎరక్షన్, కమిషనింగ్... ఇదీ మా పని. మా ఫ్యాక్టరీ తూప్రాన్‌లో ఉంది. కంపెనీలోకి వచ్చాక మొదట్లో అడ్మినిస్ట్రేషన్ చూసుకొనేదాన్ని. కొన్నేళ్ల నుంచి మార్కెటింగ్ బాధ్యతలు తీసుకున్నాను.

టాప్-50లో చూడాలి...

దేశంలోని సౌర విద్యుత్ రంగంలో కనీసం 20 శాతం మార్కెట్ షేర్ సాధించాలనేది నా లక్ష్యం. భారత్‌లోని టాప్-50 కంపెనీల్లో మా 'గ్రీన్‌టెక్'ను చూడాలి. ఒక విజయవంతమైన మహిళగా నా పేరు అందరికీ పరిచయం కావాలి. నన్ను చూసి మరికొంతమంది మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలి. బిజినెస్‌లోకి రావాలనుకొనే అమ్మాయిలకు నేను చెప్పేది ఒక్కటే.. ఎంచుకున్న రంగంపై ఆసక్తి, కొత్తగా ప్రయత్నించాలన్న కుతూహలం, చేయగలనన్న నమ్మకం ఉండాలి. ఒకవేళ అనుకున్నది చేయలేకపోతే ఎందుకు చేయలేకపోయానని బేరీజు వేసుకోగలగాలి. కామారెడ్డి నుంచి నగరానికి వచ్చినప్పుడు నాకు తెలుగు తప్ప మరేదీ రాదు. డిగ్రీ కూడా తెలుగు మీడియంలోనే చదివా. వ్యాపారంలోకి వెళ్లాక కూడా చెక్, ఇన్వాయిస్, క్రెడిట్, డెబిట్ పర్చేజ్ లాంటివి ఏవీ తెలియదు. నేర్చుకోవాలన్న తపన, సాధించాలన్న పట్టుదల, నడలని ఆత్మవిశ్వాసమే నన్ను నడిపిస్తున్నాయి.

అంత సులువు కాదు...

ప్రస్తుతం 'గ్రీన్‌టెక్'లో వంద మందికి పైగా పని చేస్తున్నారు. ఫ్యాక్టరీ మొదలు ఇంజనీరింగ్, మార్కెటింగ్ వరకు అన్నిచోట్లా మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మా అందరి సమష్టి కృషితో మొన్న ఏప్రిల్‌కు మా కంపెనీ టర్నోవర్ 28 కోట్లు దాటింది. దీనికి బ్యాకప్‌గా వేరే కంపెనీలు కూడా పెట్టాం. వాటి కార్యకలాపాలు కూడా నేనే చూసుకొంటున్నాను. సోలార్ పవర్ ఉత్పత్తులకు సంబంధించి మార్కెటింగ్ అంత సులువు కాదు. ఇది ఒక భిన్నమైన రంగం. దానిపై ముందు కస్టమర్లకు అవగాహన కల్పించాలి. ఆపై మా ఉత్పత్తులు, సేవల పట్ల నమ్మకం కలిగించాలి. మార్కెట్‌లో పోటీని తట్టుకోగలిగితేనే నిలబడగలం.

అదే పెద్ద సవాలు...

ఒక మహిళా పారిశ్రామికవేత్తగా నిత్యం ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. ఇంటి పనులు, పిల్లలు, అత్తమామలు... ఇలా రకరకాల బాధ్యతలు. అన్నిటినీ చక్కబెట్టి, బయటకు వెళ్లి కంపెనీ వ్యవహారాలు చూసుకోవాలి. ఒక్కోసారి బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో వేడుకలు జరుగుతుంటాయి. అదే సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు దేనికి ప్రాధాన్యం ఇవ్వాలనేది నిర్ణయించుకోవడం చాలా కష్టం. అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగడం పెద్ద సవాలు. అయితే దేన్నయినా సరే సవాలుగా తీసుకొని పని చేయడం నాకు ఇష్టం. కష్టపడే తత్వంతో పాటు మా కుటుంబం, ఆ భగవంతుడి కృపవల్ల అన్నిటినీ సమన్వయం చేసుకోగలుగుతున్నా. ఎప్పుడైనా నిరుత్సాహానికి లోనైనప్పుడు మా గురువు ప్రేమ్‌రావత్ బోధనలు వింటాను. వెంటనే మనసు కుదుట పడుతుంది.

ఇవే నా బలం...

కుటుంబం, ఆరోగ్యం... ఇవే నా బలం. 48 ఏళ్ల వయసులోనూ ఇంత చలాకీగా ఉన్నానంటే అందుకు క్రమం తప్పని వ్యాయామం, ఆహార నియమాలే కారణం. మాకు ఒక అబ్బాయి. ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఇప్పుడు నన్ను చూసి మా అన్నయ్యలు, వదినలు 'వరలక్ష్మీ... నువ్వు ఎంతో సాధించావు' అంటూ గర్వపడుతున్నారు. నేను కోరుకున్నది ఇలాంటి విజయాన్నే."

● హనుమా

కళతో వికాసం

"కళకు వివక్ష ఉండకూడదు. కులం, మతం, ప్రాంతం లాంటివే కాదు... వైకల్యాలు ఉన్నవారికీ కళా శిక్షణ ద్వారా వికాసాన్ని పొందే అవకాశం అందించాలి" అంటారు విశాఖ వర్మ. దుబాయ్‌లో డ్యాన్స్ అకాడమీ ఏర్పాటు చేసి... పదిహేడేళ్లుగా ఆటిజంలాంటి సమస్యలున్న వందలమంది పిల్లలకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఇతర దేశాల్లో ప్రదర్శనలు నిర్వహించి... వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు.



"నేను పుట్టింది, పెరిగింది ఢిల్లీలో. అమ్మ స్కూల్ టీచర్ నాన్న నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జి)లో పని చేసేవారు. మా అమ్మకు డ్యాన్స్ అంటే ఆసక్తి. నన్ను మంచి డ్యాన్సర్‌గా తీర్చిదిద్దాలనుకుంది. నాకూ ఇష్టమే కాబట్టి... ఏడేళ్ల వయసు నుంచి కథక్ నేర్చుకోవడం ప్రారంభించాను. ఆ తరువాత కొన్ని ప్రదర్శనలు కూడా ఇచ్చాను. తీరిక సమయాల్లో కొందరు పిల్లలకు డ్యాన్స్ నేర్పాను. డ్యాన్సర్‌గా కెరీర్ ఎంచుకోవాలనేది నా కోరిక. కానీ కళలనేవి హాబీగా మాత్రమే ఉండాలనేది మా వాళ్ల అభిప్రాయం. దాంతో నా కోరికను వదులుకొని, సివిల్ ఇంజనీరింగ్ చేశాను. ఆ తరువాత ఉద్యోగంలో చేరాను. కొన్నాళ్లకు... వివాహమయ్యాక... నా భర్త ఉద్యోగరీత్యా దుబాయ్ వెళ్లాల్సి వచ్చింది. అక్కడ జరిగిన ఒక సంఘటన మళ్లీ నన్ను నృత్య ప్రపంచంవైపు తీసుకువచ్చింది.

'ఏం ప్రయోజనం' అన్నారు...

నాకు పరిచయం ఉన్న ఒక మహిళ దుబాయ్‌లోని ఒక పాఠశాలలో ఒక కార్యక్రమానికి నన్ను ఆహ్వానించారు. అక్కడ.. సెరెబ్రల్ పాల్సీ, ఆటిజం లాంటి సమస్యలున్న పిల్లలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కానీ వారు నేపథ్యంలో వస్తున్న సంగీతాన్ని వింటున్నట్టు కానీ, సరిగ్గా స్పందిస్తున్నట్టు కానీ నాకు కనిపించలేదు. శరీరాన్ని కదిలించడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. 'ఆ పిల్లలకు సరైన రీతిలో నాట్యం ఎందుకు నేర్పకూడదు?' అనిపించింది. అదే విషయం నన్ను ఆహ్వానించిన వ్యక్తిని అడిగాను. వాళ్లకు ఉన్న సమస్యలను ఆమె వివరిస్తూ... "వారిలో బెరుకు పోయి, నలుగురి ముందుకూ రావాలనే ఆలోచనతోనే వారిని స్టేజి మీదకు తీసుకు వచ్చాం. అంతేతప్ప వాళ్ల ప్రతిభను ప్రదర్శించడానికి కాదు. వాళ్లకు నాట్యం ఎందుకు నేర్పకూడదని మీరంటున్నారు. మీరు ఉచితంగా నేర్పుతారా?" అని అడిగారు. "నేర్పుతాను" అని వెంటనే చెప్పాను. నా భర్త కూడా నా ఆలోచనకు మద్దతు ఇచ్చారు.



ముందుగా.. ఆటిజం లాంటి సమస్యలున్న పిల్లల గురించి నిపుణులు, పుస్తకాల ద్వారా తెలుసుకున్నాను. డ్యాన్స్ మూవ్‌మెంట్ థెరపీలో రెండేళ్ళ శిక్షణ తీసుకున్నాను. మానసిక వైద్యులతో మాట్లాడాను. 2007లో... దుబాయ్‌లో 'విశాఖ డ్యాన్స్ అకాడమీ'ని ప్రారంభించాను. అయితే తల్లితండ్రుల్ని ఒప్పించడం కష్టమయింది. "వాళ్ల పరిస్థితి చూశారు కదా! ఇంకా కష్టపెట్టడం ఎందుకు? డ్యాన్స్ వల్ల ఏం ప్రయోజనం?" అని ప్రశ్నించారు. "నృత్యమంటే మాటలు లేకుండా భావాన్ని వ్యక్తీకరించే ఒక విధానం. ఈ పిల్లలు మాట్లాడలేరు. కానీ, నేను నేర్పాలనుకొనేది వాళ్లు అర్థం చేసుకోగలరు" అని చెప్పాను. మొదట ఒక తొమ్మిదేళ్ల అమ్మాయి చేరింది. తనను చూసి మరికొందరు... అలా విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఎడిహెచ్‌డి, ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్, రెట్ సిండ్రోమ్... ఇలా పలు సమస్యలున్న పిల్లలను చేర్చుకున్నాను. అయితే మా అకాడమీని వారికే పరిమితం చెయ్యలేదు. సాధారణ పిల్లలకు కూడా శిక్షణ ఇస్తున్నా.

వారే నా గురువులు...

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు నృత్యం నేర్పడం ఒక సవాల్ అయితే... వారికి మనం చేరువకావడం, వారికోసం మనం ఉన్నామనే నమ్మకం కలిగించడం మరో సవాల్. డ్యాన్స్ థెరపీ అంటే మానసిక స్పందనలకు శారీరకమైన కదలికలను అనుసంధానించడం. పిల్లల్లో శారీరకమైన లాఘవాన్ని పెంచడానికి దోహదపడుతుంది. వారిలో ఆతృతను, ఒత్తిడిని తగ్గిస్తుంది. వివిధ వైకల్యాలున్న 300మందికి పైగా పిల్లలకు ఇప్పటివరకూ శిక్షణ ఇచ్చాను. పలు దేశాల్లో ప్రదర్శనలు ఇప్పించాను. వారి నైపుణ్యం, భావవ్యక్తీకరణ సామర్థ్యంలో పెరుగుదల, ఆత్మవిశ్వాసం... చూసి నాకు ఎంతో గర్వంగా అనిపిస్తోంది. నేను చేస్తున్న కార్యక్రమాలను గుర్తించిన భారత ప్రభుత్వం... 2021లో 'గ్లోబల్ డిజేబిలిటీ ఎంపవర్‌మెంట్ అవార్డు'తో నన్ను సత్కరించింది. ఇక మా పిల్లలతో నేను చేసిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొంది, మాకు ఎంతో పేరు తెస్తున్నాయి. కళలకు ఎలాంటి వివక్షా ఉండకూడదనేది నా తపన. వైకల్యాలున్న పిల్లల్లో డ్యాన్స్ థెరపీ అద్భుతాలు చేస్తుందనేది ఇప్పుడు ప్రపంచం గుర్తిస్తోంది. నా దగ్గర శిక్షణ పొందిన పిల్లల్లో సానుకూలమైన మార్పు ఎంతో సంతోషం కలిగిస్తోంది. వారిని నేను గురువులుగా భావిస్తాను. ఎందుకంటే... సహనంగా, ప్రశాంతంగా ఉండడం, బేషరతుగా ప్రేమ అందించడం... ఎన్నో విషయాలు వారి నుంచి నేర్చుకున్నాను. నా కృషిని కొనసాగించడానికి ప్రేరణ వారి నుంచే నాకు లభిస్తోంది."

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. దేఖా తేను (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
4. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
5. చలేయా (జవాన్)
6. ఓ మాహీ (డంకీ)
7. అపనా బనాలే (భేడియా)
8. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
9. నాదానియా (నాదానియా)
10. పెహలే భీ మై (యానిమల్)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)

నవ్య | చిత్రజ్యోతి

మండీలో రాజ్‌తరుణ్

రాజ్‌తరుణ్ కోసమే న్యాయపోరాటం చేస్తున్నానని.. అవసరమైతే నిరాహార దీక్షకు కూడా వెనుకాడనని ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ఆదివారం తెలిపారు. శనివారం లావణ్య స్టేట్‌మెంట్‌ను పోలీసులు



రికార్డు చేశారు. తన దగ్గరున్న ఆధారాలను లావణ్య పోలీసులకు అప్పగించింది. దీంతో రాజ్‌తరుణ్‌కు పోలీసులు నోటీసులిచ్చి విచారణకు పిలవనున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ కేసు విచారణను తప్పించుకునేందుకు రాజ్‌తరుణ్ హిమాచల్‌ప్రదేశ్‌లోని మాల్వీ మల్హోత్రా సొంతూరైన మండీలో తలదాచుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయంలో తనకు న్యాయం జరిగే వరకు పోరాడతానని తెలిపారు. మరిన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తానని తెలిపారు.

అంచనాలకు మించేలా



అభిషేక్ పచ్చిపాల, నజియా ఖాన్, వినీశా జ్ఞానేశ్వర్ తెరకెక్కిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. యశ్వంత్ దర్శకత్వంలో తన్వీర్, ప్రకాశ్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. శనివారం మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత తన్వీర్ మాట్లాడుతూ "ప్రేక్షకులు సినిమా చూసి మంచి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. హీరో అభిషేక్ పచ్చిపాల మాట్లాడుతూ "ఈ సినిమా మొత్తం చాలా వినోదాత్మకంగా ఉంటుంది" అని చెప్పారు. దర్శకుడు యశ్వంత్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: దుర్గ నరసింహా, సినిమాటోగ్రాఫర్: ఆమిర్, సంగీతం: ఎస్.కె.బాజీ.

సీఎం రేవంత్‌రెడ్డిని కలసిన సాయి దుర్గాతేజ్



హీరో సాయిదుర్గాతేజ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం కలిశారు. ఇటీవల సోషల్ మీడియాలో పిల్లలపై జరుగుతున్న అసభ్యకరమైన కామెంట్లను ఖండిస్తూ.. దుర్గాతేజ్ ఎక్స్‌లో ప్రణీత్ హనుమంతు అనే యూట్యూబర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి స్పందించగా, ప్రణీత్‌తో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ముఖ్యమంత్రితో పాటు తెలంగాణ ప్రభుత్వం సకాలంలో తన అభ్యర్థనకు స్పందించిన తీరుకు కృతజ్ఞతగా సాయి దుర్గతేజ్ ముఖ్యమంత్రిని కలిసి తన అభినందనలు తెలియజేశారు. "ఈ భేటీలో పిల్లలపై అసభ్యరంగా కామెంట్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరాను. ఆయన సానుకూలంగా స్పందించారు" అని ఎక్స్‌లో సాయిదుర్గాతేజ్ పోస్ట్ చేశారు.

మ్యూజిక్ సిట్టింగ్స్‌లో



రామ్ చరణ్ డైరెక్టర్ బుచ్చిబాబు సనాతో 'ఆర్‌సి16' వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. దాదాపు 200 కోట్ల భారీ బడ్జెట్‌తో క్రీడా నేపథ్యంలో ఈ సినిమాను వెంకట సతీశ్‌కిలారు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన సంగతిని డైరెక్టర్ బుచ్చిబాబు సనా అభిమానులతో పంచుకున్నారు. "ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ ప్రస్తుతం ఫుల్ జోష్‌తో సాగుతోంది. దుబాయ్‌లోని ఫిర్‌దౌస్ స్టూడియోలో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్, దర్శకుడు బుచ్చిబాబు కలసి దిగిన ఫొటోను యూనిట్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

ఎనర్జిటిక్ డాన్స్ డ్యూయెట్



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్‌ను జరుపుకొంటున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి కావచ్చిందని కేవలం రెండు పాటలు.. ఒక కీలక సన్నివేశం మాత్రమే బ్యాలెన్స్ ఉన్నాయని చిత్ర బృందం తెలిపింది. అయితే ఈ సినిమాలోని ఓ పాటను హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో వేసిన ప్రత్యేక సెట్స్‌లో రేపటి నుంచి చిత్రీకరించనున్నారని తెలిసింది. ఎన్టీఆర్, జాన్వీకపూర్ మధ్య సాగే ఈ డాన్స్ డ్యూయెట్ పాట.. చాలా ఎనర్జిటిక్‌గా ఉండి.. చిత్రానికే స్పెషల్ అట్రాక్షన్‌గా ఉండనుందట.

హారర్ కామెడీగా 'యజ్ఞ'



ప్రదీప్ రెడ్డి, శివ నాయుడు, గోవా జ్యోతి ప్రధానపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'యజ్ఞ'. సుమన్ శెట్టి, జబర్దస్త్ అప్పారావు, చిట్టిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రజల్లు ప్రసాద్‌యజ్ఞ దర్శకత్వంలో చిలుకోటి రఘురామ్, చీలపల్లి విఠల్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్రజల్లు ప్రసాద్ యజ్ఞ మాట్లాడుతూ "ఈ సినిమాను యజ్ఞంలా భావించి చేశాం. హారర్ కామెడీగా తెరకెక్కిన ఈ మూవీ అందరికీ నచ్చేలా ఉంటుంది" అని అన్నారు. "కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను గెలుస్తుంది" అని నిర్మాత విఠల్‌గౌడ్ చెప్పారు. "ఈ మూవీ సినిమా ప్రేక్షకులకు ఫుల్ మీల్స్‌లా ఉంటుంది" అని హీరో శివనాయుడు అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జి.కృష్ణ నాయుడు, సుధాకర్ నాయుడు.కె. సంగీతం: లక్ష్మణసాయి

సవాల్‌గా అనిపించింది



దాదాపు మూడేళ్ల గ్యాప్ తరువాత 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ'(ఉపశీర్షిక) చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించనున్నారు నభా నటేశ్. అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రియదర్శి కథానాయకుడిగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా నభా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథను డైరెక్టర్ చెప్పగానే ఒప్పేసుకున్నాను. ఇందులో నా పాత్రకు స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ ఉంటుంది. విభిన్న షేడ్స్ ఉన్న ఈ పాత్ర ఎంతో చాలెంజింగ్‌గా అనిపించింది. నేను ఇప్పటివరకూ ఇలాంటి రోల్ చేయలేదు. ఇదొక పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఈ సినిమాలో లవ్, కామెడీ, డ్రామా, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో ఉంటాయి. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది. ప్రియదర్శి కామెడీ టైమింగ్ చిత్రానికే హైలైట్‌గా ఉంటుంది. దర్శకుడు కథను చెప్పినదానికంటే మరింత బాగా తెరకెక్కించారు" అని చెప్పారు.

ప్రైవేట్ సాంగ్స్‌కు సై

మ్యూజిక్ వీడియో, ఆల్బమ్స్, ప్రైవేట్ సాంగ్స్... పేరేదైనా వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. శ్రోతల నుంచి భారీ స్పందన లభించడంతో ప్రైవేట్ సాంగ్స్ యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతున్నాయి. అద్భుతమైన విజువల్స్‌కు తోడు మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కుతుండడంతో మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి. అందుకే కొంతకాలంగా కథానాయికలు ప్రైవేట్ సాంగ్స్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బాలీవుడ్‌లో ఇలాంటి వీడియోలకు స్పెషల్ క్రేజ్ ఉంది. ఇప్పుడిప్పుడే సౌత్‌లోనూ ఈ ట్రెండ్ పుంజుకుంటోంది. మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్‌లు సైతం మ్యూజిక్ ఆల్బమ్స్‌తో అభిమానులను అలరిస్తున్నారు. యూట్యూబ్‌లో ఈ మ్యూజిక్ ఆల్బమ్స్‌కు మంచి ఆదరణ దక్కుతోంది.



హీరోయిన్‌గా అరంగేట్రం చేయకముందే గాయనిగా, సంగీత దర్శకురాలిగా చక్కని గుర్తింపు పొందారు శ్రుతీహాసన్. తనతండ్రి కమల్ హాసన్ నటించిన 'ఈనాడు' చిత్రానికి సంగీతం అందించారు. కరోనా టైమ్‌లో 'ఎడ్జ్' పేరుతో ఆమె వీడియోసాంగ్‌ను రూపొందించి యూట్యూబ్‌లో విడుదల చేయగా అభిమానులను ఆకట్టుకుంది. దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో కలసి 'ఇనిమేల్' పేరుతో ఓ స్పెషల్ సాంగ్ చేశారు. ఈ గీతానికి కమల్‌హాసన్ సాహిత్యం అందించారు. శ్రుతీ సంగీతం సమకూర్చారు. కమల్‌హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ నిర్మించింది. ప్రేమికుల మధ్య ఉండే అనుబంధాన్ని ఈ పాటలో ఆవిష్కరించిన తీరు అభిమానులను అలరించింది.





● ప్రస్తుతం రాజ్‌తరుణ్ కేసులో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు మాల్వీ మల్హోత్రా. తాజాగా ఆమె నటించిన ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ 'షహబానో' విడుదలైంది. ఈ సాంగ్‌కు యశ్ మాస్టర్ నృత్య రీతులు సమకూర్చారు. హిమాలయాల్లోని మంచు పర్వతాల్లో ఈ పాటను అద్భుతంగా చిత్రీకరించారు. ఈ పాటకు రెండో పార్ట్ కూడా ఉందని ప్రకటించారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి విడుదల చేశారు.

● తమిళంలో రజనీకాంత్, ధనుష్, విజయ్ లాంటి స్టార్స్ చిత్రాల్లో కథానాయికగా నటించి మెప్పించారు మాళవికా మోహనన్. ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న 'రాజాసాబ్' చిత్రంతో టాలీవుడ్‌కు కథానాయికగా ఆమె పరిచయమవుతున్నారు. ఓ వైపు సినిమాలతో బిజీగా ఉన్నా ఓ ప్రైవేట్ సాంగ్‌లో మెరిశారు మాళవిక. బాలీవుడ్‌లో ఈ అమ్మడు చేసిన 'తౌబా' సాంగ్ సన్సేషన్ సృష్టించింది. 60 మిలియన్లకు పైగా వ్యూస్‌ను ఈ పాట సొంతం చేసుకొంది.



● 'కలియుగంలో పట్టణం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన గుజరాతీ భామ ఆయుషి పటేల్. 'చూసుకో నీలోకి' అంటూ సాగే ఓ ప్రైవేట్ సాంగ్‌లో ఆమె మెరిశారు. హీరో త్రిగుణ్ ఈ గీతంలో ఆయుషికి జోడీగా కనిపించారు. కేరళలోని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించిన గీతం యూట్యూబ్‌లో చక్కటి ఆదరణ పొందుతోంది.

● రవితేజ హీరోగా వచ్చిన 'నేల టికెట్' చిత్రంతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమయ్యారు మాళవిక శర్మ. ఆ తర్వాత రామ్ సరసన 'రెడ్' చిత్రంలో కనిపించారు. రెండేళ్ల క్రితమే 'బారిషోంమే' అంటూ సాగే ఓ ప్రైవేట్ సాంగ్‌ను చేశారు. వర్షం నేపథ్యంలో ప్రేమికుల భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ పాట మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.

● కొన్నేళ్ల పాటు టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగిన గోవా బ్యూటీ ఇలియానా గతేడాది ఓ ప్రైవేట్ సాంగ్‌లో మెరిశారు. ఆల్బంసాంగ్స్ చేసే మంజిత్‌సింగ్, సుఖ్‌జిత్‌సింగ్‌తో కలసి 'సబ్ గజబ్' అనే సాంగ్ చేశారు ఇలియానా. ఇది యూట్యూబ్‌లో మంచి వ్యూయర్‌షిప్‌ను సొంతం చేసుకుంది.

కొత్త క్రిమినల్ చట్టాలు

కొత్త దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏళ్ల పైమాటే అయినా ఇంకా వలస పాలన కాలం నాటి వందేళ్లకు పైగా పాతవైన పురాతన శిక్షా స్మృతులనే భారతదేశం అనుసరిస్తోంది. నేరాలు సంతరించుకున్న ఆధునిక రూపును న్యాయవ్యవస్థ అందుకోలేకపోవడంతో ఫిర్యాదులు, సాక్ష్యాధారాల సేకరణ, నేర విచారణల్లో జాప్యం అనివార్యమౌతోంది. 'జస్టిస్ డిలేయ్‌డ్ ఈజ్, జస్టిస్ డినైడ్'(న్యాయం ఆలస్యమవడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే) అని లోకోక్తి. అందుకే పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మారాల్సి ఉంది. ఈ కోవలోనే క్రిమినల్ నేరాలకు సంబంధించిన మూడు ప్రధాన చట్టాలైన

'ఇండియన్ పీనల్ కోడ్'(భారతీయ శిక్షాస్మృతి),
'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'(నేర విచారణ స్మృతి),
'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్'(భారతీయ సాక్ష్యాధార చట్టం)లను పూర్తిగా సంస్కరించారు.

వీటిని ఆధునిక పేర్లతో 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తేదీ తరవాత జరిగిన అన్ని నేరాలకు ఈ నూతన చట్టాలు వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఆ చట్టాల్లో తెచ్చిన స్థూలమైన మార్పులకు సంబంధించిన ప్రధానాంశాలపై అవగాహన తప్పనిసరి.



భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023

ఇది ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో వచ్చిన అధునాతన చట్టం. గతంలో ఐపీసీలో 511 సెక్షన్‌లు ఉండగా ప్రస్తుతం బీఎన్ఎస్‌లో 356 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం 175 పాత సెక్షన్‌లను మార్చి 8 కొత్త సెక్షన్‌లు ప్రవేశపెట్టారు. 22 సెక్షన్‌లను సమూలంగా రద్దు చేశారు.

కీలకాంశాలు

బీఎన్ఎస్ ప్రకారం 'మూకదాడి'ని ఒక శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ విపులీకరించారు. అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది జాతి, మత, వర్గ తదితర ప్రాతిపదికల మీద విద్వేష పూరిత హత్య లేదా తీవ్రంగా గాయపరచినపుడు దానిని మూకదాడిగా పరిగణిస్తూ జీవితఖైదు లేదా మరణ శిక్ష విధిస్తారు.

రాజద్రోహం అనే నేరాన్ని శిక్షాస్మృతి నుంచి రద్దు చేసి 'దేశద్రోహం'అనే నేరాన్ని విశదీకరించి శిక్షార్హం చేశారు. టెర్రరిజం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడడం, అటువంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం; దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, భద్రత, సమగ్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను దేశ ద్రోహంగా పరిగణిస్తారు.

పద్దెనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో జరిపిన లైంగిక చర్యను ఆమె అంగీకారం ఉన్నప్పటికీ, వివాహిత అయినప్పటికీ లైంగికదాడిగానే పరిగణిస్తారు. దీనిని శిక్షార్హమైన నేరంగా సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారానికి మరణదండన విధించవచ్చు.

నిజాలను దాచి వివాహం చేసుకోవడం, మభ్య పెట్టడం; ఉద్యోగం, ప్రమోషన్ వంటి ప్రలోభాల ద్వారా లొంగదీసుకొని లైంగిక చర్య జరపడం వంటివాటిని నేరాలుగా పరిగణిస్తూ పదేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

స్నాచింగ్(బలవంతంగా లాక్కొనిపోవడం)ను దొంగతనంలో భాగంగా చూడడానికి బదులు ప్రత్యేక నేరంగా పరిగణిస్తూ ఈ శిక్షాస్మృతిలో చేర్చారు.

వ్యవస్థీకృత నేరాలు అనే ప్రత్యేక విభాగంలోకి కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, దోపిడీలు, భూకబ్జాలు, కాంట్రాక్ట్ హత్యలు, వాహనాల చోరీ వంటి వాటిని చేర్చారు. నేర తీవ్రతను అనుసరించి శిక్షలు విధిస్తారు.

ప్రభుత్వాధికారుల విధి నిర్వహణకు అడ్డుపడే నిమిత్తం చేసిన ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణిస్తారు.

ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి కొన్ని స్వల్ప నేరాలకు 'సామాజిక సేవ'ను శిక్షగా విధించడం వంటి వినూత్న అంశాలను కూడా ఈ నూతన న్యాయ స్మృతిలో చేర్చారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల మరణానికి కారణమవడం కూడా శిక్షార్హనేరంగా పరిగణించారు. ఈ నేరానికి రెండు నుంచి అయిదేళ్ల వరకు అదే వైద్యులకైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. తప్పుదోవ పట్టించే లేదా అసత్య వార్తలను ప్రచురించడం కూడా శిక్షార్హ నేరంగా సూచించారు. కొన్ని సెక్షన్లను ముఖ్యంగా బాలలకు సంబంధించిన అంశాలున్న వాటిని లింగ సమానత్వం దృష్ట్యా అన్ని లైంగిక వర్గాలకు వర్తించేలా సవరించారు. అసహజ లైంగిక చర్య నిర్వచనం నుంచి 'స్వలింగ సంపర్కం'ను తొలగించి దానిని నేరం కాదని తీర్మానించింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

విమర్శలు

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో బాలలు అంటే పద్దెనిమిదేళ్లలోపు వారిగా నిర్వచించడం వల్ల కొన్ని సెక్షన్ల అమలులో సందిగ్ధత తలెత్తనుంది. ఉదాహరణకు అత్యాచారం, సామూహిక అత్యాచారం వంటి అంశాల్లో వయో వ్యవధుల పరంగా సెక్షన్ల మధ్య సంఘర్షణ ఏర్పడవచ్చు.
- జస్టిస్ వర్మ కమిటీ సూచించిన విధంగా అత్యాచారాన్ని జెండర్ న్యూట్రల్(లింగసమానత)గా పరిగణించడం, మ్యారిటల్ రేప్‌ను నేరంగా సూచించడం వంటి అంశాలను నూతన న్యాయ సంహిత విస్మరించిందని; అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి పాత ఐపీసీలోని అంశాలనే కొనసాగించారనీ పలు వర్గాలు విమర్శిస్తున్నాయి.
- క్రిమినల్ రెస్పాన్సిబిలిటీ ఏజ్ అంటే ఒక చర్య నేరం అని గ్రహించే వయసును ఏడేళ్లుగా, మానసిక పరిపక్వత ఆధారంగా పన్నెండేళ్ల వరకూ పరిగణించే విధంగా నిర్ణయించడం అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రమాణాలతో విభేదించేలా ఉంది.
- కొన్ని సెక్షన్లలో తప్పనిసరి కనీస శిక్షను నిర్ణయించారు. ఇది న్యాయమూర్తుల విచక్షణాయుత తీర్పులకు ఆటంకం కావచ్చు.
- కమ్యూనిటీ సర్వీస్(సామాజిక సేవ)ను కొన్ని స్వల్ప తప్పిదాలకు శిక్షగా నిర్ధారించారు. అయితే ఒక చట్టం శిక్షల పరంగా ప్రతి అంశాన్నీ కూలంకశంగా వివరిస్తుంది. కానీ సామాజిక సేవ అంటే ఏంటో ఇతమిద్ధంగా ప్రస్తావించకపోవడం మాత్రం చట్టంలోని ప్రధాన లోపంగా చెప్పవచ్చు.
- క్లాజ్- 69లో మభ్యపెట్టడం, ప్రలోభ పెట్టడం ద్వారా లైంగిక చర్య జరపడం అనే అంశం సహజీవనం, పరస్పర అంగీకారం వంటి సందర్భాల్లోనూ దుర్వినియోగమయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి.
- అనేక నేరాలకు మరణ శిక్ష ఉండడం కూడా పెద్ద ఎత్తున మానవ హక్కుల వర్గాల నుంచి, ప్రపంచ వ్యాప్త హక్కుల సంస్థల నుంచి నిరసనలకు కారణమవుతోంది.
- వేర్పాటువాదం; దేశ సమగ్రతకు, ఐక్యతకు, భద్రతకు భంగం కలిగించడం వంటి దేశద్రోహ నిర్వచన అంశాలు ప్రత్యేక రాష్ట్రాల వాదనలను, హక్కుల కోసం జరిపే నిరసనలను కూడా ఈ నేరపరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ
అవస్థాపన సౌకర్యాలు

● ఎకానమీ

ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే రవాణా, విద్యుత్, నీటిపారుదల, సమాచారం మొదలైన వాటిని ఆర్థిక అవస్థాపన సౌకర్యాలు అంటారు. వైద్యాన్ని సామాజిక అవస్థాపన సౌకర్యాలని అంటారు. ఆర్థికాభివృద్ధి కోసం అవసరమైతే బడ్జెట్‌లో 40 శాతం నిధులను అవస్థాపన సౌకర్యాల అభివృద్ధికి కేటాయించాలని సూచించిన ఆర్థికవేత్తలు కూడా ఉన్నారు.

ఆర్థికాభివృద్ధి రెండు కోణాల్లో జరిగే అవకాశం ఉంది. ఒకటి అవస్థాపనా సౌకర్యాలు అభివృద్ధి చెందితే ఉత్పాదక కార్యకలాపాలు అభివృద్ధి జరగడం. రెండోది ఉత్పాదక కార్యకలాపాలు విస్తరిస్తే ఒత్తిడితో అవస్థాపన సౌకర్యాలు అభివృద్ధి జరగడం. సాధారణంగా ప్రభుత్వాలు అవస్థాపన సౌకర్యాలు అభివృద్ధి పరచడం ద్వారా ఉత్పాదక కార్యకలాపాల విస్తరణను ప్రోత్సహిస్తాయి.

ముఖ్యాంశాలు

- తెలంగాణలో మొత్తం 1,09,260 కి.మీ. రహదారి మార్గం ఉంది. ఇందులో 51శాతం డాంబర్ రోడ్డు(బ్లాక్ టాప్) ఉంది.
- రాష్ట్రంలో 1.51 కోట్ల వాహనాలున్నాయి. అందులో 85 శాతం కార్లు, ద్విచక్ర వాహనాలున్నాయి.
- రాష్ట్రంలో మొత్తం 18,069 మె.వా.(ఎండబ్ల్యూ) స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉంది. అందులో 50 శాతం కంటే ఎక్కువ థర్మల్ విద్యుత్ సామర్థ్యం ఉంది.
- రాష్ట్రంలో మొత్తం 174.03 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో గృహ రంగ విద్యుత్ కనెక్షన్లు 72.15 శాతం.
- తెలంగాణ మొత్తంలో 4.08 కోట్ల టెలిఫోన్ కనెక్షన్లు(సబ్‌స్క్రైబర్లు) ఉండగా, అందులో 98 శాతం వైర్‌లెస్ కనెక్షన్లు ఉన్నాయి.
- మిషన్ భగీరథ ద్వారా శుద్ధిచేసిన ఉపరితల సురక్షిత తాగే నీటి సౌకర్యం 23,975 గ్రామాల్లో, 121 పట్టణాల్లో, 23,517 పాఠశాలల్లో, 27,257 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంది.

రవాణా వ్యవస్థ

రోడ్డు రవాణా: తెలంగాణ రహదారులను జాతీయ, రాష్ట్ర, భవనాల శాఖ నిర్వహణలో ఉన్నవి, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఆధ్వర్యంలో ఉన్న గ్రామీణ రహదారులు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న రహదారులని విభజించవచ్చు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 1,09,260 కి.మీ. రహదారి మార్గంలో 61.80 శాతం గ్రామీణ రహదారులు, 25.39 శాతం రాష్ట్ర రహదారులు, జిల్లా రహదారులు(రోడ్లు, భవనాలశాఖ నిర్వహణలో ఉన్నవి), 8.25 శాతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్నవి ఉండగా జాతీయ రహదారులు 4.56 శాతం ఉన్నాయి.



2021-22 సంవత్సరంలో తెలంగాణలో ఉన్న వివిధ రకాల రహదారి మార్గాల దూరాన్ని పట్టికలో చూడవచ్చు.

రహదారి రకం	కి.మీ.
1. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖ నిర్వహణలో ఉన్న గ్రామీణ రహదారి	67,527
2. రోడ్లు, భవనాలశాఖ నిర్వహణలో	27,737
3. జీహెచ్ఎంసీ నిర్వహణలో	9,013
4. జాతీయ రహదారి	4,983
5. మొత్తం రహదారి దూరం	1,00,260

రాష్ట్రంలో ఉన్న జాతీయ రహదారిని మినహాయిస్తే మొత్తం రహదారుల దూరం 1,04,277 కి.మీ. అందులో 51 శాతం డాంబరు(బ్లాక్ టాప్) రోడ్లు, 30 శాతం మట్టిరోడ్లు, 10 శాతం సిమెంటు రోడ్లు, 9 శాతం కంకరరోడ్లు ఉన్నాయి.

జిల్లాల వారీగా చూస్తే 7,714 కి.మీ. రోడ్డుతో రంగారెడ్డి జిల్లా మొదటిస్థానంలో ఉంది. 7,529 కి.మీ.తో నల్లగొండ జిల్లా రెండోస్థానంలో ఉంది.

రహదారుల సాంద్రత

2021-22 సంవత్సరంలో తెలంగాణలో ప్రతి వంద చదరపు కిలోమీటరుకు 97.49 కి.మీ.ల రహదారి ఉంది. అయితే జిల్లాలను చూస్తే హైదరాబాద్ జిల్లాలో ప్రతి వంద చదరపు కిలోమీటరుకు 1332.7 కి.మీ. రహదారి ఉంది. ఇక రెండోస్థానంలో మేడ్చల్-మల్కాజిగిరి, మూడోస్థానంలో రంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి.

వాహనాలు

2022 నవంబరు నాటికి రాష్ట్రంలో 1,51,13,129 వాహనాలు ఉన్నాయి. అందులో 73 శాతం ద్విచక్ర వాహనాలు, 13.6 శాతం కార్లు, మరో 13.6 శాతం ఇత వాహనాలున్నాయి.

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ

తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు, సరిహద్దు రాష్ట్రాలకు మొత్తం 9097 బస్సులను నడుపుతుంది. అందులో 6,479 సొంత బస్సులు కాగా 6,479 అద్దె బస్సులు ఉన్నాయి.

మొత్తం బస్సుల్లో 68 శాతం గ్రామీణ ప్రాంతాలో సేవలందిస్తాయి. సంస్థలో 44,648 మంది ఉద్యోగులు ఉన్నారు. 21 డివిజన్లు, 99 డిపోలు ఉన్నాయి. దాదాపు 54 లక్షలమంది సగటున ప్రతి రోజు ప్రయాణిస్తారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

2023 డిసెంబరు 9 నుంచి తెలంగాణ మహిళలందరికీ తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ నడిపే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో కూడా ఈ సౌకర్యం ఉంది. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్‌లకు ఈ పథకం వర్తిస్తుంది. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు.





డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

హైదరాబాద్ మెట్రో రైలు

పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రపంచంలోనే అతి పెద్దదైన హైదరాబాద్ మెట్రో రైలు నగరంలో 69 కి.మీ.లో సేవలు అందిస్తున్నది. రెండో దశలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రోను హైదరాబాద్ ఐటీ. జంక్షన్ మైండ్‌స్పేస్ నుంచి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు(31 కి.మీ.)నిర్మించాలనుకున్నారు. దాదాపు రూ.6,250 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టును 2026 నాటికి పూర్తిచేయాలనుకున్నారు. అయితే 2023 డిసెంబరు 13న ఈ ప్రాజెక్టును ప్రభుత్వం కొన్ని కారణాల రీత్యా నిలుపుదల చేశారు.



రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తెలంగాణలోని ప్రధాన విమానాశ్రయమైన రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోని 65 ప్రదేశాలకు, అంతర్జాతీయంగా 17 ప్రదేశాలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నది.

2023లో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సిఐఐ) 'శక్తి వనరుల సమర్థ వినియోగం'కు ఇచ్చే 24వ జాతీయ అవార్డుల ఉత్సవంలో శక్తి వనరులను అద్భుతమైన సామర్థ్యంలో నిర్వహించిన సంస్థగా 'జాతీయ ఎనర్జీ లీడర్'గా రెండు అవార్డులను మరోసారి గెలుచుకుంది. శక్తి వనరులను అద్భుత సామర్థ్యంతో నిర్వహించిన సంస్థ అవార్డును ఏడుసార్లు 'జాతీయ ఎనర్జీ లీడర్' అవార్డును అయిదుసార్లు గెలిచిన సంస్థగా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నిలిచింది.

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

దిశలు - దూరాలు

● రీజనింగ్

పార్ట్-2

ముఖ్యరేఖాచిత్రం


1. సుమ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లాలనుకున్నది. ఆమె తన ఇంటి నుంచి ఉత్తర దిశగా బయలుదేరింది. కొంత సమయం తరవాత ఎడమవైపునకు తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి పాఠశాలకు చేరుకున్నది. అయితే ఆమె ఇంటి నుంచి పాఠశాల ఏ దిశలో ఉంది?

ఎ) ఈశాన్యం బి) నైరుతి సి) ఆగ్నేయం డి) వాయువ్యం

సమాధానం: (డి)

వివరణ:

R- బయలుదేరినస్థానం (ఇల్లు)
S- చేరుకొనినస్థానం (పాఠశాల)




పై రేఖాచిత్రం ప్రకారం సుమ, ఇంటి నుంచి పాఠశాల వాయువ్య దిశలో ఉన్నదని తెలుస్తుంది.

2. 100 కి.మీ. పొడవు గల ఒక రోడ్డుపై రెండు కార్లు చెరొకవైపు నుంచి వ్యతిరేక దిశలలో ప్రయాణిస్తున్నాయి. మొదటికారు 20 కి.మీ. ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 10 కి.మీ. ప్రయాణించింది. తదుపరి ఎడమవైపు తిరిగి 20 కి.మీ. ప్రయాణించిన తదుపరి ఎడమవైపునకు తిరిగి ప్రధాన రహదారి కి చేరుకున్నది. రెండో కారు చిన్న లోపం వల్ల 15 కి.మీ. మాత్రమే ప్రయాణించి ఆగిపోయింది. అయితే ఇప్పుడు రెండు కార్ల మధ్య దూరం ఎంత?

ఎ) 35 కి.మీ. బి) 45 కి.మీ. సి) 30 కి.మీ. డి) 40 కి.మీ.

సమాధానం: (బి)

వివరణ:



I- మొదటి కారు
II- రెండవ కారు

పై రేఖాచిత్రం ప్రకారం మొదటి కారు ప్రధాన రహదారికి చేరుకున్న తరవాత గమనించిన మొదటికారు ప్రధాన రహదారి పరంగా 40 కి.మీ. దూరాన్ని పూర్తి చేసుకున్నది. రెండో కారు అదే ప్రధాన రహదారి పరంగా మరొకవైపు నుంచి 15 కి.మీ. పూర్తి చేసినది. ఈ రెండింటిని కూడి మొత్తం నుంచి తీసివేస్తే రెండుకార్ల మధ్య దూరం తెలుస్తుంది.


100-(40+15) = 100-55=45 కి.మీ. సమాధానం అవుతుంది.

3. A, B, C, D, E అనే అయిదుగురు వ్యక్తులు ఒక వరుసలో నిల్చున్నారు. E అనే వ్యక్తి Bకి ఎడమవైపు 40మీ. దూరంలో ఉన్నాడు. A అనే వ్యక్తి Cకి ఎడమవైపు 20మీ. దూరంలో ఉన్నాడు. D అనే వ్యక్తి Eకి కుడివైపు 20మీ. దూరంలోను, Cకి కుడివైపు 50మీ. దూరంలోను ఉన్నాడు. అయితే A, Bల మధ్య దూరం ఎంత?

ఎ) 90 మీ. బి) 60 మీ. సి) 70 మీ. డి) 80 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:




పై వివరణ ఆధారంగా A, Bల మధ్య దూరం 90 మీ. అని తెలుస్తుంది.

4. ఒక బాలుడు సైకిల్‌పై తూర్పునకు కొంత దూరం ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 2 కి.మీ. ప్రయాణించాడు. తదుపరి మరల కుడివైపునకు తిరిగి 3 కి.మీ. ప్రయాణించాడు. ఇప్పుడు అతను బయలుదేరిన స్థానం నుంచి దక్షిణంగా కచ్చితంగా 2 కి.మీ. దూరంలో ఉన్నాడు. అయితే ఆ బాలుడు మొదట్లో తూర్పునకు ఎంతదూరం ప్రయాణించాడు?

ఎ) 2 కి.మీ. బి) 4 కి.మీ. సి) 3 కి.మీ. డి) 5 కి.మీ.

సమాధానం: (సి)

వివరణ:




బయలుదేరిన స్థానానికి, చేరుకున్న స్థానం 2 కి.మీ. దూరంలో దక్షిణాన ఉంది. కాబట్టి పై డయాగ్రామ్‌ను పరిశీలిస్తే ఆ బాలుడు సైకిల్‌పై మొదట్లో తూర్పునకు 3 కి.మీ. ప్రయాణించాడని తెలుస్తుంది.

5. అనంద్ మ్యూజియానికి వెళ్లాలనుకున్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు దక్షిణదిశలో ఉంది. ఆ రోడ్డు కూడలి లేదా చౌరస్తాకు వచ్చిన తరవాత కుడివైపున పాఠశాల, ఎడమవైపున ఆటస్థలం ఉన్నది. అయితే మ్యూజియం ఏ దిశలో ఉంది?

ఎ) తూర్పు బి) పడమర సి) దక్షిణం డి) ఉత్తరం

సమాధానం: (డి)

వివరణ:




ఇటువంటి ప్రశ్నలలో ముఖ్య దిశలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)లో మిగిలి ఉన్నదే సమాధానం అవుతుంది.

6. సూర్యోదయం తరవాత విక్రమ్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలుచున్నాడు. స్తంభం నీడ విక్రమ్‌కు కుడివైపున ఉన్నది అనుకుంటే విక్రమ్ ఇప్పుడు ఏ దిక్కును చూస్తూ నిలుచున్నాడు?

ఎ) పడమర బి) ఉత్తరం సి) తూర్పు డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ: నీడ ప్రశ్నల్లో గుర్తించుకోండి. నీడ ఎప్పుడైనా సరే సూర్యునికి వ్యతిరేక దిశలో ఉంటుంది. అంటే ఉదయం సూర్యుడు తూర్పున ఉంటారు కాబట్టి ఉదయం పూట ఏదైనా వస్తువు నీడ, వ్యక్తి నీడ చెట్టునీడ గాని మరే నీడైనా గాని పడమర ఉంటుంది. సాయంత్రం పూట సూర్యుడు పడమర వైపున ఉంటాడు. (అస్తమించే సమయంలో) కాబట్టి సాయంత్రం పూట ఏ నీడైనా తూర్పున ఉంటుంది. గుర్తుంచుకోండి నీడ సూర్యునికి వ్యతిరేకంగా ఉంటుంది.



ఇప్పుడు ప్రశ్నలో నీడ విక్రమ్‌కు కుడివైపునకు ఉంది అని ఉన్నది. ఉదయంపూట కాబట్టి నీడ పడమరకు ఉంటుంది. దక్షిణమునకు కుడి వైపు పడమర అంటే విక్రమ్ దక్షిణానికి చూస్తూ నిలబడితే అతని కుడివైపు(పడమర) స్తంభం నీడ కలదని అర్థం. విక్రమ్ కిందికి అనగా దక్షిణ దిక్కును చూస్తున్నాడు. ఇప్పుడు విక్రమ్‌కి కుడివైపు అంటే పడమర వైపు స్తంభం నీడ ఉంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

బిజినెస్

వరంగల్ ● సోమవారం 15 జూలై 2024

బడ్జెట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు !

బీమా కంపెనీల నుంచి ఇతర ఫైనాన్షియల్ ఉత్పత్తులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 1938 నాటి బీమా చట్టాన్ని సమూలంగా మార్చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సవరణ బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. బీమా కంపెనీలకు కాంపోజిట్ లైసెన్సులు జారీ చేయడం, కంపెనీలను బట్టి మూలధన వర్గీకరణ, సాల్వెన్సీ నిబంధనల సడలింపు, క్యాప్టివ్ లైసెన్స్, పెట్టుబడి నిబంధనల మార్పు, ఇంటర్మీడియరీస్ అందరికీ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్, బీమా కంపెనీలు ఇతర ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌నీ మార్కెట్ చేసే స్వేచ్ఛకు సంబంధించి ఈ సవరణలు ఉంటాయని సమాచారం. 2047 నాటికి అందరికీ బీమా అనే లక్ష్యం సాకారం కావాలంటే ఈ సవరణలు తప్పవని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

బ్యాంకుల్లానే బీమా కంపెనీలు

ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో యూనివర్సల్ బ్యాంక్, స్మాల్ ఫైనాన్షియల్ బ్యాంక్, పేమెంట్‌బ్యాంక్ పేరుతో మూడు రకాల బ్యాంకులు ఉన్నాయి. బీమా రంగంలోనూ మూలధనాన్ని బట్టి ప్రత్యేక బీమా కంపెనీలను అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాంపోజిట్ లైసెన్స్ ద్వారా జీవిత బీమా కంపెనీలు జీవిత బీమా పాలసీలతో పాటు ఆరోగ్య బీమా పాలసీలు, మోటార్, ఫైర్ వంటి జనరల్ ఇన్సూరెన్స్ పాలసీలను మార్కెట్ చేసేందుకు అనుమతించాలని యోచిస్తోంది. దీంతో మరిన్ని కంపెనీలు బీమాలోకి వస్తాయని భావిస్తోంది.

రిటైల్ డిజిటల్ చెల్లింపుల జోరు..

2030 నాటికి రూ.600 లక్షల కోట్లకు చేరే చాన్స్.. ప్రస్తుతం రూ.300 లక్షల కోట్ల స్థాయిలో

కెర్నీ-అమెజాన్ పే నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: జేబులో సరిపడా చిల్లర లేదా? అయినా ఇబ్బంది లేదు. మీ మొబైల్ ఫోన్‌లో ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే ఉంటే చాలు. జేబులో పైసా లేకపోయినా.. కావలసిన వస్తువులు కొని డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. అది ఆన్‌లైన్ కావచ్చు. ఆఫ్‌లైన్ కావచ్చు. దేనికైనా సరే అవసరమైన వస్తువులు కొని నింపాదిగా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ఇప్పుడు తోపుడు బండ్ల మీద కూరగాయలు, పండ్లు, పూలు అమ్మే వీధి వ్యాపారులు కూడా డిజిటల్ చెల్లింపులకు మారిపోయారు. దీంతో 2018లో మన దేశంలో 30,000 కోట్ల డాలర్లుగా ఉన్న రిటైల్ డిజిటల్ చెల్లింపులు గత ఏడాది 3.6 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.300 లక్షల కోట్లు) చేరాయి. మరో ఆరేళ్లలో అంటే 2030 నాటికి ఈ చెల్లింపులు 7 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరతాయని కెర్నీ-అమెజాన్ పే సంస్థలు 'హౌ అర్బన్ ఇండియా పేస్' పేరుతో రూపొందించిన నివేదికలో తెలిపాయి. ప్రస్తుత డాలర్-రూపాయి మారక రేటు ప్రకారం ఇది దాదాపు రూ.600 లక్షల కోట్లకు సమానం.

ఆన్‌లైన్ కొనుగోళ్లే ఊతం: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ సైట్ల ద్వారా చేసే కొనుగోళ్లు రిటైల్ డిజిటల్ చెల్లింపులకు బాగా ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం ఈ కొనుగోళ్లకు చేసే చెల్లింపుల్లో 90 శాతం డిజిటల్ చెల్లింపులే. సంపన్న వినియోగదారులైతే తమ ఆన్‌లైన్ కొనుగోళ్లకు నగదు కంటే డిజిటల్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నట్టు నివేదిక తెలిపింది. ఇక ఆఫ్‌లైన్ చెల్లింపుల్లోనూ డిజిటల్ చెల్లింపులదే హవా. పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లోనూ ఇప్పుడు డిజిటల్ చెల్లింపులను అనుమతిస్తున్నారు. మిలీనియల్స్, జెనరేషన్ ఎక్స్, స్త్రీలు-పురుషులనే తేడా లేకుండా ప్రస్తుతం అందరూ డిజిటల్ చెలింపులకే మొగ్గు చూపుతున్నట్టు కెర్నీ-అమెజాన్ పే తెలిపింది.

ప్రపంచంలో 46 శాతం వాటా

ప్రస్తుతం ప్రపంచ డిజిటల్ చెల్లింపుల్లో భారత్‌దే హవా. 2022లో ప్రపంచంలో జరిగిన డిజిటల్ చెల్లింపుల్లో 46 శాతం మన దేశంలోనే జరిగాయి. దీన్నిబట్టి మన దేశంలో డిజిటల్ చెల్లింపులు ఎంత ప్రాచుర్యం పొందాయో ఊహించుకోవచ్చు. చిన్నచిన్న పట్టణాల్లో 65 శాతం, పెద్దపెద్ద నగరాల్లో జరిగే చెల్లింపుల్లో 75 శాతం డిజిటల్ చెల్లింపులని కెర్నీ-అమెజాన్ పే నివేదిక తెలిపింది. అయితే బ్యాండ్‌విడ్త్ చాలినంత లేకపోవడం, పెరిగిపోతున్న సైబర్ మోసాలు రిటైల్ డిజిటల్ చెల్లింపులకు పెద్ద సవాల్‌గా మారాయి.

యూపీఐతో మరింత జోరు: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)తో డిజిటల్ చెల్లింపులు మరింత జోరందుకున్నాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశంలో యూపీఐ చెల్లింపులు 138 శాతం పెరిగాయి. ప్రస్తుతం కార్డులు, డిజిటల్ వాలెట్ల చెల్లింపులు కూడా క్రమంగా ప్రజల్లో మంచి ఆదరణ పొందుతున్నాయి. మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో వీటి వాటా ప్రస్తుతం 10 శాతం వరకు ఉంటుందని నివేదిక తెలిపింది.

గెయిల్ మాజీ చైర్మన్ ప్రసాద్ కన్నుమూత



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని గెయిల్ (ఇండియా) మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) డాక్టర్ సీఆర్ ప్రసాద్ (83) మరిక లేరు. ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ఆయన శనివారం రాత్రి కన్నుమూశారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేసిన ఆయన నాగర్జునసాగర్ డ్యామ్ నిర్మాణంలో ఇంజనీర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తర్వాత కొంతకాలం నెల్లూరు థర్మల్ పవర్ స్టేషన్‌లోనూ పని చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి మారి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1994లో గెయిల్ ఏర్పాటు చేసిన కొత్తలో ఆ సంస్థ మార్కెటింగ్ అండ్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్‌గా చేరారు. తర్వాత 1996 సెప్టెంబరులో గెయిల్ (ఇండియా) సీఎండీగా బాధ్యతలు చేపట్టి 2001 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఇంధన రంగంలో అపార అనుభవం ఉన్న ప్రసాద్.. ఇంద్రప్రస్థ గ్యాస్, మహానగర్ గ్యాస్ కంపెనీల ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారు. కార్పొరేట్ రంగంలో సీఆర్‌పీగా సుపరిచితులైన ఆయన ప్రభుత్వ రంగంలోని పలు ఇంధన సంస్థల ప్రముఖులకు గురుతుల్యులు.

24,750 పైన బుల్లిష్

(జూలై 15-19 తేదీల మధ్య వారానికి)

అస్ట్రో టెక్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,194-24,592 పాయింట్ల మధ్యన కదలాడి 178 పాయింట్ల లాభంతో 24,502 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,750 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,374, 24,333, 24,209, 23,815 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,800 బ్రేక్‌డౌన్ స్థాయి: 24,100
నిరోధ స్థాయిలు: 24,600, 24,700, 24,800
(24,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,300, 24,200, 24,100
(24,400 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	122
కర్నూలు	110	నెల్లూరు	122
విశాఖపట్నం	107	అనంతపురం	115
గోదావరి	115		

ఆర్థిక ఫలితాలతోనే దిశ!

ఈ వారం స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సాధారణంగా బడ్జెట్‌కు ముందు మార్కెట్లో దిద్దుబాటు జరుగుతుంది. ఈసారి కూడా అదే సరళి కొనసాగొచ్చు. మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, గ్లోబల్ ట్రెండ్స్ కూడా మార్కెట్ల గమనాన్ని నిర్దేశించే వీలుంది. ఈ వారం నిఫ్టీకి 24,450 వద్ద మద్దతు, 24,600 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఆర్థిక ఫలితాల సీజన్ మొదలు కావటంతో ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం బెటర్. ఈ వారం ఐటీ షేర్లు జోరును ప్రదర్శించే వీలుంది. బుధవారం మొహర్రం సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు. దీంతో ఈ వారం మార్కెట్లు నాలుగు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఐఆర్‌సీటీసీ: గత వారం రైల్వే షేర్లు పరుగులు పెట్టాయి. ఇదే రంగానికి చెందిన ఈ షేరు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. రూ.1,050 వద్ద నిరోధాన్ని అధిగమిస్తే మరింత పైకి వెళ్లడం ఖాయం. కన్సాలిడేషన్ ఆఖరి దశకు చేరుకుంది. గత శుక్రవారం ఈ షేరు 1.33 శాతం లాభంతో రూ.1,043 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,020/1,040 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,075/1,110 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.999 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జీఎంటర్‌టైన్‌మెంట్: ఈ కౌంటర్‌లో కొంత మూమెంటమ్ కనిపిస్తోంది. ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉన్న ఈ షేరులో మంచి బేస్ ఏర్పడుతోంది. టర్న్ అరౌండ్ జరిగే అవకాశాలున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 5.65 శాతం లాభంతో రూ.155 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.155/153 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.165/180 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.150 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండస్‌ఇండ్ బ్యాంక్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈ బ్యాంక్ డిపాజిట్లు, రుణాల్లో వృద్ధి కనిపిస్తోంది. ఆర్థిక ఫలితాల అనంతరం ఈ షేరు ధర పుంజుకోవచ్చు. కొన్ని నెలలుగా ఈ కౌంటర్ సైడ్‌వేస్‌లో చలిస్తోంది. ప్రస్తుతం ఈ షేరు ప్రధాన మద్దతు స్థాయి రూ.1,425ని అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 5.75 శాతం లాభంతో రూ.1,435.50 వద్ద క్లోజైంది. స్వింగ్ ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.1,420/1,400 స్థాయిల్లో ఎంటరై రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.అయితే రూ.1,380 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టెక్ మహీంద్రా: ఈ స్టాక్‌కు చాలా సానుకూలతలు ఉన్నాయి. మరోవైపు ఐటీ సూచీ సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరింది. మళ్లీ ఐటీ కంపెనీలకు ఆర్డర్లు పెరుగుతున్నాయి. మార్కెట్ అంచనాలను మించి ఫలితాలు విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ షేరు ఇప్పటికే 52 వారాల గరిష్ఠాన్ని అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 3 శాతం లాభంతో రూ.1,505 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,490/ 1,500 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,565/1,620 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రైట్స్: ఈ స్టాక్ ప్రైస్ యాక్షన్ చాలా బాగుంది. కొన్నాళ్లుగా సైడ్‌వేస్‌లో చలిస్తోంది. బ్రేకౌట్‌కు రెడీ అవుతోంది. చివరి వారం ట్రేడింగ్ వాల్యూమ్ బాగా పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు 6.85 శాతం లాభంతో రూ.771 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.770/760 శ్రేణిలో ఎంటరై రూ.790/840 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.745 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

తదుపరి నిరోధం 24,600

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 24,500 వరకు వెళ్లి రియాక్షన్‌కు గురయింది. కరెక్షన్ తర్వాత కూడా ఇండెక్స్ 24,150 వద్ద రికవరీ సాధించి వారం మొత్తం మీద 180 పాయింట్ల లాభంతో చివరికి 24,500 స్థాయికి చేరువలో క్లోజయింది. వరుసగా తొమ్మిది వారాలుగా ర్యాలీలో పరుగెడుతున్న నిఫ్టీ జూన్ నాలుగో తేదీ నాటి మహాపతనంలో ఏర్పడిన ఇంట్రాడే కనిష్ఠ స్థాయి 21,300 నుంచి 3,300 పాయింట్ల మేరకు లాభపడింది. అక్కడక్కడా మైనర్ రియాక్షన్లు ఏర్పడుతున్నప్పటికీ ప్రతి మద్దతు స్థాయిలోనూ రికవరీ కొనసాగిస్తోంది. మిడ్‌క్యాప్-100 సూచీ 60 పాయింట్ల స్వల్ప నష్టంతో క్లోజ్ కాగా స్మాల్‌క్యాప్-100 సూచీ స్వల్పంగా 7 పాయింట్ల మేరకు లాభపడింది. నిఫ్టీ ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు నమోదు చేస్తూ పరుగులు తీస్తున్న కారణంగా కరెక్షన్ ఏర్పడవలసి ఉంది. గరిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. గత శుక్రవారం 24,600 వద్ద నిరోధం ఏర్పడినందు వల్ల ఈ వారంలో ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకుని అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుందా, లేదా వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ 24,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన సరికొత్త గరిష్ఠ స్థాయిల్లో ప్రవేశిస్తుంది. మానసిక అవధులు 24,800, 25,000.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌లో పడినా భద్రత కోసం మైనర్ మద్దతు స్థాయి 24,400 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనత మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 24,200, 24,000.

బ్యాంక్ నిఫ్టీ: గత మూడు వారాలుగా 53,000 స్థాయిలో నిరోధం ఎదుర్కొంటున్న ఈ సూచీ గత వారం 52,280 వద్ద ముగిసింది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్లయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 52,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 53,100. బలహీనత ప్రదర్శించి ప్రధాన మద్దతు స్థాయి 52,000 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ 24,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే బలహీనత మరింతగా కొనసాగవచ్చు. గత శుక్రవారంనాడు బుధవారం నాటి టాప్ వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉంది. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,600, 24,655
మద్దతు	24,460, 24,400

ఘనంగా ముగించారు

- 4-1తో సిరీస్ నెగ్గిన భారత్
- పేసర్ ముకేశ్‌కు నాలుగు వికెట్లు
- ఐదో టీ20లోనూ జింబాబ్వే చిత్తు





సంజూ (58)

హరారే: సిరీస్ చివరి మ్యాచ్‌లోనూ యువ భారత్ నుంచి అదే జోరు. సంజూ శాంసన్ (45 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 58) అర్ధసెంచరీకి తోడు.. పేసర్ ముకేశ్ (4/22) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో ఆకట్టుకోవడంతో ఆఖరిదైన ఐదో టీ20లో భారత్ 42 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే సిరీస్‌ను సైతం 4-1తో ఘనంగా ముగించింది. ఆదివారం జరిగిన ఈ నామమాత్రపు మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసింది. దూబే (26), పరాగ్ (22) రాణించారు. ముజరబానికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. పేసర్ ముకేశ్ (4/22) ఆరంభ, చివర్లో దెబ్బతీయగా... మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టడి చేశారు. దీంతో 18.3 ఓవర్లలో 125 రన్స్‌కే ఆలౌటైంది. మైర్స్ (34), మరుమని (27) మాత్రమే ఆకట్టుకోగా, డెత్ ఓవర్లలో ఫరాజ్ (27) వేగంగా ఆడి ఓటమి తేడాను తగ్గించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దూబే 26 పరుగులు చేయడమే గాక, రెండు వికెట్లు తీశాడు. అలాగే సిరీస్‌లో 8 వికెట్లతో రాణించిన వాషింగ్టన్ సుందర్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు.

ఆదుకున్న శాంసన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో ఈసారి దూకుడు తగ్గింది. టాపార్డర్ విఫలం కాగా, సంజూ శాంసన్ ఒక్కడే సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతడికి పరాగ్ సహకారంతో పాటు చివర్లో దూబే మెరుపులు తోడయ్యాయి. దీంతో స్కోరు 160 దాటగలిగింది. చివరి మ్యాచ్‌లో అజేయంగా చెలరేగిన ఓపెనర్ జైస్వాల్ (12) తొలి ఓవర్‌లోనే వెనుదిరిగాడు. మూడో ఓవర్‌లో అభిషేక్ (14) సిక్సర్, గిల్ రెండు ఫోర్లతో 16 రన్స్ వచ్చాయి. కానీ ఆ తర్వాత వరుస ఓవర్లలో ఇద్దరూ పెవిలియన్‌కు చేరారు. పవర్‌ప్లేలో 44/3 స్కోరుతో నిలిచిన జట్టును మధ్య ఓవర్లలో శాంసన్-పరాగ్ జోడీ ఆదుకుంది. 12వ ఓవర్‌లో శాంసన్ రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించాడు. ఇందులో తొలి సిక్సర్ అయితే ఏకంగా 110మీ. దూరం వెళ్లి స్టేడియం బయటపడింది. అయితే జట్టు స్కోరు వంద పరుగులు దాటాక 15వ ఓవర్‌లో పరాగ్‌ను మవుట అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు 39 బంతుల్లో కెరీర్‌లో రెండో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న శాంసన్ కూడా స్వల్ప వ్యవధిలోనే వెనుదిరిగాడు. ఈ దశలో దూబే చెలరేగి 18వ ఓవర్‌లో 4,6,4తో విలువైన రన్స్ అందించినా.. ఆఖరి ఓవర్ తొలి బంతికే రనౌట్‌గా వెనుదిరిగాడు. కానీ చివరి రెండు ఓవర్లలో దూబే, రింకూ (11 నాటౌట్) ఆటతీరుతో జట్టు 30 పరుగులు సాధించగలిగింది.

ఒక్క బంతికి 13 రన్స్

ఓపెనర్ జైస్వాల్ ఒక్క బంతికే 12 పరుగులు సాధించి రికార్డు నెలకొల్పాడు. భారత ఇన్నింగ్స్ మొదటి బంతికే స్పిన్నర్ రజా ఫుల్‌టాస్ బంతి వేయగా జైస్వాల్ సిక్సర్ బాదాడు. దీన్ని అంపైర్ నోబాల్‌గా ప్రకటించడంతో, తర్వాతి ఫ్రీహిట్ బాల్‌ను సైతం జైస్వాల్ సిక్సర్‌గా మలిచాడు. దీంతో ఒక్క లీగల్ డెలివరీకి జట్టుకు 13 పరుగులు రాగా.. అటు జైస్వాల్ 12 రన్స్ సాధించినట్టయ్యింది. అలాగే పురుషుల టీ20ల్లో ఈ ఫీట్ సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (బి) రజా 12; గిల్ (సి) రజా (బి) ఎన్‌గరవ 13; అభిషేక్ (సి) మదండె (బి) ముజరబాని 14; శాంసన్ (సి) మరుమని (బి) ముజరబాని 58; పరాగ్ (సి) ఎన్‌గరవ (బి) మవుట 22; దూబే (రనౌట్) 26; రింకూ (నాటౌట్) 11; సుందర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 167/6. వికెట్ల పతనం:** 1-13, 2-38, 3-40, 4-105, 5-135, 6-153; **బౌలింగ్:** రజా 4-0-37-1; ఎన్‌గరవ 4-0-29-1; ఫరాజ్ 4-0-39-0; ముజరబాని 4-0-19-2; మవుట 4-0-39-1.

జింబాబ్వే: మదెవెరె (బి) ముకేశ్ 0; మరుమని (ఎల్బీ) సుందర్ 27; బెన్నెట్ (సి) దూబే (బి) ముకేశ్ 10; మైర్స్ (సి) అభిషేక్ (బి) దూబే 34; రజా (రనౌట్) 8; క్యాంప్‌బెల్ (సి) తుషార్ (బి) దూబే 4; మదండె (సి) శాంసన్ (బి) అభిషేక్ 1; ఫరాజ్ (సి) శాంసన్ (బి) ముకేశ్ 27; మవుట (సి అండ్ బి) తుషార్ 4; ముజరబాని (నాటౌట్) 1; ఎన్‌గరవ (బి) ముకేశ్ 0; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 18.3 ఓవర్లలో 125 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-15, 3-59, 4-85, 5-87, 6-90, 7-94, 8-120, 9-123, 10-125; **బౌలింగ్:** ముకేశ్ 3.3-0-22-4; తుషార్ 3-0-25-1; బిష్ణోయ్ 3-0-23-0; సుందర్ 2-0-7-1; అభిషేక్ 3-0-20-1; దూబే 4-0-25-2.

స్పోర్ట్స్

నిలకడే మంత్రంగా..



బిగ్-3 తర్వాత ఎవరు అనే ప్రశ్న చాలా కాలంగా అలాగే మిగిలి పోయింది. ఫెడరర్ రిటైర్ కాగా.. నడాల్, జొకోవిచ్ వీడ్కోలు అంచున ఉన్నారు. సరికొత్త హీరో ఎవరన్న ప్రశ్నకు కార్లోస్ అల్కారజ్ అనే సమాధానం వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో కార్లోస్ అంతటి నిలకడ ఎవరిలోనూ కనిపించలేదు. పరిస్థితులకు తగ్గట్టుగా తన ఆట తీరును మార్చుకోవడం అతడి ప్రత్యేకత. వింబుల్డన్‌ను రెండోసారి నెగ్గడంతోపాటు.. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌ను కూడా సొంతం చేసుకొన్నాడు. పిన్నవయసులో నాలుగు గ్రాండ్‌స్లామ్‌లతో సరికొత్త రికార్డు సృష్టించాడు. కార్లోస్ తండ్రి గొంజాలెజ్ టెన్నిస్ కోచ్ కావడంతో.. నాలుగేళ్ల వయసు నుంచే రాకెట్ పట్టాడు. 16 ఏళ్ల వయసులో ఏటీపీ టోర్నీ రియో ఓపెన్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించిన అల్కారజ్.. ఆ తర్వాతి ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ ఎంట్రీ ఇచ్చాడు. 18 ఏళ్ల వయసులో టాప్-100లోకి దూసుకెళ్లిన కార్లోస్.. కెరీర్‌లో వేగంగా ఎదిగాడు. 2021 యూఎస్ ఓపెన్‌లో వరల్డ్ నెం:3 సిట్సిపా‌స్‌ను ఓడించాడు. 2022 ఏప్రిల్‌లో టాప్-10లో చోటుదక్కించుకొన్న అతడు.. అదే ఏడాది యూఎస్ ఓపెన్‌లో కాస్పర్ రూడ్‌ను ఓడించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడాడు. 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్‌లో చుక్కెదురైనా.. ఆ తర్వాత వరుసగా రెండు టైటిళ్లతో సత్తాచాటాడు. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో క్లే, గ్రాస్ కోర్టుల్లో విజేతగా నిలిచిన ఆరో ఆటగాడిగా అరుదైన ఘనతను అందుకొన్నాడు.

గైక్వాడ్‌కు అండగా బీసీసీఐ

రూ.కోటి ఆర్థిక సహాయం



న్యూఢిల్లీ: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న భారత మాజీ క్రికెటర్, మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ (71)కు బీసీసీఐ అండగా నిలిచింది. అతడి వైద్య ఖర్చుల కోసం రూ.కోటి ఆర్థిక సహాయం అందజేయనున్నట్టు ప్రకటించింది. అంతకుముందు గైక్వాడ్ చికిత్స కోసం బోర్డు ఆర్థిక సహాయం చేయాలంటూ కపిల్‌దేవ్ సహా మాజీ క్రికెటర్ల నుంచి విజ్ఞప్తులు అందాయి. దీంతో బోర్డు వెంటనే స్పందించింది. ఏడాది కాలంగా గైక్వాడ్ లండన్‌లో చికిత్స తీసుకుంటున్నారు. అతని మాజీ సహచరులు ఇప్పటికే నిధులు సేకరించి తోడ్పడుతుండగా.. బోర్డు కూడా ముందుకు రావాలని కపిల్ డిమాండ్ చేశాడు.

ఇండియా-ఎ జట్టులో షబ్నం, యశశ్రీ

ముంబై: ఆస్ట్రేలియా-ఎ జట్టుతో వచ్చేనెల ఏడు నుంచి జరిగే సిరీస్‌లో తలపడే భారత జట్టును బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. ఆస్ట్రేలియాకు పయనం కానున్న 18 మంది సభ్యుల బృందంలో తెలుగు క్రికెటర్లు షబ్నం షకీల్ (ఆంధ్రప్రదేశ్), ఎస్. యశశ్రీ (తెలంగాణ)కి స్థానం దక్కించుకున్నారు. అయితే, షబ్నం ఎంపిక ఆమె ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుంది. ఆసీస్‌తో ఇండియా-ఎ మూడు టీ20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు (4 రోజులు) ఆడనుంది.

విజేత సినికోవా జోడీ..

మహిళల డబుల్స్ టైటిల్‌ను కత్రీనా సినికోవా జోడీ సొంతం చేసుకొంది. ఫైనల్లో చెక్-అమెరికా జోడీ సినికోవా-టేలర్ టౌన్‌సెండ్ 7-6(5), 7-6(1)తో కెనడా-న్యూజిలాండ్ ద్వయం గాబ్రియెలా డబ్రోస్కీ-ఎరిన్ రౌటిఫెపై విజయం సాధించింది.

అ'ధర'హో..: ఫైనల్ మ్యాచ్ టిక్కెట్ల రేట్లు ఆకాశాన్నంటాయి. ఒకరకంగా క్రీడా చరిత్రలో అత్యంత ఖరీదైన మ్యాచ్ టిక్కెట్లుగా రికార్డులకెక్కనున్నట్టు భావిస్తున్నాయి. తుది పోరు టిక్కెట్ కనీస ధర రూ. 8.35 లక్షలుపైగానే ఉందని ప్రముఖ కామెంటేటర్ డారెన్ జీవెల్ ఎక్స్‌లో పోస్టు చేశాడు.

అల్కారజ్.. వన్స్‌మోర్!

- వింబుల్డన్ టైటిల్ నిలబెట్టుకొన్న కార్లోస్
- ఫైనల్లో జొకోవిచ్ ఓటమి





ప్రైజ్‌మనీ

అల్కారజ్‌కు:	రూ. 28 కోట్ల 35 లక్షలు
జొకోవిచ్‌కు:	రూ. 14 కోట్ల 70 లక్షలు
సెమీఫైనల్లో ఓడిన ఇద్దరికి :	చెరి 7 కోట్ల 50 లక్షలు

21 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయసులో నాలుగు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గిన అల్కారజ్..బోర్గ్, బోరిస్ బెకర్, మాట్స్ విలాండర్ సరసన చేరాడు.

లండన్: బిగ్‌ఫైట్‌గా భావించిన వింబుల్డన్ ఫైనల్.. వన్‌సైడ్‌గా ముగిసింది. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన స్పెయిన్ యువ కెరటం, 21 ఏళ్ల కార్లోస్ అల్కారజ్ టైటిల్ నిలబెట్టుకొన్నాడు. గత టోర్నీ ఫైనల్లో ఓటమికి బదులు తీర్చుకోవడమే కాకుండా.. 8వసారి గ్రాస్ కోర్టులో నెగ్గి ఫెడరర్ రికార్డును సమం చేయాలనుకొన్న రెండో సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)కు మరోసారి నిరాశే ఎదురైంది. అలాగే 25వ టైటిల్‌తో చరిత్రలో నిల్చిపోదామనుకున్న జొకోవిచ్‌కు బ్రేక్ పడింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ తుది పోరులో మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-2, 7-6(4)తో వరుస సెట్లలో జొకోవిచ్‌ను చిత్తు చేశాడు. గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన అతడు.. కెరీర్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడాడు. మోకాలి ఆపరేషన్ చేయించుకొన్న 37 ఏళ్ల నొవాక్ మునుపటి తరహాలో అలరించలేక పోయాడు. పదేపదే అనవసర తప్పిదాలతో మ్యాచ్‌ను చేజార్చుకొన్నాడు. 2 గంటల 27 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో 42 విన్నర్లు కొట్టిన కార్లోస్.. 5 బ్రేక్‌పాయింట్లు సాధించాడు. కాగా, జొకో 26 విన్నర్లు మాత్రమే కొట్టాడు. తొలిసెట్ మొదటి గేమ్‌లోనే నొవాక్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన స్పెయిన్ బుల్ 2-0 ఆధిక్యం సాధించాడు. తర్వాత ఐదో గేమ్‌లో మరోసారి బ్రేక్ పాయింట్ సాధించి తొలి సెట్‌ను సొంతం చేసుకొన్నాడు. రెండో సెట్‌లోనూ అల్కారజ్ జోరు ముందు నిలవలేక పోయాడు. అయితే, మూడో సెట్‌లో మాత్రం నొవాక్ కొంత మేర పోటీ ఇచ్చాడు. అల్కారజ్ 5-4తో చాంపియన్‌షిప్ పాయింట్‌పై ఉన్నప్పుడు.. పోరాడి సర్వీస్‌ను నిలబెట్టుకొన్న నొవాక్ 5-5తో సమం చేశాడు. సెట్ ఫలితం టైబ్రేక్‌కు దారి తీయడంతో జొకో మ్యాచ్‌ను మలుపు తిప్పుతాడని అభిమానులు ఆశించారు. టైబ్రేక్‌లో 3-3తో సమమైనా.. ఆ తర్వాత అల్కారజ్ జోరు చూపాడు. 6-4తో చాంపియన్‌షిప్ పాయింట్‌పై ఉన్నప్పుడు నొవాక్ రిటర్న్ నెట్‌కు తగలడంతో.. సంబరాలు చేసుకొన్నాడు.

రికార్డుల కుర్రాడు

ఒకే క్యాలెండర్ ఇయర్‌లో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ నెగ్గిన పిన్న వయస్కుడిగా (21 ఏళ్ల 70 రోజులు) అల్కారజ్ రికార్డుల్లోకి ఎక్కాడు. అంతకుముందు బోర్గ్ (1978) 22 ఏళ్ల 32 రోజులు, నడాల్(2008) 22 ఏళ్ల 33 రోజుల వయసులో ఈ టైటిల్స్ నెగ్గారు.

- పిన్న వయసులో వింబుల్డన్ టైటిల్‌ను నిలబెట్టుకున్న వారిలో మూడో ఆటగాడు అల్కారజ్. బోరిస్ బెకర్ (18 ఏళ్ల 227 రోజులు), బోర్గ్ (21 ఏళ్ల 26 రోజులు) ముందున్నారు.

విద్యుత్తు కమిషన్‌పై సుప్రీంకు కేసీఆర్

- కమిషన్‌ను రద్దు చేయాలంటూ పిటిషన్
- నేడు విచారణ చేపట్టనున్న సీజేఐ ధర్మాసనం



న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యుత్తు కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విద్యుత్తు కమిషన్ విచారణను కొనసాగించవచ్చని హైకోర్టు సీజే ధర్మాసనం ఇచ్చిన తీర్పును.. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. కేసీఆర్ పిటిషన్‌పై సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న విద్యుత్తు రంగ నిర్ణయాలపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే..! అయితే.. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా కమిషన్‌ను ఏర్పాటు చేశారని, వెంటనే విచారణ నిలిపివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ వేశారు. విద్యుత్తు కమిషన్‌ను రద్దు చేయాలన్న కేసీఆర్ పిటిషన్‌ను హైకోర్టు సీజే ధర్మాసనం కొట్టేసింది. కేసీఆర్ ఆరోపించినట్లుగా జస్టిస్ నర్సింహారెడ్డి ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఎక్కడా స్పష్టం కావడం లేదని పేర్కొంది. అనుమానించడం తగదని, అందుకు తగ్గ ఆధారాలను చూపించాలని సూచించింది. ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. దీంతో కేసీఆర్ సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లారు.

కాంగ్రెస్ చెప్పిన 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?

- ఏడు నెలలైనా ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు: కేటీఆర్

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారం చేపడితే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైంది...? వారు అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఉద్యోగ నోటిఫికేషన్ ఒక్కటీ జారీ చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల ఆందోళన నేపథ్యంలో ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు రాజకీయ నిరుద్యోగులు కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ యువతను రెచ్చగొట్టారని, అరచేతిలో వైకుంఠం చూపించారని విమర్శించారు. అలాగే ప్రసాద్ ల్యాబ్స్‌లో పుస్తక ఆవిష్కరణ సభ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌పై పలు వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌కు సత్తా ఉంటే, వారి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాలు, నోటిఫికేషన్లు, జాబ్ కేలండర్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ సమస్య మీద పోరాడుతున్న మోతీలాల్, బక్క జడ్సన్ తదితరులను కించపరిచేలా మాట్లాడటం సీఎంకు తగదన్నారు. కాగా తెలంగాణ ముఖ్యమంత్రిని మార్చాలనే డిమాండ్‌తో రాష్ట్రంలోని నిరుద్యోగులు త్వరలోనే ఢిల్లీలో ధర్నా చేయనున్నట్లు బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు.

జైళ్ల శాఖలో బదిలీలు నిలిపేయాలి: వార్డర్లు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖలో వార్డర్ లేదా బగ్లర్లను జిల్లా స్థాయికి కేటాయించి మూడేళ్లయినా పూర్తవలేదని, అంతకు ముందు సర్వీసును పరిగణనలోకి తీసుకుని బదిలీలకు కసరత్తు చేస్తున్నట్టు ఆ శాఖలోని వార్డర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగైనా కనీసం నాలుగేళ్లు కూడా పూర్తి కాకుండానే చేసే అక్రమ బదిలీలను నిలిపివేయాలని వార్డర్లు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్ 2018ని అనుసరించి జైళ్లశాఖలో వార్డర్లను రాష్ట్రస్థాయి క్యాడర్‌గా పరిగణించి జిల్లా స్థాయికి మారుస్తూ 2021 ఆగస్టు 4న జీవో 166 జారీ చేశారు. తర్వాత జీవో 317 అనుసరించి వారి స్థానికత ఆధారంగా ఆప్షన్లు తీసుకొని ఆయా జిల్లాలకు సర్దుబాటు చేశారు. వీరికి ఇంకా మూడేళ్ల సర్వీసు పూర్తి కాలేదు. అంతకు ముందు సర్వీసును పరిగణనలోకి తీసుకున్నా నాలుగేళ్లు పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే తమ బదిలీల ప్రక్రియను నిలిపివేయాలని వార్డర్లు కోరుతున్నారు.

అంగన్‌వాడీ.. కొత్త ఒరవడి

నేటి నుంచి ఆరు రోజులు అమ్మమాట-అంగన్‌వాడీ బాట.. చదువు, ఆరోగ్యం, క్రీడలు, అక్షరాభ్యాసాలు

- ఐదేళ్లు పూర్తయిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేత



హైదరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అందీ అందని పౌష్టికాహారం.. చిన్నారులపై మొక్కుబడి పర్యవేక్షణ.. పారిశుధ్య లోపం..! ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల స్వరూపం ఇది. ఇకపై మాత్రం.. చదువు, ఆరోగ్యంతో పాటు పిల్లల మానసిక ఉల్లాసానికి ఆటలు.. బోధనలోనూ కొత్త పద్ధతులతో సరికొత్త రూపం సంతరించుకోనున్నాయి. రెండున్నరేళ్ల వయసు వారి నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ఆకర్షితులయ్యేలా ప్రతి అంశంలోనూ మెరుగుపడనున్నాయి. ఓవైపు కేంద్రాలను కొత్త విధానంలోకి తీసుకురావడంతో పాటు, మరోవైపు బలోపేతం చేసేందుకు సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రోజువారీ నిర్వహించే కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీనిలోభాగంగా బోధించే విద్య, అందించే సేవల గురించి టీచర్లు.. పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తారు. కొత్తగా చేరబోయే పిల్లలకు 20న సామూహిక అక్షరాభ్యాసాలు చేయించనున్నారు. ఐదేళ్లు పూర్తయి అంగన్‌వాడీ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు 'ప్రి స్కూల్ సర్టిఫికెట్'ను ప్రదానం చేయనున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం ములుగు జిల్లా ములుగు మండలంలోని మహమ్మద్ గౌస్‌పల్లిలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట ప్రారంభంలో పాల్గొంటారు.

ఇదీ షెడ్యూల్

సోమ, మంగళవారాల్లో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలల టీచర్లు, యువత, ఎన్జీవోలతో ర్యాలీ నిర్వహిస్తారు. రెండున్నరేళ్ల వయసున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సంబంధిత సిబ్బంది కోరుతారు.

18న: అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రెండున్నరేళ్ల వయసు దాటిన పిల్లలను గుర్తిస్తారు. తాము అందిస్తున్న బోధన, పాఠశాల విద్యకు సమాయత్తం చేయడం తదితర అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

19న: స్వచ్ఛ అంగన్‌వాడీ కింద కేంద్రాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతారు. ప్రాంగణం చుట్టూ మొక్కలు నాటుతారు. తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం, కిచెన్ గార్డెన్ సదుపాయాలను కల్పిస్తారు. జూలైలో బోధించబోయే, నిర్వహించే కార్యక్రమాలను వెల్లడిస్తారు.

20న: అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నాయనమ్మ, అమ్మమ్మలను ముఖ్య అతిథులుగా పిలిచి బోధనా విధానం, పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తారు. పిల్లలను రోజూ అంగన్‌వాడీకి పంపుతున్న తల్లిదండ్రులకు బహుమతులు అందించనున్నారు.

ప్రీ స్కూల్ విద్య అందేలా

రెండున్నరేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసమే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పేదల పిల్లలకు కూడా ప్రైవేటు తరహాలోనే ప్రి స్కూల్ విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ఇందుకు అవసరమైన చర్యలు ఇప్పటికే చేపట్టాం.

- మంత్రి సీతక్క

మంత్రి సూచించిన పేరుతోనే..

రాష్ట్రంలోని అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు, పిల్లలను కేంద్రాల్లో చేర్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇటీవల మంత్రి సీతక్క, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. దానికి ఏ పేరు పెట్టాలనేదానిపై అందరూ ఆలోచనలో పడ్డారు. ఆ సమయంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' అంటూ మంత్రి సీతక్క పేరును సూచించినట్లు తెలిసింది.

మరో డీఎస్సీ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నమని చెప్పారు. తెలంగాణ తెచ్చుకున్నదే యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకుని.. ఆ దిశగా దృష్టిసారించామన్నారు. పదేళ్లుగా డీఎస్సీ లేకపోవడంతో నిరుద్యోగులు, సరైన బోధన అందక పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే 16 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించామని 11వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని వివరించారు. 19,717 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, 34వేల మందిని బదిలీ చేశామని పేర్కొన్నారు. హాస్టల్ వెల్ఫేర్‌కు సంబంధించి 581 ఉద్యోగాలకు పరీక్షలు జరిపామని.. మొత్తం 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడించారు. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో 13,321 పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులను గాలికి వదిలేశారని భట్టి మండిపడ్డారు. పదేళ్లు డీఎస్సీ ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసి ప్రిలిమ్స్ నిర్వహించి ఫలితాలూ ప్రకటించామని గుర్తుచేశారు. గ్రూప్-3కి సైతం తాము షెడ్యూల్ ఇచ్చామన్నారు.

ఎల్‌వోసీ వద్ద ముగ్గురు పాక్ ఉగ్రవాదుల కాల్చివేత

న్యూఢిల్లీ, జూలై 14: భారతదేశంలోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నించిన ముగ్గురు ఉగ్రవాదులను భారత దళాలు కాల్చి చంపాయి. ఆదివారం సైనిక దళాలు జమ్మూకశ్మీర్ కుప్వారా జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద ముగ్గురు ఉగ్రవాదుల కదలికలను గమనించి వారిని నిలువరించేందుకు ప్రయత్నించాయి. ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ప్రతిగా భారత దళాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు తెలిపారు.

కమల సారథ్యం ఎవరికో?

- రాష్ట్ర బీజేపీలో కొనసాగుతున్న సస్పెన్స్!
- త్వరలోనా? సభ్యత్వ నమోదు తర్వాతా?
- పోటీపడుతున్న పలువురు సీనియర్లు
- ఒకరిద్దరి అభ్యర్థిత్వాలపై సంఘ్ విముఖం!
- మరికొంతకాలం కిషన్‌రెడ్డి కొనసాగింపు?



హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర పార్టీకి కొత్త సారథి అంశంపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ పదవి కోసం పలువురు సీనియర్, జూనియర్ నాయకులు తీవ్రంగా పోటీ పడుతుండడంతో.. అధినాయకత్వం నిర్ణయం ఎలా ఉంటుందోననే ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది. పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని పార్టీ జాతీయ నాయకత్వం మరికొంత కాలం కొనసాగిస్తుందా? లేక త్వరలోనే కొత్త సారథిని ప్రకటిస్తుందా? పార్టీ సభ్యత్వ నమోదు త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా, ఆ ప్రక్రియ పూర్తయ్యాక నూతన సారథిని ఎన్నుకుంటారా? అనే చర్చ బీజేపీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాష్ట్ర పార్టీ సారథ్యం కోసం.. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతోసహా సుమారు 10మంది సీనియర్ నాయకులు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ సమయంలో సభ్యత్వ నమోదుకు సిద్ధం కావాలంటూ కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు శాసనసభ ఎన్నికలు లేనందున పార్టీ రాజ్యాంగం ప్రకారమే కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశం ఉందన్న వాదన పార్టీవర్గాల్లో వినిపిస్తోంది. అదే జరిగితే.. సభ్యత్వ నమోదు నుంచి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడం దాకా కనీసం ఆర్నెల్లు సమయం పడుతుందని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. "పార్టీ రాజ్యాంగం ప్రకారం, తొలిదశలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ సభ్యత్వ నమోదు పూర్తికావాలి. ఆ తర్వాత వరుసగా మండల, జిల్లా కమిటీలకు ఎన్నికలు జరపాలి. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 50% జిల్లాలకు కొత్త అధ్యక్షులను ఎన్నుకున్న తర్వాతే రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది" అని ఆయన వివరించారు. అయితే.. హరియాణాలో పార్టీకి కొత్త అధ్యక్షుడిని రెండు రోజుల కిందటే నియమించిన నేపథ్యంలో, తెలంగాణలోనూ అలాగే కొత్త సారథిని త్వరలోనే నియమించే అవకాశం ఉందన్న అభిప్రాయమూ పార్టీవర్గాల్లో ఉంది.

రేసులో ఎవరంటే..

రాష్ట్ర బీజేపీ అధ్యక్ష రేసులో ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, ఎం.రఘునందన్ రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల శంకర్, సీనియర్ నేతలు ధర్మారావు, చింతా సాంబమూర్తి, ఆచారి ఉన్నారు. గతంలో పార్టీ సారథ్యం వహించిన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేరు కూడా తెరపైకి వచ్చిందని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు.. కిషన్‌రెడ్డినే మరికొంత కాలం కొనసాగించే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయమూ పార్టీవర్గాల్లో ఉంది. కాగా.. రాష్ట్ర పార్టీ అధ్యక్ష నియామకంలో భాగంగా బీజేపీ జాతీయ నాయకత్వం అభిప్రాయ సేకరణ చేస్తోంది. కొత్తగా చేరిన నేతలకు పార్టీ సిద్ధాంతం గురించి కనీస అవగాహన లేదని, అలాంటి వారికి బదులు తమకు అవకాశం ఇవ్వాలని సీనియర్ నేతలు పలువురు జాతీయ నాయకత్వాన్ని అభ్యర్థించారు. ఆరెస్సెస్ కూడా.. పార్టీలో కొత్తగా చేరిన ఒకరిద్దరు నేతల అభ్యర్థిత్వాల పట్ల విముఖంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలన్న పట్టుదలతో ఉన్న జాతీయ నాయకత్వం..అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకునే కొత్త సారథిని నియమిస్తుందని ఓ ముఖ్య నేత చెప్పారు.

తెరుచుకున్న జగన్నాథుడి

రత్నభాండాగారం



ఖజానాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన చెక్క పెట్టెలు

46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం.. రహస్య గదిలోకి ప్రవేశించిన 11మంది సభ్యులు

- ఖజానాను తరలించడానికి 6 చెక్కపెట్టెలు సిద్ధం
- బయటి గదిలోని సంపదను వాటిలోకి చేర్చి సీలు

పూరీ, జూలై 14: పూరీ క్షేత్రంలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఖజానా రత్నభాండాగారం 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకుంది. గది లోపల ఉన్న విలువైన వస్తువుల లెక్కింపుతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణానికి మరమ్మతులు చేయడానికి ఖజానాను తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో 128.380 కిలోల బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటల సమయంలో రహస్య గదిని తెరిచారు. జగన్నాథుడి ఖజానా తలుపులు తెరిచినట్లు ఒడిశా సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. నలుగురు ఆలయ సేవకులతో పాటు కమిటీ ఛైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢీ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ డీబీ గడనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి సహా మొత్తం 11మంది సభ్యులు గదిలోకి ప్రవేశించారని అధికారులు పేర్కొన్నారు. రత్నభాండాగారం తలుపులు తెరవనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఉదయం గుండిచ మందిరంలో జగన్నాథ స్వామికి, ఆయన తోబుట్టువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనుమతి తీసుకున్నారు. పూరీలో రథయాత్ర సాగుతున్నందున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలు ప్రస్తుతం గుండిచ ఆలయంలో ఉన్నాయి. వచ్చేవారం జరిగే బహుదా యాత్ర సందర్భంగా దేవతామూర్తులను తిరిగి శ్రీక్షేత్రానికి తీసుకొస్తారు. రహస్య గదిలో విషసర్పాలు నిధిని కాపలా కాస్తుంటాయన్న అనుమానాలతో ముందు జాగ్రత్తగా పాములు పట్టడంలో నిపుణులతో పాటు సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల, బయట రెండు స్నేక్ క్యాచర్ల బృందాలను సిద్ధంగా ఉంచామని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుభేందు మల్లిక్ తెలిపారు. అంతకుముందు ఎస్‌జేటీఏ చీఫ్ అరబింద పాఢీ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖజానాను తెరిచినప్పటికీ విలువైన వస్తువుల లెక్కింపు ప్రక్రియను ఇప్పటికిప్పుడే చేపట్టబోమని చెప్పారు. స్వర్ణకారులు, ఇతర నిపుణుల నియామకం తర్వాతే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలుత రత్నభాండాగారం బయట, లోపలి గదుల్లో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో భద్రపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. ఖజానా నిర్మాణం భద్రతను నిర్ధారించడం తమ తొలి ప్రాధాన్యంగా చెప్పారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థకు చేరి ఉంటే ఆభరణాలను తరలించడానికి వీలుగా ఇత్తడి పూత పూసిన ఆరు చెక్క బాక్సులను సిద్ధంగా ఉంచారు. ఖజానా బయట గదిలో ఉన్న ఆభరణాలను ఈ కలప పెట్టెల్లోకి మార్చి సీలు వేసినట్లు తెలిపారు. బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోని బంగారం, వెండి సామగ్రిని కూడా తరలిస్తామని పాఢీ పేర్కొన్నారు. ఆర్‌బీఐ ప్రతినిధి సమక్షంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ చేపడతామని ఆ తర్వాత వాటి ఫొటోలు, బరువు, నాణ్యత తదితర వివరాలతో డిజిటల్ కేటలాగ్ రూపొందిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.



రత్నభాండాగారాన్ని తెరిచే సమయంలో ఆలయం వద్ద భక్తులు

రత్నభాండాగారం వద్ద స్పృహ తప్పిన పూరీ ఎస్పీ?

పూరీ పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా శ్రీమందిరంలోని రత్నభాండాగారం తలుపు వద్ద స్పృహ తప్పి పడిపోయారని, ఖజానాలోకి ప్రవేశించిన సభ్యుల్లో ఒకరైన డాక్టర్ సీబీకే మొహంతి ఎస్పీకి చికిత్స అందించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మిశ్రా ఖండించారు. ఆలయ సింహద్వారం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

మోదీ @ 10 కోట్లు

'ఎక్స్'లో ప్రధానిని ఫాలో అవుతున్న వాళ్ల సంఖ్య

న్యూఢిల్లీ, జూలై 14: 10 కోట్లు! ప్రధాని మోదీని 'ఎక్స్'లో ఫాలో అవుతున్నవారి సంఖ్య ఇది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా(13 కోట్లు) తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న మరో నేతగా, ప్రభావవంతమైన వ్యక్తిగా మోదీ నిలిచారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పలువురు సెలబ్రిటీలు, క్రీడాకారుల కంటే మోదీనే 'ఎక్స్'లో ఎక్కువ మంది ఫాలో అవుతుండటం విశేషం. అలాగే తన రాజకీయ ప్రత్యర్థులైన రాహుల్‌గాంధీ(2.64 కోట్లు), కేజ్రీవాల్(2.75 కోట్లు), అఖిలేశ్(1.90 కోట్లు), మమతాబెనర్జీ(74 లక్షలు) వంటి వారి కంటే ఫాలోవర్స్ విషయంలో ఆయన అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. అదేవిధంగా ప్రముఖ క్రీడాకారులు విరాట్ కోహ్లి(6.4 కోట్లు), నేమర్ జూనియర్(6.3 కోట్లు), లెబ్రోన్ జేమ్స్(5.2 కోట్లు)లను అలాగే టేలర్ స్విఫ్ట్(9.5 కోట్లు), లేడీ గాగా(8.3 కోట్లు), కిమ్ కర్దాషియన్(7.52 కోట్లు) వంటి సెలబ్రిటీలను సైతం అధిగమించారు. 10 కోట్ల మార్క్ చేరుకున్న సందర్భంగా మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బీఎస్పీ నేత హత్య కేసు నిందితుడు ఎన్‌కౌంటర్‌లో హతం

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర శివారు ప్రాంతం మాధవరం వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బీఎస్పీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితుడు తిరువేంగడం హతమయ్యాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి జరిగిన ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు సంబంధించి 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో పేరుమోసిన రౌడీ తిరువేంగడం బీఎస్పీ నేత హత్యకు పథకం రూపొందించినట్టు విచారణలో వెల్లడైంది. ఆ నేపథ్యంలో మాధవరంలోని ఇంటిలో మారణాయుధాలు దాచి ఉంచినట్టు తిరువేంగడం వాంగ్మూలం ఇవ్వడంతో వాటిని స్వాధీనం చేసుకోవడానికి పోలీసులు తీసుకెళ్ళారు. మార్గమధ్యంలో రెట్టేరి వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వ్యాన్ నుంచి దిగిన తిరువేంగడం పరారయ్యాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి పుళల్ వెజిటేరియన్ విలేజ్ ప్రాంతంలో షెడ్డు లోదాగి ఉన్న అతన్ని చుట్టుముట్టారు. పోలీసులను చూడగానే తిరువేంగడం తన వద్ద నున్న రివాల్వర్‌తో కాల్పులు జరిపాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరుపటంతో ప్రాణాలు కోల్పోయాడు.

లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా గౌరవ్ గొగోయ్

- స్పీకర్‌కు సీపీపీ చైర్‌పర్సన్ సోనియా లేఖ

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు ఆ పార్టీ మరోసారి అవకాశమిచ్చింది. చీఫ్ విప్‌గా సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్, విప్‌లుగా మాణిక్కం ఠాగూర్, మహమ్మద్ జావేద్‌లను నియమించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ లేఖ రాశారు. ఇదే విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు సురేశ్ (మావేలికర) కేరళ నుంచి 8 సార్లు ఎంపీగా గెలవగా.. మాణిక్కం ఠాగూర్ (విరుదునగర్) తమిళనాడు నుంచి 3 సార్లు, జావేద్ (కిషన్‌గంజ్) బిహార్ నుంచి 2 సార్లు గెలిచారు.

మణిపూర్‌లో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో జిరిబం జిల్లాలోని మోంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) జవాన్ మృతి చెందారు. దుండగులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరణించిన జవాన్‌ను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మరో పోలీసుకు గాయాలయ్యాయి. కుకీలకు చెందిన మిలిటెంట్లే ఈ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త!

పోలీసు, నిఘా, దర్యాప్తు సంస్థల పేరిట నకిలీ ఈమెయిళ్లు

- వాటికి స్పందించవద్దు
- 1930కి ఫోన్ చేసి తెలియజేయాలి: కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, జూలై 14: పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల పేరిట సైబర్ మోసగాళ్లు నకిలీ ఈ మెయిళ్లు, నోటీసులు పంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోంశాఖకు చెందిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్' (ఐ4సీ) ప్రజలకు సూచించింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు.. అవి నిజంగానే ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా? అని తెలుసుకోవటానికి ఆ వెబ్‌సైట్ చివర gov.in ఉందా అనేది చూడాలని పేర్కొంది. అలాగే, సదరు మెయిల్‌లో ప్రస్తావించిన అధికారుల గురించి సమాచారం, వారి వివరాలను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ విభాగానికి ఫోన్ చేసి ఈ మెయిల్ గురించి తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు ఐ4సీ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చినప్పుడు, ఇతరత్రా సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు అప్రమత్తమై www.cybercrime.gov.in కు, లేదా సైబర్ క్రైం హెల్ప్ నంబరు 1930కి సమాచారం అందించాలని తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనూ కేంద్ర ఆర్థికశాఖ ఒక సూచన జారీ చేసింది. ఢిల్లీ పోలీసు సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ సైబర్ సెల్ పేర్లతో, ఆయా సంస్థల లోగోలతో, అధికారుల సంతకాలతపంపిస్తున్నారని పేర్కొంది. దీంతోపాటు ఒక అటాచ్‌మెంట్ కూడా పంపుతున్నారని.. చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ పోర్నోగ్రఫీ వంటి నేరాలకు పాల్పడ్డావంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు వాటికి ప్రతిస్పందించవద్దని, వీటి గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్‌లో పనిచేసే ఉద్యోగులకు కూడా గత వారం అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చాయి.

లబ్ధిదారుల నుంచి రికవరీలు చేయొద్దు

» కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

హైదరాబాద్, జూలై14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో అనర్హులుగా గుర్తించిన వారికి నోటీసులు జారీ చేయడం గానీ, వారు పొందిన మొత్తాన్ని రికవరీ చేయడం గానీ చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి సచివాలయంలోని ఆయా విభాగాలు, అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. తదుపరి మార్గదర్శకాలు విడుదల చేసేవరకు సంక్షేమ పథకాల్లో అనర్హులపై ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల్లో పలువురు అనర్హులున్నట్లు పలు మార్గాల ద్వారా తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. అన్ని పథకాలను పేదలు, అర్హులకే అందించాలన్న సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం మేరకు ఈ పథకాల అమలు తీరును క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో.. ఆయా పథకాల అమల్లో గుర్తించిన అవకతవకలపై చర్చించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, ఆ తర్వాతే రికవరీచేసే విధానాలపై ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తుందని పేర్కొన్నారు.


మహిళా రైతు కూలీలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కౌలు రైతులకూ రైతు భరోసా ఇవ్వండి

» మంత్రి పొంగులేటితో మహిళా రైతు కూలీలు

ఖమ్మం రూరల్, జూలై 14: కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపచేయాలని పలువురు మహిళా రైతు కూలీలు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఏళ్లుగా కౌలు చేస్తున్న తాము ఎక్కువగా నష్టపోతున్నామని తెలిపారు. కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందని, పట్టాదారులకే అన్ని పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించిన మంత్రి పొంగులేటి గూడూరుపాడులో హెల్త్ సబ్‌సెంటర్ ప్రారంభోత్సవానికి వెళుతూ ఆ గ్రామ శివారులో తన కాన్వాయ్‌ని ఆపి పొలాల్లోకి వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న మహిళా రైతు కూలీలను పలకరించి 'రైతు భరోసా' పథకం గురించి మాట్లాడారు. ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తే బాగుంటుందని వారిని అడిగారు. వ్యవసాయానికి అయ్యే ఖర్చులు, దిగుబడి తదితర వివరాలను తెలుసుకున్నారు.

దేశంలో మోదీ ప్రభ తగ్గుతోంది: నిరంజన్

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రాభవం తగ్గిపోతోందని.. ఇటీవల జరిగిన 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా 13 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో ఇండియా కూటమికి 10 సీట్లు దక్కగా.. బీజేపీకి కేవలం రెండు సీట్లు, అదీ స్వల్ప మెజారిటీతో గెలుచుకుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వెల్లడించారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు సాధారణ పెన్షన్లతో పాటు ఆసరా పెన్షన్లు ఇచ్చి ప్రజాధనాన్ని వృథా చేసిందని కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం మండిపడ్డారు. 2014-2023 వరకు 5 వేల మందికి పైగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు రిటర్మెంట్ పెన్షన్‌తో పాటు ఆసరా పెన్షన్ తీసుకున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. పేదలను విస్మరించి అనర్హులకు పెన్షన్ ఇచ్చిన నిర్వాకానికి సిగ్గుపడాల్సిన బీఆర్ఎస్ నేతలు.. అబద్ధాలతో ఇంకా మభ్యపెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు.

మునిసిపల్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించండి

» పురపాలక కౌన్సిల్ ఫోరం చైర్మన్ రాము

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మునిసిపల్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, అదే విధంగా రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీలో ఐదేళ్లుగా రావాల్సిన రూ.2,500 కోట్లను కూడా విడుదల చేయాలని పురపాలక కౌన్సిల్ ఫోరం చైర్మన్ రాము సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారికి విజ్ఞప్తి చేశారు. గతంలో మునిసిపాలిటీల్లో చేసిన పనులకు అక్కడే బిల్లులను చెల్లించేవారని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రక్రియను ఆర్థికశాఖ పరిధిలోకి తీసుకువచ్చిందని తెలిపారు. దీంతో ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు అప్పులు చేసి మరీ పనులు చేశారని, సమయానికి బిల్లులను అందించకపోవడంతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ నిబంధనలను మార్చాలని ఓ ప్రకటనలో కోరారు.

వ్యవసాయ ఉద్యోగులకు బదిలీల్లో అన్యాయం

» గ్రాడ్యుయేట్ ఏఈవోల సంఘం

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు- 317లో భాగంగా జోన్‌లకు కేటాయించిన వ్యవసాయశాఖ ఉద్యోగులకు సాధారణ బదిలీల ప్రక్రియలో అన్యాయం జరుగుతున్నదని గ్రాడ్యుయేట్ ఏఈవోల సంఘం అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి అభిలాష్, కోశాధికారి సుమన్, కార్యవర్గ సభ్యులు శ్వేత, పున్నం చందర్, శశికుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. 317 జీవో అమలులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న జనగామను యాదాద్రి జోన్‌లో కలపడంతో ఒక్కో ఏఈవో 100 కి.మీ.కు పైగా దూరం వెళ్లి పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకుండా... ఖాళీలు ఉన్న క్లస్టర్లకు మాత్రమే కేటాయించడంతో సీనియర్లకు నష్టం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు 317 జీవోలో పాత స్టేషన్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకున్నట్లుగానే.. వ్యవసాయ విస్తరణాధికారులకు కూడా పాత స్టేషన్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని సాధారణ బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించగా పాత స్టేషన్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చిందని, కోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం అమలుచేయాలని ఏఈవోల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు.


అనిల్‌ను అభినందిస్తున్న పలువురు ప్రవాసీ శ్రేయోభిలాషులు

జాతి నిర్మాణంలో ఖనిజ సంపద కీలకం

» ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): భవన నిర్మాణ రంగం జాతి నిర్మాణంలో ఒక భాగమని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. భవన నిర్మాణాలకు అవసరమైన నాణ్యమైన ఇసుకను సరఫరా చేయడం ద్వారా ఖనిజాభివృద్ధి సంస్థ కూడా జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తామని తెలిపారు. ఖనిజ సంపద ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని చెప్పారు. ఇటీవల ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన అనిల్‌ను అభినందించడానికి పలువురు కార్యకర్తలు, అభిమానులు ఖైరతాబాద్‌లోని ఆయన కార్యాలయానికి వస్తున్నారు. అనిల్ గతంలో ప్రవాస భారతీయుడిగా ఉండటంతో పలువురు శ్రేయోభిలాషులు ఆయనను కలిసేందుకు విదేశాల నుంచి కూడా వస్తున్నారు.

ప్రభుత్వం కూలుతుందన్న వాళ్లు..

ఇప్పుడు ఎక్కడ?



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కల్లు కుండను అందజేస్తున్న మంత్రి పొన్నం; మాట్లాడుతున్న సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకుంటున్నది ఎవరని ప్రశ్నించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు 'కాటమయ్య రక్షక కవచం' కిట్లను పంపిణీ చేసిన సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. "మూడు నెలలు, ఆరు నెలలు కాదు. ఈ ప్రభుత్వం పదేళ్లు ఉంటది. 2004 నుంచి 2014 వరకు దేశంలో కాంగ్రెస్ అందించిన జనరంజక పాలనను మరోసారి అందిస్తుంది. ఓడినోళ్లు, ఇంట్లో పడుకున్నోళ్లు, ఫామ్‌హౌస్‌లలో ఉంటున్నోళ్లను అడుగుతున్నా.. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ, ఫార్మా కంపెనీలు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా? అవన్నీ తెచ్చినందుకే హైదరాబాద్ మహానగరంగా మారింది. మీరు నగరానికి తీసుకొచ్చింది ఏదైనా ఉంటే గంజాయి, డ్రగ్స్ మాత్రమే" అని సీఎం రేవంత్ అన్నారు. తెచ్చుకున్న తెలంగాణను బాగు చేసుకునేందుకు తాపత్రయపడుతున్న తనకు మద్దతిస్తే మరింత బలపడతానని, చేతనైనంత సాయం చేస్తామని ఎమ్మెల్యేలు వస్తున్నారని అన్నారు. వారికి ఇవ్వడానికి తన దగ్గర ఏమున్నాయని, తన అంగీ, లాగు అమ్మినా ఏమీ రాదని వ్యాఖ్యానించారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించారు

పదేళ్లు ఏమీ చేయనివారు ఉన్నదంతా అమ్ముకొని ఊడ్చుకుపోయారని, రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి.. రాష్ట్రాన్ని దివాలా తీయించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. "ఏ గూట్లో చేయి పెట్టినా అప్పుల కాగితమే బయటకు వస్తోంది. గతంలో సంవత్సరానికి రూ.6500 కోట్ల అప్పు కట్టేది ఉండె. ఇయ్యాల ప్రతి నెలా మొదటి తారీకున రూ.7 వేల కోట్లు వడ్డీయే కడుతున్నం. ఏటా రూ.72 వేల కోట్లు మిత్తి కట్టనీకే అయితుంది. సంసారం అప్పులపాలైంది. ఒక్కటొక్కటిగా సరిదిద్దుకుంటూ వస్తున్నం" అని సీఎం తెలిపారు. అమెరికాలోని న్యూయార్క్ నగరం తరహాలో మహేశ్వరంలో మరో మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల్లో విశ్వవిద్యాలయాలు, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. తాను పాదయాత్ర చేసిన సమయంలో రాచకొండ గుట్టల పక్కనున్న తండాల్లోకి వెళ్లానని, ఊటీ కంటే అద్భుతమైన వాతావరణ పరిస్థితులు ఇక్కడ ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని షూటింగ్‌లకు హబ్‌గా మార్చబోతున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ పట్టనుందని, ప్రపంచంలోనే అద్భుత పర్యాటక క్షేత్రంగా జిల్లాను తీర్చిదిద్దుతామని ప్రకటించారు. హయత్‌నగర్ వరకు త్వరలో మెట్రో రాబోతోందని, అటు అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాగించేలా మెట్రో రైల్‌ను విస్తరిస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో భూమి బంగారమైందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎకరం రూ.100 కోట్లు పలుకుతోందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో అభివృద్ధి మరింతగా పరుగులు పెడుతుందన్నారు.

బలహీనవర్గాలు పాలకులుగా ఎదగాలి

బలహీనవర్గాలు పాలకులుగా మారాలంటే ఏకైక మార్గం చదువేనని సీఎం అన్నారు. ఇందుకోసం వైఎస్ఆర్ ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఈ ప్రభుత్వం సమర్థవంతంగా కొనసాగిస్తోందన్నారు.

సేఫ్టీ కిట్ బాగుందా

లష్కర్‌గూడ గ్రామంలోని వనంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈత చెట్టును నాటిన అనంతరం.. కాటమయ్య రక్షక కవచాలను ధరించిన గీత కార్మికులు చెట్టుపై ప్రమాదం జరిగితే కవచాలు ఎలా కాపాడుతాయో ప్రయోగాత్మకంగా చూపించారు. కొంతమంది కార్మికులు కవచాలు ధరించి చెట్టు ఎక్కి, మోకును వదిలేసి వేలాడారు. ఈ సందర్భంగా కార్మికులు తాటిచెట్టుపై ఉండగానే వారితో సీఎం మాట్లాడారు. రక్షక కవచం బాగుందా? అని రంగయ్య అనే గీత కార్మికుడిని ప్రశ్నించారు. అతడు 'బాగుంది సార్' అని చెప్పగా.. గుతి పోతే తిరిగి ఎలా పెట్టుకుంటారని అడిగారు. వెంటనే కాళ్లతో గుతిని పెట్టుకుని కార్మికులు చూపించారు. మరో కార్మికుడిని ఉద్దేశించి, 'ఏం గౌడ్ సాబ్! ఆ ఎల్లో టీషర్టు వేసుకున్నాయన పేరేంటి? నీ టీషర్టు బాగుంది" అని రేవంత్ అన్నారు. అతడు, 'కృష్ణయ్య సార్' అని చెప్పగా.. 'రోజుకు ఎన్ని చెట్లు ఎక్కుతారు? ఎన్ని లీటర్ల కల్లు వస్తుంది? బెల్టు షాపులు వచ్చి మీ వృత్తిని దెబ్బ తీస్తున్నాయి కదా! అందుకే వాటిని తీసేశాం. అవి రాకుండా చూసుకోండి" అని సీఎం అన్నారు. ఈ సందర్భంగా తాటివనం కోసం 5 ఎకరాల స్థలం, మోపెడ్ వాహనాలు అందించాలని కార్మికులు సీఎంను కోరారు.

"కుల వృత్తులను నమ్ముకొని మీరు కష్టపడుతున్నరు. మీ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయడం ద్వారా వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలి. చట్టసభల్లో శాసనాలు చేసే స్థాయికి మీ పిల్లలు ఎదగాలి" అని రేవంత్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు రాకపోవచ్చని, కుల వృత్తుల బలోపేతానికి చర్యలు తీసుకోవడం ద్వారా కుటుంబాలను నిలబెట్టినట్లవుతుందని చెప్పారు. వన మహోత్సవంలో భాగంగా కొత్తగా నిర్మించే రోడ్ల పక్కన, చెరువు కట్టలపై, కాలువల వెంట, సాగునీటి ప్రాజెక్టుల వద్ద తాటి చెట్లు, ఈత చెట్లు నాటేలా అటవీ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సీఎం సూచించారు. ఇరిగేషన్ విభాగంతో ఈ విషయంపై చర్చించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉంటే తాటి, ఈత వనాల కోసం కేటాయించేందుకు అభ్యంతరం లేదన్నారు. మరణించిన, గాయపడిన గీత కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.7.90 కోట్లను వెంటనే విడుదల చేస్తామని ప్రకటించారు. ఎవరెస్ట్ ఎక్కిన మాలావత్ పూర్ణ బృందం అనుభవం గౌడన్నలకు ఉపయోగపడతుందన్నారు.

నిరుద్యోగులూ.. మీ బాధలు చెప్పండి!

నిరుద్యోగుల బాధలు వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "నిన్న, మొన్న మా పిల్లలు కూడా పరీక్షలు వాయిదా వేయండని కోరుతున్నరు. మీ బాధలు వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పిల్లలు రోడ్డెక్కే బదులు.. మంత్రులను కలవండి. సాధక బాధకాలుంటే చెప్పండి. తప్పకుండా విని సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది" అని చెప్పారు. నిరుద్యోగులతో మాట్లాడి.. వారి ఇబ్బందులు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.

వాళ్ల ఉద్యోగాలు ఊడుతాయి

"స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయకపోతే వాళ్ల ఉద్యోగం ఊడుతది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపించుకుంటేనే మనకు బలం. అందరం కలిసి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నం.. పదేళ్లు కష్టపడి కాపాడుకుందాం.. అభివృద్ధి చేసుకుందాం" అని రేవంత్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తాటి, ఈతకు సంబంధించి 80 బైప్రొడక్టుల విషయంపై ఆలోచిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాగా, గడిచిన పదేళ్లలో గీతకార్మికులకు ఎలాంటి సహకారం అందలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అన్నారు. నీరా, తాటికల్లును సహజ ఉత్పత్తులుగా అమ్ముకునేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ ముగుస్తున్న సమయంలో కొందరు మధ్యాహ్న భోజన కార్మికులు లేచి నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని ఏమీ అనవద్దని, వారి సమస్యలను ఎమ్మెల్యేకు, ఎంపీకి తెలపాలని సూచించారు. సీఎం సభలో కూర్చున్న సమయంలో వీఐపీ గ్యాలరీ నుంచి ఓ మహిళ లేచి వినతి పత్రం చూపించగా వారి వద్దకు వెళ్లి తీసుకోవాలని తన సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి రేవంత్ సూచించారు.


అమ్మవారి ఘటాన్ని శివసత్తులకు అందిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రజాభవన్‌లో బోనాల ఉత్సవాలు

హాజరైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా ప్రజాభవన్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు స్వయంగా తీసుకువచ్చి శివసత్తులకు అందించారు.

హస్తం గూటికి 'గూడెం' రెడీ?

» నేడో రేపో సీఎం సమక్షంలో చేరిక!

» ఆదివారం రాత్రి వరకు ముఖ్య అనుచరులతో సమాలోచనలు

» పార్టీ మార్పుపై.. కార్పొరేటర్ల మౌనం

» ఇద్దరు మునిసిపల్ చైర్మన్లు బీఆర్ఎస్‌లోనే?

పటాన్‌చెరు, జూలై 14: కొంతకాలంగా పార్టీ మార్పుపై ఊగిసలాడుతున్న పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఎట్టకేలకు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. రెండు రోజులుగా ఆయన కాంగ్రెస్‌లోకి వెళతారన్న ఊహాగానాలకు తెరదించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన కుమారుడు సీఎం రేవంత్, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డి ఫొటోలతో తన వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం..! ఈ క్రమంలో మహిపాల్‌రెడ్డి ఆదివారం రాత్రి వరకు తన నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమాలోచనలు చేశారు. పార్టీ మార్పుపై ఒక్కొక్కరిగా అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. ముఖ్య నాయకులు మహిపాల్‌రెడ్డి వెంటే ఉంటామని హామీ ఇవ్వగా.. ముగ్గురు కార్పొరేటర్లు మాత్రం మౌనం వహించారని, ఇద్దరు మునిసిపల్ చైర్మన్‌లు(బొల్లారం, తెల్లాపూర్) బీఆర్ఎస్‌తోనే ఉంటామని స్పష్టం చేశారని విశ్వసనీయవర్గాలు పేర్కొన్నాయి. కాగా.. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా భవిష్యత్‌లో పటాన్‌చెరు రెండుగా విడిపోతే.. బీఆర్ఎస్‌లో ఉండడం ద్వారా ఎమ్మెల్యే టికెట్ దక్కవచ్చని పలువురు నాయకులు భావిస్తున్నారు.

నేటి నుంచే ఆన్‌లైన్‌లో సీఎంఆర్ఎఫ్

సాయం కోసం నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం.. మూడు నిమిషాల్లోనే సమర్పించే వీలు

» ప్రజాప్రతినిధులకు లాగిన్ ఐడీలు

» దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునే సదుపాయం

» లోతైన విచారణ తర్వాతే సాయం

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద సాయాన్ని పారదర్శకంగా అందించేందుకు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. ఇకపై సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం పొందాలనుకునేవారు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం ఈ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసింది. ఇందుకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ వెబ్‌సైట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 2న ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా, ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల సర్వర్‌లతోపాటు క్షేత్రస్థాయిలో తహసీల్దార్‌లు జారీ చేసే ఆదాయ ధ్రువపత్రాలకు సంబంధించిన సర్వర్‌తోనూ సీఎంఆర్ఎఫ్‌ను ప్రభుత్వం అనుసంధానం చేసింది. సీఎంఆర్ఎఫ్ కింద గతంలో కేవలం 2వేల ఆస్పత్రులు మాత్రమే ఉండగా, తాజాగా దాదాపు 4వేల ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతేకాకుండా.. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులో పొందుపరిచిన వివరాలు నమ్మదగినవేనా, ఏవైనా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించారా.. అనే వివరాలు తెలుసుకునేందుకు కూడా ప్రత్యేక విధానాన్ని సర్వర్‌లో ఏర్పాటుచేశారు. సీఎంఆర్ఎఫ్ కింద సాయం పొందాలనుకున్నవారు.. ఇకపై ప్రభుత్వాన్ని, సీఎంఆర్ఎఫ్ అధికారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. ఇందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఆ ప్రాంత ఎమ్మెల్యే లేదా, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీని సంప్రదిస్తే సరిపోతుంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ఒక లాగిన్ ఐడీని కేటాయించింది. దీని ద్వారా వారి వద్దకు వచ్చే పేషంట్ల వివరాలను సీఎంఆర్ఎఫ్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

దరఖాస్తు స్టేటస్‌నూ తెలుసుకునే వీలు

దరఖాస్తు అనంతరం అది ఏ దశలో ఉందనే వివరాలను తెలిసేలా కూడా ఏర్పాటుచేశారు. ప్రస్తుతానికి ఈ వివరాలు ప్రజాప్రతినిధుల లాగిన్ ఐడీతో మాత్రమే తెలుసుకునేందుకు అవకాశం కల్పించారు. త్వరలో దరఖాస్తుదారుడి ఐడీ నంబర్‌తోనూ తెలుసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధిని పూర్తిగా ప్రక్షాళన చేయబోతోందని, త్వరలోనే ప్రజాప్రతినిధులకు ప్రత్యేక లాగిన్ ఐడీలు ఇవ్వనుందని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి' జూన్ 8న 'సీఎంఆర్ఎఫ్ ప్రక్షాళన' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. కాగా, సీఎంఆర్ఎఫ్ కింద సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఒక్కో దరఖాస్తుకు గరిష్ఠంగా మూడు నిమిషాల సమయం పట్టనుంది. పేషంట్ పొందిన చికిత్స వివరాలు, అందుకు అయిన ఖర్చుతోపాటు ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా నంబర్, ఫోన్ నంబర్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసినప్పుడు, దానిని ప్రభుత్వం ఆమోదించిన తరువాత, చెక్కు మంజూరుతో కలిపి మొత్తం మూడు దశల్లో దరఖాస్తుదారులకు మూడు ఐడీ నంబర్లు మెసేజ్ రూపంలో రానున్నాయి. అయితే దరఖాస్తు సమయంలో పొందుపరిచే వివరాలకు సంబంధించి పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. కేవలం ఆ వివరాలను నమోదు చేస్తే సరిపోతుంది. దరఖాస్తు అనంతరం ఆయా పత్రాలను ప్రజాప్రతినిధుల వద్ద పనిచేసే సిబ్బంది సీఎంఆర్ఎఫ్ విభాగానికి అందజేస్తారు.

దరఖాస్తులపై లోతైన విచారణ

సీఎంఆర్ఎఫ్ కోసం వచ్చిన దరఖాస్తులపై ప్రభుత్వం 360 డిగ్రీల కోణంలో విచారణ చేయనుంది. ఇందుకోసం ఆన్‌లైన్ పోర్టల్‌కు.. రాష్ట్రంలోని ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను పర్యవేక్షించే సర్వర్‌లను అనుసంధానం చేసింది. తహసీల్దార్లు జారీ చేసే ధ్రువపత్రాలను మీ-సేవల సహాయంతో పరిశీలించనున్నారు. దరఖాస్తుల విచారణలో భాగంగా పేషంట్ తీసుకున్న చికిత్స, అందుకు అయిన ఖర్చును ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులతో మాట్లాడి మరోసారి వివరాలు తెలుసుకుంటారు. పేషంట్ ఇచ్చిన వివరాలు, ఆస్పత్రి తెలిపిన వివరాలు సరిగా ఉన్న దరఖాస్తులకు ఆమోదం తెలుపుతారు. అనంతరం దరఖాస్తుదారుడికి ఎంత మేర సాయం అందించాలన్న వివరాలు కూడా ఆన్‌లైన్‌లోనే తెలుస్తాయి. దాని ప్రకారం లబ్ధిదారుడి పేరిట చెక్కు మంజూరు చేస్తారు. కాగా, సీఎంఆర్ఎఫ్ సాయం కోసం.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన 6 నెలల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

ఇక ఐఏఎస్‌ల వంతు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుత ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శిగా పనిచేసిన స్మిత సభర్వాల్‌కూ.. సోమవారం విచారణకు హాజరు కావాలంటూ కమిషన్ సమన్లు జారీ చేసింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా శైలేంద్ర కుమార్ జోషి పనిచేసిన సంగతి తెలిసిందే. ఆయన సీఎస్‌గా నియమితులైనా నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతల్లో కొనసాగారు. ఆయన హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకి సంబంధించిన చాలా వరకు నిర్ణయాలు జరగడంతో కమిషన్ ఆయన్ను పిలిపిస్తోంది. ఎస్కే జోషీ రిటైరైన తర్వాత కొన్ని నెలల పాటు నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతల్లో సోమేశ్‌కుమార్ వ్యవహరించడంతో.. విచారణకు రావాలంటూ కమిషన్ ఆయననూ ఆదేశించింది. ఇక.. మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శిగా స్మితసభర్వాల్ దాదాపుగా తొమ్మిదిన్నరేళ్లపాటు పని చేశారు. ఈ కాలంలో ఆమె కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆ హోదాలో పర్యవేక్షించారు. దీంతో ఆమెను సైతం కమిషన్ విచారించనుంది. ఇక.. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా కాళేశ్వరం ప్రాజెక్టుకి సంబంధించిన ఆర్థిక అంశాలైన రుణాల సమీకరణ, బడ్జెట్ కేటాయింపులు, బిల్లుల చెల్లింపులు తదితర వ్యవహారాల్లో కీలకపాత్ర పోషించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వి.నాగిరెడ్డి, ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావునూ కమిషన్ విచారణకు పిలిచింది. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నిరుడు పదవీ విరమణ చేసిన రజత్‌కుమార్ సైతం కాళేశ్వరం ప్రాజెక్టుకి సంబంధించిన అదనపు టీఎంసీ పనులకు అనుమతుల జారీ, ఇతర వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించడంతో ఆయన్ను కూడా కమిషన్ పిలిపించింది.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్ అధికారుల విచారణ సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరగనుంది. ఆ తర్వాత.. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విద్యుత్ రంగ నిపుణుడు కె.రఘు మధ్యాహ్నం 2.30 గంటలకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన సాంకేతిక లోపాలు, అవకతవకతలపై సాక్ష్యాధారాలను సేకరించడానికి కమిషన్ ఆయన్ను విచారణకు పిలిచింది.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

» కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కామారెడ్డి టౌన్, జూలై 14: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో డిక్లరేషన్ చేసిందని ఆయన గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాత నిర్వహించాలన్నారు. బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతోనే బీసీలు కాంగ్రెస్‌ను గెలిపించారన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు. ఆదివారం కామారెడ్డిలో 'సమగ్ర కులగణన సాధన యాత్ర' ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సభలో జాజుల మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కులగణన చేపట్టాలన్న డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు ఈ నెల 14 నుంచి 31 వరకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన చేస్తామని హామీ ఇచ్చి బీసీలను మోసం చేసినందుకే బీజేపీ 240 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. బిహార్ సీఎం నితీశ్, ఏపీ సీఎం చంద్రబాబు సామాజిక రిజర్వేషన్ల 50% పరిధిని ఎత్తివేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కోదండరాం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ, కార్యనిర్వహణ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

» ఈ నెల 19 నుంచి 22 వరకు నడపనున్న ఆర్టీసీ

హైదరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలేశ్వరుడి గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. జూలై 21న గురుపౌర్ణమి కావడంతో 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వివరించారు. అరుణాచల గిరి ప్రదక్షిణ ప్యాకేజీ బుకింగ్ కోసం tgsrtcbus.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ప్యాకేజీలో భాగంగా భక్తులు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామితో పాటు శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించే సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు.



ఓయూలో బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

తెల్లవారుజాము దాకా నిరుద్యోగుల ఆందోళన

» అశోక్‌నగర్‌లో 16 మంది అభ్యర్థుల అరెస్ట్

చిక్కడపల్లి/తార్నాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని.. గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన నిరుద్యోగులు ఆదివారం తెల్లవారుజాము వరకు నిరసన కొనసాగించారు. అశోక్‌నగర్ చౌరస్తాలో వందలాది మంది శనివారం రాత్రి ఏడున్నర గంటల నుంచి ఆందోళనకు దిగారు. ఆదివారం తెల్లవారుజామున నాలుగున్నర ప్రాంతంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 16 మందిని వివిధ స్టేషన్లకు తరలించామని, మిగతా వారు వెళ్లిపోయారని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ తెలిపారు. కాగా, సోమవారం నిరుద్యోగులు సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో అశోక్‌నగర్ చౌరస్తాతో పాటు చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓయూ హాస్టళ్లలోకి వెళ్లిన పోలీసులు పలువురు బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు.

త్వరలో స్వదేశానికి సూఫియాన్!

» రష్యా సైన్యంలో పని చేస్తున్న తెలంగాణ వాసి



మహబూబ్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయిన తెలంగాణకు చెందిన సూఫియాన్ త్వరలోనే స్వదేశానికి వస్తాడని అతని కుటుంబసభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా సైన్యంలో ఉన్న భారతీయులను స్వదేశానికి పంపాలని భారత్ ప్రధాని మోదీ చేసిన ప్రతిపాదనకు రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారనే వార్తల నేపథ్యంలో సూఫియాన్ కుటుంబసభ్యులు నమ్మకంగా ఉన్నారు. తెలంగాణలోని నారాయణపేటకు చెందిన సూఫియాన్ పొట్టకూటి కోసం 2021లో దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ దళారి మాటలు నమ్మి 2023 నవంబరులో రష్యా వెళ్లి ప్రస్తుతం యుద్ధభూమిలో పని చేస్తున్నాడు. సూఫియాన్ మాదిరిగానే చాలా మంది రష్యా సైన్యంలో పని చేస్తున్నారు. ఇటీవల రష్యా వెళ్లిన ప్రధాని మోదీ.. అక్కడి సైన్యంలో ఉన్న భారతీయులందరినీ స్వదేశానికి పంపాలని ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌ను కోరారు. అయితే, సూఫియాన్ ప్రస్తుతం యుద్ధభూమికి 70-80 కిలోమీటర్ల దూరంలో పని చేస్తున్నాడని అతని సోదరుడు సల్మాన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. ప్రధాని మోదీ చొరవ వల్ల సూఫియాన్ త్వరలోనే స్వదేశానికి రానున్నాడని తమకు సమాచారం ఉందని చెప్పారు. రాయబార కార్యాలయం నుంచి అధికారిక సమాచారం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు.

ఆహ్వానం లేకుండా అంబానీ పెళ్లికి.. ఏపీకి చెందిన ఇద్దరు యువకుల అరెస్ట్

ముంబై, జూలై 14: రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహ వేడుక కన్నుల పండుగగా జరిగింది. ప్రపంచంలో పేరుగాంచిన సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులెందరో ఈ పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. ముంబైలోని జియో కన్వెన్షన్ సెంటర్‌లో అతిరథ మహారథుల మధ్య అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగిన ఈ వేడుకల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ వాసులు ఆహ్వానం లేకుండా పాల్గొనేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయారు. నిందితుల్లో ఒకరిని యూట్యూబర్ వెంకటేశ్ (26)గా, మరొకరిని వ్యాపారవేత్తగా చెప్పుకుంటున్న షేక్ మహ్మద్ షఫీ (28)గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. పెళ్లి వేడుకల్లో పాల్గొనేందుకు ఈ ఇద్దరూ ఏపీ నుంచి ముంబై వచ్చారని, ఆహ్వానం లేకుండా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో వారిద్దరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వారిని భద్రతా సిబ్బంది అడ్డగించి పోలీసులకు అప్పగించారు. దీంతో వారిని బీకేసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసులు నమోదు చేశారు.



ఇంద్రకీలాద్రిపైకి బంగారు బోనం తీసుకువెళుతున్న కమిటీ సభ్యులు

విజయవాడ కనకదుర్గమ్మకు బంగారు బోనం

» భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల కమిటీ సమర్పణ

చార్మినార్, విజయవాడ(వన్‌టౌన్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మకు ఆదివారం భక్తిశ్రద్ధలతో బంగారు బోనం సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. విజయవాడ బ్రాహ్మణ వీధిలోని ఈవో కార్యాలయం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య చంద్రకళ దంపతులతో పాటు ఈవో కె.ఎస్.రామారావు దంపతులు పాల్గొన్నారు. భారీ ఊరేగింపు, బాజా భజంత్రీల నడుమ పోతరాజుల నృత్యాలతో విజయవాడ కనక దుర్గమ్మ దేవాలయానికి చేరుకున్న బంగారు బోనానికి వేద పండితుల మంత్రోచ్చారణతో స్వాగతం పలికారని నిర్వాహకులు తెలిపారు.





యాదగిరికొండపై భక్తుల రద్దీ

నేడు గిరిప్రదక్షిణ, వన మహోత్సవం

భువనగిరి అర్బన్, జూలై 14: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆషాఢమాసం అయినప్పటికీ సెలవు రోజు కావడంతో సుమారు 30 వేల మంది భక్తులు రాగా.. ప్రత్యేక, ధర్మ దర్శన క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. వీఐపీ టికెట్ దర్శనానికి గంట సమయం, ధర్మ దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.45,68,806 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా, అఖండ దీపారాధనకు, భక్తులు కొబ్బరికాయలు సమర్పించేందుకు ఒకేచోట అధికారులు శాశ్వత ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పు రాజగోపురం ఎదురుగా ధర్మ దర్శనం గోల్డెన్ క్యూలైన్‌లో ఇదివరకే కొబ్బరికాయలు కొట్టేందుకు స్థలం ఏర్పాటు చేయగా, ప్రత్యేక దర్శనం టికెట్ తీసుకుని వెళ్లే భక్తులకు అవకాశం ఉండేది కాదు. దీనిపై విమర్శలు రావడంతో తిరుమల తరహాలో అఖండ దీపారాధన, కొబ్బరికాయలు కొట్టేందుకు ఈశాన్య దిశలో ప్రత్యేక నిర్మాణం మొదలుపెట్టారు. వర్షం కురిస్తే భక్తులు ఇబ్బంది పడుతుండటంతో తూర్పు, త్రితల రాజగోపురాల నడుమ షెడ్డు ఏర్పాటు చేశారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం జరిగిన నేపథ్యంలో సోమవారం జరిగే గిరి ప్రదక్షిణలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఉదయం 6.05 గంటలకు వైకుంఠ ద్వారం నుంచి ప్రారంభమై కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్లు కొనసాగుతుంది. ప్రతి నెలా గిరి ప్రదక్షిణ చేపడుతున్నారు. గత నెల 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సోమవారం నిర్వహించనున్న వన మహోత్సవంలో రెండు వేల మొక్కలు నాటేందుకు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుకుపోయాయి. ప్రధాన రహదారులపై కిలోమీటర్ల ట్రాఫిక్ నిలిచి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మారెడ్‌పల్లి న్యూమెట్టుగూడలో అత్యధికంగా 7.5 సెం.మీ వర్షం కురిసింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, ముషీరాబాద్, మారెడ్‌పల్లి, మల్కాజిగిరి పరిధిలోని లోతట్టు ప్రాంతాలు మునిగి కొన్ని చోట్ల ఇళ్లలోకి నీరు చేరింది. బేగంపేట, ప్రకాశ్‌నగర్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, పంజాగుట్ట ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నిలిచిన వరద నీటిని తొలగించేందుకు జీహెచ్ఎంసీ డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగాయి. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ మాదాపూర్, ఖైరతాబాద్‌లో పర్యటించారు. జోనల్ కమిషనర్లు, ఈవీడీఎం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి.. వరద నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటు వికారాబాద్ పట్టణం, మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లోనూ భారీ వర్షం పడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



అమీర్‌పేటలో..

ఐదుగురిని కాపాడిన యువకులు..

వరదలో కొట్టుకుపోతున్న కారులోని ఐదుగురు వ్యక్తులను ముగ్గురు యువకులు కాపాడారు. ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన ఐదుగురు కారులో వెళ్తుండగా భారీ వర్షం వస్తుండటంతో పార్సిగుట్ట చౌరస్తా వద్ద కారును నిలిపారు. ఈ నేపథ్యంలోనే వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో కారు వరదలో కొట్టుకొని పోసాగింది. అక్కడే ఓ ఇంటి వద్ద నిల్చోని ఉన్న మార్టిన్, ప్రణీత్ యాదవ్, నాగాచారి ఇది గమనించి.. కారును వద్దకు వెళ్లి డోర్లు తీసే ప్రయత్నం చేయగా చుట్టూ నీరుండటంతో ఎంతకూ రాలేదు. దీంతో కారు అద్దాలు పగులగొట్టి అందులోని ఐదుగురిని రక్షించారు. భారీ వర్షం కారణంగా పంజాగుట్టలోని పీవీఆర్ సినిమా థియేటర్‌లోకి నీరు లీక్ అయ్యింది. దీంతో సినిమా ఆపాలంటూ ప్రేక్షకులు థియేటర్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అయితే సినిమా చూడొద్దనుకుంటే వెళ్లొచ్చంటూ వారు నిర్లక్ష్యంగా బదులివ్వటంతో.. 100కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అన్ని పరిశీలించి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ తెలిపారు.

భారీ నుంచి అతి భారీ వర్షాలు..

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని.. మంగళవారం కూడా భారీ వానలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ రెండ్రోజులు ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ కురుస్తాయని పేర్కొంది.



బేగంపేట ప్రకాశ్‌నగర్ ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు

కృష్ణా ప్రాజెక్టులకు పెరిగిన వరద

కృష్ణా బేసిన్‌లో వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులకు మళ్లీ వరద పెరుగుతోంది. ఆల్మట్టి జలాశయానికి 28,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 94.23 టీఎంసీలున్నాయి. దీంతో 15 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 3,414 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 37.65 టీఎంసీలకు.. ప్రస్తుతం 25.83 టీఎంసీలకు చేరుకుంది. జూరాల ప్రాజెక్టుకు కూడా వరద మొదలైంది. 3,271 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. పూర్తిస్థాయి 9.66 టీఎంసీలకు.. ప్రస్తుతం 7.63 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీని నుంచి నెట్టంపాడు, భీమా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోస్తున్నారు. వరి నారుమళ్లు పోసుకోవడానికి జూరాల ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. తుంగభద్రకు 12,194 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఇటు మేడిగడ్డ బ్యారేజీకి 41,200క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు.

పంచాయతీ లేఔట్లపై తెగని పంచాయితీ!

సర్క్యులర్ 257తో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

నాలుగేళ్లుగా కొనుగోలుదారుల ఇబ్బందులు

అనుమతిస్తే భారీగా ఆదాయం వచ్చే అవకాశం

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని పంచాయతీ లేఔట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌పై పంచాయితీ ఇంకా కొనసాగుతూనే ఉంది. పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల సవరణ అనంతరం గత ప్రభుత్వం 2020 ఆగస్టు 26న సర్క్యులర్ 257ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో పంచాయతీల పరిధిలో అనుమతి లేని లేఔట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నాలుగేళ్లుగా నిలిచిపోయాయి. ఈ సర్క్యులర్‌పై కొందరు లేఔట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించగా.. 257 సర్క్యులర్ చట్ట విరుద్ధమంటూ కోర్టు రద్దు చేసింది. అయితే, దీనిపై నాటి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. వాస్తవానికి పంచాయతీల పరిధిలోని లేఔట్లలో ప్లాట్లు తక్కువ ధరకు వస్తుండడంతో చాలా మంది అప్పులు చేసి మరీ కొనుగోలు చేశారు. కానీ, అప్పటి ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ కారణంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోలేక, డబ్బులు వెనక్కి తీసుకోలేక ఆర్థికంగా ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. సర్క్యులర్‌పై కొత్త ప్రభుత్వం కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో గ్రామ పంచాయతీ లేఔట్లు వివాదాలకు కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. అయితే, దీనిపై తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ వాదన మరోలా ఉంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని లేఅవుట్లలో ప్లాట్ల అమ్మకాలు పెంచుకునేందుకు గత ప్రభుత్వం ఈ సర్క్యులర్ జారీ చేసిందని ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కాని ప్లాట్లు 2లక్షల వరకు ఉంటాయని, వీటికి అనుమతి ఇస్తే స్టాంప్ డ్యూటీ, ఎల్ఆర్ఎస్ చార్జీలు, పర్మిషన్ చార్జీల రూపంలో రూ.5వేల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని చెబుతున్నారు. కాగా, సర్క్యులర్ 257సమస్యపై తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ మేరకు స్పందించిన మంత్రి.. పంచాయతీ లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్న వారికి ఏదో ఒక పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

నిరుద్యోగులను రెచ్చగొడుతున్న రేవంత్

వారికిచ్చిన హామీలను నిలబెట్టుకోండి: హరీశ్ రావు



హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు వారి డిమాండ్ల సాధన కోసం రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలియజేస్తుంటే.. కనీసం స్పందించకపోగా.. ముఖ్యమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారంపై దృష్టిపెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రాహుల్‌గాంధీ సహా ఇతర కాంగ్రెస్ నాయకులు గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఇచ్చిన హామీలను పరిష్కరించాలని అభ్యర్థులు కోరుతుంటే.. పరిష్కారం దిశగా ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగుల పోరాటం వెనుక రాజకీయ శక్తులున్నాయంటూ నిందారోపణలు చేయడం ఆక్షేపణీయమని అన్నారు. రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నపుడు నిరుద్యోగుల కోసం మౌన దీక్షకు కూర్చున్న విషయం గుర్తు లేదా..? అని ప్రశ్నించారు. నిరాహార దీక్షలు చేస్తున్న వారెవరూ పరీక్షలు రాయడం లేదని అపహాస్యం చేయడం నిరుద్యోగులను రెచ్చగొట్టడమే అన్నారు. మోతీలాల్ అనే విద్యార్థి గ్రూప్ 1,2,3పోస్టులకు దరఖాస్తు చేసిన విషయాన్ని ఆధారాలతో సహా అభ్యర్థులు బయట పెట్టిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సహా అభ్యర్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసు బలగాలను మోహరించడం, ఇనుప కంచెలు వేయడం, నిరుద్యోగులు, విద్యార్థులను నిర్బంధించడం, ముందస్తు అరెస్టులు చేయడం వంటివి అప్రజాస్వామికమన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా సమస్యలకు కనీస పరిష్కారం చూపలేదన్నారు. భేషజాలకు పోకుండా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఎంను కోరారు.

హరీశ్‌రావు బీజేపీలోకి వచ్చినా రాజీనామా చేయాల్సిందే

» ఆయన వివాదరహితుడు.. ప్రజల మనిషి

» బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రచారం.. ఓ డ్రామా

» కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్/కరీంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రజల మనిషి అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న ఏకైక మంచి వ్యక్తి, వివాదరహితుడు హరీశ్‌రావు మాత్రమేనని ప్రశంసించారు. కేసీఆర్‌తో పాటు, కేటీఆర్ కుటుంబ సభ్యుల మాదిరిగా హరీశ్‌రావు కాదన్నారు. కరీంనగర్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడిన సంజయ్.. హరీశ్‌రావు గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు మంచి నాయకుడు, ప్రజల మనిషి అని.. ఆయన బీజేపీలోకి వచ్చినా రాజీనామా చేసి రావాల్సిందేనని అన్నారు. ఆయనకు మళ్లీ గెలిచే సత్తా ఉందని చెప్పారు. తాను హరీశ్‌రావుతో మాట్లాడలేదని సంజయ్ స్పష్టం చేశారు. ఎవరు రాజీనామా చేసి బీజేపీలో చేరినా వారిని గెలిపించుకునే సత్తా బీజేపీ కార్యకర్తలకు ఉందని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది ఒక రాజకీయ డ్రామా అని సంజయ్ అన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుకోవడానికి కేసీఆర్.. దొంగ హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేక ఆ పార్టీ నాయకులను ఢిల్లీకి పంపి లీకులిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో తనతో పాటు బీజేపీ కార్యకర్తలను ఏ విధంగా హింసించారో, అక్రమ కేసులు పెట్టి జైలులో వేశారో ఎవరూ మరచిపోలేరని అన్నారు. అభివృద్ధిని చూసి పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాట్లాడుతున్న ఆ పార్టీ నేతలు.. చేరిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో గెలిపించాలని బండి సంజయ్ సవాల్ విసిరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వన్ టైం సెటిల్‌మెంట్ ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



నిరుద్యోగులతో రేవంత్ చర్చలు జరపాలి: శంకర్

డీఎస్సీ వాయిదా వేయాలంటూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరపాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వైఖరితో విసిగిపోయిన నిరుద్యోగులు అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌ను విశ్వసించి ఓటేశారని, అందుకే ఆయన చొరవ తీసుకోవాలని అన్నారు.

టీఎస్ఎంఎస్ఐడీసీలో దోపిడీ ముఠా!

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గుప్పిట్లో కార్పొరేషన్.. ఏళ్లుగా ఆయా స్థానాల్లో పాతుకుపోయి అక్రమాలు

» మందుల కంపెనీల నుంచి ముడుపులు

» ఎండీగా కర్ణన్ వచ్చాక పలువురి బదిలీ

» వైద్య మంత్రి పేషీ అండదండలతో ఇద్దరు మాత్రం అక్కడే కొనసాగింపు

» మళ్లీ సంస్థలో పాగా వేసేందుకు బదిలీ అయిన ఉద్యోగి పైరవీలు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ)లో పొరుగు ఉద్యోగుల పెత్తనం సాగుతోంది. కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఒక ముఠాగా మారి, దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల మందులను కొనుగోలు చేసే సంస్థలో కీలక బాధ్యతలన్నీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకే అప్పగించడంతో అక్రమాలకు అంతులేకుండా పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర ఔషధాలకు బదులు అవసరం లేనివి కొనడం, రేటు కాంట్రాక్టులో లేకున్నా కాసులు కురిపించే మందులను కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. కొన్నేళ్లుగా టీఎస్ఎంఎస్ఐడీసీలో జరుగుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

మొన్నటి దాకా ముగ్గురి గుప్పిట్లో..

కొన్ని రోజుల క్రితం వరకు టీఎస్ఎంఎస్ఐడీసీలో ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఒక రిటైర్డ్ కాంట్రాక్టు ఉద్యోగి గుత్తాధిపత్యం చెలాయించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కార్పొరేషన్ ఎండీగా ఐఏఎస్ అధికారి కర్ణన్‌ను నియమించింది. ఆయన వచ్చాక కార్పొరేషన్‌లో ప్రక్షాళన చర్యలు చేపట్టారు. దశాబ్దాలుగా పాతుకుపోయిన వారిని బదిలీ చేశారు. ముఖ్యంగా డయాగ్నస్టిక్స్‌లో పని చేసే ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్టును ఇక్కడి నుంచి వేరే జిల్లాకు పంపారు. డయాగ్నస్టిక్స్‌కు సంబంధించిన రీఏజెంట్ల కొనుగోలులో అతడు చెప్పిందే వేదం అన్నట్టుగా సాగేది. ఆయనకు నచ్చిన, మెచ్చిన... జేబులు నింపే కంపెనీల రీఏజెంట్లనే ఆర్డర్ పెట్టేవాడు. అంతేకాదు సరాఫరాదారులను బెదిరించడం, వారి దగ్గరి నుంచి బలవంతంగా డబ్బులు వసూల్ చేసేవాడు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో అతడిని వేరే జిల్లాకు పంపించారు. అయితే, ఎండీ పోస్టు నుంచి కర్ణన్ బదిలీ కావడంతో సదరు వ్యక్తి మళ్లీ సంస్థలో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కార్యాలయం చుట్టూ రోజూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ఎన్ని లక్షలు ఖర్చయినా ఫర్వాలేదని, తనకు మళ్లీ కార్పొరేషన్‌లో పని చేసే అవకాశం కల్పించాలని పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది. ఆందోల్‌కు చెందిన నేత ద్వారా మంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అతడు కార్పొరేషన్‌లో లేకున్నా సరఫరాదారులకు ఫోన్ చేసి డబ్బులు అడగడమే కాకుండా కార్యాలయానికి వచ్చి గంటల కొద్దీ కూర్చుంటున్నాడు. సంస్థలోని కీలక అధికారి ఆయనకు సహకరిస్తున్నట్లు సమాచారం. ఇక, రిటైరై కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తి అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అరాచకాలకు పాల్పడుతున్నారు. ఉద్యోగులను ఏక వచనంతో సంబోధించడం, కించపర్చడం ఆయనకు పరిపాటేనన్న ఆరోపణలున్నాయి. అన్ని కొనుగోళ్లలో వసూళ్ల పర్వం కొనసాగిస్తారన్న విమర్శలున్నాయి. ఇక క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పని చేసే మరో ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్టు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారన్న ఆరోపణలున్నాయి. ఔషధాలను నాణ్యత పరీక్షలకు పంపి, ఆ రిపోర్టులను చూసే బాధ్యత ఆ ఉద్యోగిదే. దీంతో ఫార్మా కంపెనీలు అతడి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఇలా.. ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులే కోట్ల రూపాయల మేర అక్రమాలకు పాల్పడుతున్నారు. గతంలో అందరినీ బదిలీ చేసినా...ఆ రిటైర్డ్ కాంట్రాక్టు ఉద్యోగి, క్వాలిటీ కంట్రోల్ ఉద్యోగిని మార్చలేదు. వైద్య శాఖ మంత్రి పేషీ అండదండలతోనే వారు అక్కడే కొనసాగుతున్నట్లు తెలిసింది.

రెగ్యులర్ ఉద్యోగులేరి?

ఏటా వందల కోట్ల టర్నోవర్ ఉండే కార్పొరేషన్‌లో రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడం, అంతా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు చేతుల్లో ఉండడంతో అక్రమాలకు అడ్డు లేకుండా పోతోంది. రెగ్యులర్ ఉద్యోగులైతే ఏ తప్పు చేసినా.. వారిపై చర్యలుంటాయి. అదే ప్రైవేటు వ్యక్తులైతే ఉద్యోగం నుంచి తీసేయడం మినహా ఏ చర్యలూ ఉండవు. అందుకే వీరంతా బరితెగిస్తున్నారు. గతంలో కార్పొరేషన్‌లో ఐదుగురు రెగ్యులర్ ఫార్మసిస్టులు ఉండేవారు. ప్రొక్యూర్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్‌కు వేర్వేరుగా జనరల్ మేనేజర్లు ఉండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా పొరుగు ఉద్యోగులను తప్పించి, వారు చేసిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.